# భారత్ శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 245 | హైదరాబాద్ | మంగళవారం 24-03-2026 | పేజీలు : 12 | వెల : 1.00




**ట్రంప్‌తో మేం చర్చలు జరపలేదు... చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు**

: ఇరాన్ ప్రకటన

11లో

### ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే
## రైతుభరోసా ఇస్తున్నారు

- బడ్జెట్‌పై చర్చ సందర్భంగా మాట్లాడిన హరీశ్ రావు
- ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్న హరీశ్ రావు
- తొలి బడ్జెట్‌లో ప్రకటించి, ఆ తర్వాత రూ.12 వేలకు తగ్గించారని ఆరోపణ
- బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అని విమర్శ



11లో

### హైదరాబాద్ ను
## 3 ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

- హైదరాబాద్ ను అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామన్న రేవంత్
- భారీ ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తామని వెల్లడి
- 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్న సీఎం



11లో




### హైదరాబాద్ సహా తెలంగాణలో
## పలుచోట్ల పెట్రోల్ బంకులు మూత!



- ఇంధన కొరతతో తాత్కాలికంగా మూతబడిన పెట్రోల్ బంకులు
- హైదరాబాద్‌లో ప్రధాన కూడళ్లలోని బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు
- తెరిచి ఉన్న బంకుల్లో బారులుతీరిన వాహనదారులు

11లో

### పశ్చిమాసియా సంక్షోభంతో భారత్‌కు
## ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి



11లో

- లోక్ సభలో ప్రధాని మోదీ ప్రసంగం
- పశ్చిమాసియా సంక్షోభం భారత్‌కు ఆర్థికంగా, భద్రతాపరంగా పెను సవాల్ అని ప్రధాని మోదీ
- కోటి మంది ప్రవాస భారతీయుల భద్రతకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్న ప్రధాని
- ఇప్పటికే 3.75 లక్షల మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని వెల్లడి
- దేశంలో ఎరువుల కొరత లేదు, ఆర్థిక వ్యవస్థ పునాదులు బలంగా ఉన్నాయని స్పష్టీకరణ



11లో

## సౌదీలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు



## శ్రీరామనవమి శోభాయాత్రకు భాగ్యనగరం రెడీ!

- 3 వేల మందితో భారీ బందోబస్తు.. డ్రోన్ల తో నిఘా..
- డీజేలు వద్దు.. నార్మల్ సౌండ్ సిస్టమ్ వాడాలి.
- మధ్యాహ్నం 1 గంటకే యాత్ర ప్రారంభించాలి: సీపీ సజ్జనర్
- జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ తో కలిసి రూట్ మ్యాప్ పరిశీలన

12లో

### 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను
## తీసుకొచ్చాం.. ఇదీ మా స్పీడు

- అనకాపల్లిలో ఆర్సెలర్ మిట్టల్ ఉక్కు కర్మాగారానికి శంకుస్థాపన
- లక్ష మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పనే లక్ష్యం
- రెండు దశల్లో 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయనున్న పరిశ్రమ
- 20 నెలల్లోనే ప్రాజెక్టును సాకారం చేశామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- స్టీల్ ప్లాంట్‌తో పాటు రూ.11,198 కోట్లతో క్యాప్టివ్ పోర్టు, ప్రత్యేక రహదారి నిర్మాణం



11లో

### ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం
## డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన

- 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటన
- రెండు రోజులుగా ఇరాన్, అమెరికా మధ్య జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని వెల్లడి
- ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నామని ప్రకటన



11లో

# సంపాదకీయం

## రికార్డుల రారాజు

ప్రధాని నరేంద్ర మోదీ అరుదైన మైలురాయిని చేరుకున్నారు. మన దేశంలో సుదీర్ఘకాలం పాటు ప్రభుత్వాధినేతగా బాధ్యతలు నిర్వహించిన వ్యక్తిగా నరేంద్ర మోదీ సరికొత్త రికార్డును క్రియేట్ చేశారు. నేడు మార్చి 22, ఆదివారం రోజున ఈ అరుదైన రికార్డును ఆయన సొంతం చేసుకున్నారు. తాజాగా మోదీ.. సిక్కిం మాజీ సీఎం పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డును అధిగమించారు. పవన్ కుమార్ చామ్లింగ్ పేరిట 8,930 రోజుల పాటు ముఖ్యమంత్రిగా సేవలందించిన రికార్డు ఉండేది. తాజాగా మోదీ దానిని అధిగమించారు.గుజరాత్ సీఎంగా, దేశ ప్రధానిగా ప్రభుత్వాధినేత హోదాలలో నరేంద్ర మోదీ 8,931 పనిదినాలను పూర్తి చేసుకున్నారు. దీంతో పవన్ కుమార్ చామ్లింగ్ రికార్డు బద్దలైంది. ప్రధాన మంత్రి కాకముందు మోదీ.. దీర్ఘకాలం పాటు గుజరాత్ సీఎంగా వ్యవహరించి రికార్డు క్రియేట్ చేశారు. వరుసగా నాలుగు సార్లు ఆయన ముఖ్యమంత్రిగా సేవలందించారు.2001 అక్టోబరు 7 నుంచి 2002 డిసెంబరు 22 వరకు, 2002 డిసెంబరు 22 నుంచి 2007 డిసెంబరు 22 వరకు, 2007 డిసెంబరు 23 నుంచి 2012 డిసెంబరు 20 వరకు

2012 డిసెంబరు 20 నుంచి 2014 మే 22 వరకు నాలుగు సార్లు గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ బాధ్యతలు నిర్వహించారు.భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధానమంత్రిగానూ మోదీ నిలిచారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సాధించిన ఘన విజయాల్లో మోదీ పాత్రే కీలకం. స్వాతంత్ర్యానంతరం జన్మించి, దీర్ఘకాలం ప్రధానిగా ఉన్న కాంగ్రెసేతర తొలి నేతగా మోదీ నయా రికార్డు క్రియేట్ చేశారు. అలాగే కేంద్రంలో రెండు సార్లు పదవీ కాలాన్ని పూర్తి చేసుకుని, మూడోసారి అధికారం చేపట్టిన తొలి కాంగ్రెసేతర నేతగా కూడా రికార్డు నెలకొల్పారు. జవహర్‌లాల్ నెహ్రూ తర్వాత భారతదేశానికి అత్యధిక కాలం ప్రధానిగా ఉన్న రెండో నేతగా కూడా మోదీ నిలిచారు. మోదీనాయకత్వంలో మోదీ 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. స్వాతంత్ర్యం తర్వాత జన్మించిన తొలి ప్రధాని కూడా ఆయనే కావడం ప్రత్యేకత. ప్రజల విశ్వాసం, బలమైన నాయకత్వం ఆయన విజయాలకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు.తన హయాంలో దేశవ్యాప్తంగా పలు కీలక పథకాలు అమలు చేశారు. 'నారీశక్తి', 'యువశక్తి', రైతుల సంక్షేమం, డిజిటల్ ఇండియా, మేక్ ఇన్ ఇండియా, స్టార్ట్-అప్ ఇండియా వంటి కార్యక్రమాలు దేశ అభివృద్ధికి బలమైన పునాది వేశాయి. గత దశాబ్దంలో కోట్లాది మంది పేదరికం నుంచి బయటపడ్డారని ప్రభుత్వం పేర్కొంటోంది.తన తల్లి ఇచ్చిన విలువలు తన రాజకీయ జీవితానికి మార్గదర్శకమయ్యాయని మోదీ తరచూ పేర్కొంటారు. పేదల కోసం పని చేయడం, అవినీతి దూరంగా ఉంచుకోవడం వంటి సూత్రాలు ఆయన పాలనలో ప్రతిఫలిస్తున్నాయని అంటున్నారు. ప్రజాసేవను అత్యున్నత కర్తవ్యంగా భావిస్తున్నానని ఆయన పలుమార్లు స్పష్టం చేశారు.మోడీ నాయకత్వంలో భారత్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక స్థానాన్ని సంపాదించింది. అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ట పెరిగింది. విదేశీ పెట్టుబడులు, మౌలిక వసతుల అభివృద్ధి, సాంకేతిక రంగాల్లో పురోగతి దేశాన్ని "వికసిత భారత్" లక్ష్యానికి దగ్గర చేస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు.ఇక "వికసిత్ భారత్" లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని మోదీ స్పష్టం చేశారు. రాజ్యాంగ విలువలను కాపాడుతూ, సమగ్ర అభివృద్ధి సాధించడం తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. దేశ ప్రజల ఆశీర్వాదం, మద్దతుతో మరింత సేవ చేయాలని ఆయన ఆకాంక్షించారు.ప్రభుత్వాధినేత హోదాలో 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా 2025 అక్టోబరులో దేశ ప్రజలకు ప్రధాని మోదీ ధన్యవాదాలు చెప్పారు. 2001లో గుజరాత్ సీఎంగా ప్రమాణం చేసినప్పటి నుంచి ఇప్పటిదాకా ప్రజల జీవితాలను మెరుగుపర్చేందుకు, దేశ వికాసం కోసమే తాను పనిచేశానని ఆయన తెలిపారు. భీకర భూకంపం నుంచి గుజరాత్ రాష్ట్రం కొద్దికొద్దిగా కోలుకుంటున్న తరుణంలో తాను తొలిసారి గుజరాత్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేశానని, అది చాలాపెద్ద పరీక్షా కాలమని మోదీ గుర్తుచేసుకున్నారు. ఆ సమయానికి గుజరాత్‌ను రాజకీయ అస్థిరత, సూపర్ సైక్లోన్ విపత్తు, దారుణమైన కరువులు కుదిపేశాయని చెప్పారు. ఈ సవాళ్లను చూసి, ఎలాగైనా గుజరాత్ రాష్ట్రాన్ని పునర్ నిర్మించాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నానని ఆయన తెలిపారు. కొత్త ఆశ, కొత్త శక్తితో సీఎంగా తొలి టర్మ్‌లో పనిచేశానని మోదీ పేర్కొన్నారు.పేదల కోసమే పనిచేయమని, ఎన్నడూ లంచం తీసుకోవద్దని తల్లి ఇచ్చిన సలహాలే తన ప్రజా జీవితానికి మార్గదర్శనాన్ని అందించాయని ప్రధాని మోదీ గతేడాది అక్టోబరులో తెలిపారు. తన పాలన వల్ల కరువు ప్రభావిత, ఆర్థిక బలహీన గుజరాత్ రాష్ట్రం సుపరిపాలనకు పవర్ హౌజ్‌గా మారిపోయిందన్నారు. వ్యవసాయం, పరిశ్రమలు, మౌలిక సదుపాయాల రంగాల్లో రాష్ట్రం ఎంతో పురోగతిని సాధించిందని ఆయన పేర్కొన్నారు. భారతదేశం పాలనాపరమైన, విశ్వాసపరమైన సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న వేళ 2013లో తనను ప్రధానమంత్రి అభ్యర్థిగా బీజేపీ ప్రకటించిందని మోదీ తెలిపారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో భారత ప్రజలంతా కలిసి తమ పార్టీకి పట్టం కట్టారన్నారు. గత 11 ఏళ్ల పాలనలో 25 కోట్ల మందికిపైగా దేశ ప్రజలను పేదరికం నుంచి బయటికి తీసుకొచ్చానని ఆయన చెప్పారు.

# చంద్రబాబును బుక్ చేసిన చిరంజీవి

విజయవాడ, మార్చి 23,

తెలంగాణలో గద్దర్ అవార్డుల ప్రదానోత్సవంలో మెగాస్టార్ చిరంజీవిచేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. ఆయన నోటి నుంచి వచ్చిన కొన్ని మాటలు అభ్యంతరకరంగా ఉన్నాయి. అనవసరంగా ఆయన ఆ వ్యాఖ్యలు చేశారా? అని అనిపించేలా ఉన్నాయి. ఆయనకు ఎన్టీఆర్ జాతీయ అవార్డు ఇచ్చారు. అయితే చిరంజీవి నందమూరి తారక రామారావు గురించి ఒక్క ప్రస్తావన కూడా చేయలేదు. ఆయన పేరుతో అవార్డు తీసుకున్నందుకు ఒకటి రెండు మాటలు అయినా చెప్పి ఉండాల్సింది. కానీ ఎందుకో చిరంజీవి ఎన్టీఆర్ ప్రస్తావన తీసుకురాలేదు. సహజంగానే ఏదైనా అవార్డులు ఎవరి పేరు మీద అయినా తీసుకుంటే వారి గురించి ప్రస్తావించడం అనేది ముఖ్యం. కానీ ఎందుకో చిరంజీవి ఆ విషయంలో పొరపాటు చేసినట్టు కనిపించారు. అయితే వెంటనే దానిని సరిదిద్దుకున్నారు. ఎన్టీఆర్ అవార్డు తీసుకోవడం పై ట్వీట్ చేశారు. ఆయన పేరుతో అవార్డు తీసుకోవడం పై ఆనందం వ్యక్తం చేశారు.అయితే అదే వేదికపై పక్క రాష్ట్రం అని ఏపీని ఉద్దేశించి చిరంజీవి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఆంధ్రప్రదేశ్ను పక్క రాష్ట్రం తో పోల్చడం ఏమిటని విమర్శలు వచ్చాయి. తెలంగాణ వేదికగా ఏపీ పక్క రాష్ట్రం కావచ్చు కానీ.. సాటి తెలుగు రాష్ట్రం. అందున సినిమా రంగానికి చెందిన వ్యక్తిగా ఆ మాట అనకూడదు. మరోవైపు కళారంగాన్ని ఆదరించడం, సినీ పరిశ్రమను ప్రోత్సహించడంలో పక్క రాష్ట్రం వెనుకంజలో ఉందని చిరంజీవి వ్యాఖ్యానించారు. అంటే నంది అవార్డులను ఇవ్వాలన్నది చిరంజీవి అభిమతం గా తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి..తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పక్కన ఉండగానే ఏపీ సీఎం చంద్రబాబు ప్రస్తావన తీసుకొచ్చారు చిరంజీవి. నంది అవార్డులను పునరుద్ధరించే విషయంలో చంద్రబాబు ఒక ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేశారు. తద్వారా చంద్రబాబు నంది అవార్డులను నిలిపివేశారన్న అభిప్రాయం వచ్చేలా చిరంజీవి వ్యాఖ్యలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. ఆయన సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తి. ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకున్న పవన్ కళ్యాణ్ అభిప్రాయం తీసుకుంటూ వస్తుందనలో సందేహం లేదు. అందులోనూ సినీ పరిశ్రమకు సంబంధించిన పూర్తి వ్యవహారాలన్నీ పవన్



కళ్యాణ్ చూస్తారు. సినిమాటోగ్రఫీ మంత్రిగా జనసేనకు చెందిన కందుల దుర్గేష్ ఉన్నారు. ఆ ఇద్దరికీ చెబితే ఇట్టే పని జరిగిపోతుంది. కానీ చిరంజీవి మాత్రం చంద్రబాబు ప్రస్తావన తీసుకురావడం విమర్శలకు తావిస్తోంది. అనవసరంగా చంద్రబాబును ఇందులో ఇన్వాల్వ్ చేయడం ఏమిటనేది ఒక ప్రశ్న. ఏపీలో నంది అవార్డులను నిలిపివేసింది జగన్మోహన్ రెడ్డి. వాస్తవానికి తెలుగుదేశం 2014లో అధికారంలోకి వచ్చిన తర్వాత నంది అవార్డులను ఇచ్చింది. అయితే 2017లో మొత్తం నాలుగు సంవత్సరాలకు సంబంధించి అవార్డులను ప్రదానం చేశారు. కానీ ఆ సమయంలో సొంతవారికి అవార్డులు ఇచ్చుకున్నారు అన్న విమర్శలు వచ్చాయి. ఇదే సినీ పరిశ్రమకు చెందిన చాలామంది వ్యక్తులు విమర్శలు చేశారు.. అటు తరువాత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం నంది అవార్డులను పూర్తిగా ఇవ్వలేదు. కానీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు కనీసం నోరు తెరవలేదు. పోనీ కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు ఎవరు సీఎం చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలవలేదు. అటువంటప్పుడు నంది అవార్డుల విషయంలో చిరంజీవి ప్రత్యేకంగా ఇప్పుడు ఏపీ ప్రభుత్వాన్ని చిన్నచూపు చూసి మాట్లాడడం ఏమిటనేది ప్రశ్న.రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం విషయంలో సినీ పరిశ్రమ ఒకలా ఉంటుంది. ఏపీ ప్రభుత్వం విషయంలో మరోలా వ్యవహరిస్తోంది. ఎందుకంటే తెలంగాణలో సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తుల ఆస్తులు, పెట్టుబడులు ఎక్కువగా ఉన్నాయి. అందుకే వారి ఆసక్తి ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం విషయంలో భయము ఉంటుంది. కానీ ఏపీ మాత్రం కేవలం ప్రేక్షక వర్గానితోపాటు వీక్షక వర్గానికి మాత్రమే పరిమితం అయింది. కేవలం ఆదాయం ఇస్తుందే తప్ప సినీ పరిశ్రమ పెద్దలకు ఇక్కడ ఆస్తులు లేవు. అందుకే ఏపీ ప్రభుత్వం పై నోరు మెదిపే సినీ పరిశ్రమ వ్యక్తులు.. తెలంగాణ ప్రభుత్వం పై మాత్రం చాలా జాగ్రత్తగా మాట్లాడుతారు.

అయితే చిరంజీవి చివరిగా ఒక మాట చెప్పారు. సినీ పరిశ్రమను ప్రోత్సహిస్తేనే జీడీపీ పెరుగుతుందనేది చిరంజీవి వాదన. కానీ ఒక చిన్న పరిశ్రమ ఏడాది లావాదేవీలకు కూడా చిత్ర పరిశ్రమ సాటి రాదు అన్న విషయాన్ని గుర్తు చేసుకోవాలి. వేలాదిమందికి ఉపాధినిస్తుంది ఓకే. సంప్రదాయ సాంస్కృతిక రంగం సినిమా. అంతవరకు ఓకే కానీ.. రాష్ట్ర అభివృద్ధిలో కీలకం అన్న విషయం మాత్రం ఉత్తమాటే. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో చిత్ర పరిశ్రమ ఒక్కటే. నంది అవార్డుల పేరిట ఉన్న దానిని మార్చి గద్దర్ పేరిట ఇస్తున్నారు. ఇప్పుడు మళ్లీ ఏపీ ప్రభుత్వం ఇస్తే ఆ అవార్డులకు పెద్దగా ప్రాధాన్యం ఉండదు. బహుశా ఏపీ ప్రభుత్వం ఆ ఆలోచనతోనే నంది అవార్డులను పునరుద్ధరించలేదు. కానీ చిరంజీవి వేదికపై యధాలపంగా మాట్లాడిన వ్యాఖ్యలు ఇంతటి దుమారానికి దారి తీయడం మాత్రం ఆందోళన కలిగిస్తోం

# జనసేనలో అరవ రచ్చ

కడప, మార్చి 23,

జనసేన పార్టీలో అంతర్గత పరిణామాలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా లైంగిక ఆరోపణలు ఎదుర్కొన్న రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం జనసేన అధిష్టానానికి, స్థానిక నాయకత్వానికి పెద్ద తలనొప్పిగా మారింది. పరిపాలనలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనదైన ముద్ర వేయాలని చూస్తుంటే, పార్టీలోని అంతర్గత విభేదాలు మాత్రం తీవ్రమవుతున్నాయి. తాజాగా అరవ శ్రీధర్ వ్యవహారం పార్టీలో సెగలు రేపుతోంది పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనను పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని అధిష్టానం ఆదేశాలు ఇచ్చింది. త్రిసభ్య కమిటీని కూడా వేసి విచారణ జరిపింది. ఈ క్రమంలో ఆయనపై కేసులు కూడా నమోదు అయ్యాయి. ఇక చర్యలు తీసుకున్నట్లు వార్తలు వచ్చినప్పటికీ, ఆయన మళ్ళీ పార్టీ జెండాతో కార్యక్రమాలు నిర్వహించడం వివాదానికి కేంద్రబిందువైంది. పార్టీ పరంగా ఆయన దూరంగా ఉండాలని అధిష్టానం చెప్పినా, శ్రీధర్ మాత్రం క్షేత్రస్థాయిలో జనసేన జెండాతో పర్యటనలు చేయడం స్థానిక నేతలను అయోమయంలో పడేస్తోంది.అరవ శ్రీధర్ తనకంటూ ఒక ప్రత్యేక వర్గాన్ని ఏర్పాటు చేసుకుని కార్యక్రమాలు నిర్వహిస్తుండటం సమాంతర వ్యవస్థగా మారిందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇది కేడర్ మధ్య చీలికకు దారితీస్తోందని అధిష్టానానికి ఫిర్యాదులు అందుతున్నాయి.

కొన్ని సందర్భాల్లో పార్టీ విధానాలకు విరుద్ధంగా వ్యక్తిగత నిర్ణయాలు తీసుకోవడం, ఇటీవల జరిగిన కొన్ని పార్టీ అంతర్గత సమావేశాల్లో అరవ శ్రీధర్ అంశం చర్చకు వచ్చినట్లు సమాచారం. పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు ఇప్పటికే కొంతమంది నేతలు ఆయనను హెచ్చరించినట్లు తెలుస్తోంది.పార్టీ నుండి ఎలాంటి పిలుపు లేకపోయినా, కీలక నాయకులు పాల్గొనే సభల్లో, కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షం కావడం స్థానిక నేతలకు ఇబ్బందిగా మారింది. జనసేనను ఇరుకున పెట్టడానికి వైసిపి వంటి ప్రత్యర్థి పార్టీలకు అరవ శ్రీధర్ వ్యవహారం ఒక ఆయుధంగా మారింది. ఒకవైపు క్లీన్ ఇమేజ్ కోసం ప్రయత్నిస్తున్న జనసేనకు, అరవ శ్రీధర్ లాంటి వ్యక్తుల వల్ల కలిగే డ్యామేజ్ తక్కువేమీ కాదు.

# కన్నబాబుకు వ్యతిరేకంగా కాంట్రాక్టర్లు...

విజయవాడ, మార్చి 23,

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి పనులు ఊపందుకున్నాయి. ఈ పనులు ఇదే వేగంతో కొనసాగాలని, 2029 ఎన్నికల నాటికి అమరావతి పూర్తి చేయాలని చాలా మంది కోరుకుంటున్నారు. అయితే ఇలాంటి సమయంలో ఏపీసీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు బదిలీ కావడం రాజకీయ, పరిపాలనా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. 2025 జనవరిలో బాధ్యతలు చేపట్టిన ఆయన, కేవలం 14 నెలల కాలంలోనే బదిలీ కావడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అంతకుముందు ఉన్న కాటమనేని భాస్కర్ కూడా కేవలం 7-8 నెలలు మాత్రమే పనిచేశారు. అమరావతి వంటి భారీ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో ఇలా తరచుగా కమిషనర్లను మార్చడం వల్ల పనుల వేగంపై ప్రభావం పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.కన్నబాబు బదిలీ వెనుక అధికారికంగా ఎలాంటి సమాచారమూ లేదు. అయితే ఆయన బదిలీకి అనేక కారణాలున్నాయని అమరావతి వర్గాలు చెప్తున్నాయి. ముఖ్యంగాకన్నబాబు అమరావతి పనులను పర్యవేక్షించడానికి ఒక 'డాష్ బోర్డు'ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏ కాంట్రాక్టర్ ఎంత శాతం పని పూర్తి చేశారో స్పష్టంగా తెలిసేది. కొంతమంది కాంట్రాక్టర్లు కేవలం 5 నుంచి 20శాతం మాత్రమే పనులు పూర్తి చేసినట్లు ఇందులో తేలింది. ఈ పారదర్శకత వల్ల ఇబ్బంది పడ్డ కొందరు కాంట్రాక్టర్లు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారని సమాచారం.కన్నబాబు ప్రవేశపెట్టిన కొత్త సాఫ్ట్‌వేర్ విధానం వల్ల కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో ఆలస్యం జరుగుతోందని, దీనిపై




వారు సీఎం కార్యాలయానికి ఫిర్యాదు చేశారని తెలుస్తోంది. మాజీ సీఎస్ ఒకరు కొందరు ఐఏఎస్ అధికారులతో నిర్వహించిన రహస్య సమావేశానికి కన్నబాబు హాజరయ్యారనే రూమర్ కూడా ఉంది, అయితే ఇందులో ఎంతవరకు నిజం ఉందనేది తెలీదు. ప్రారంభంలో ఆయనపై రైతుల సమస్యల పట్ల అవగాహన లేదనే విమర్శలు వచ్చాయి. అయితే తర్వాత ఆయన చాలా సమస్యలను పరిష్కరించారు. అయినా ఆయన బదిలీ కావడం పలువురిని ఆశ్చర్యపరిచింది.అమరావతి నిర్మాణం అంటే కేవలం రోడ్లు, బిల్డింగ్‌లే కాదు.. ఇందులో భూ సమీకరణ, పర్యావరణ అంశాలు, టెక్నికల్ ఇష్యూస్ వంటి ఎన్నో సంక్లిష్టతలు ఉన్నాయి. కన్నబాబు స్థానంలో విజయరామరాజు నియమితులయ్యారు. ఆయన ఎంత సమర్థుడైనప్పటికీ, ఇంతటి సంక్లిష్టమైన ప్రాజెక్టుపై పూర్తి అవగాహన పెంచుకోవడానికి కనీసం ఏడాది సమయం పట్టవచ్చు. ఇది పనుల పురోగతిని మందగించేలా చేసే అవకాశం ఉంది. ఒక కీలకమైన ప్రాజెక్టు పూర్తి కావాలంటే కనీసం 3-4 ఏళ్ల పాటు ఒకే కమిషనర్‌ను కొనసాగిస్తే బాగుంటుంది. ఇలా తరచూ మార్పులు చేయడం వల్ల ప్రాజెక్టు లక్ష్యాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.అయితే కన్నబాబు ఆకస్మిక బదిలీ వెనుక అనేక రకాల ప్రచారాలు ఉన్నాయి. అధికార వర్గాల్లో సైతం విస్మయం వ్యక్తం అవుతోంది. రాజకీయ కారణాలతోనే కన్నబాబు బదిలీ జరిగిందన్నది ప్రధాన అనుమానం. ఇటీవల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో సిఎస్ గా పనిచేసిన వ్యక్తి ఒక ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన సలహాలు సూచనల కోసమే ఈ సమావేశం పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. ఈ సమావేశానికి కన్నబాబు హాజరయ్యారని ఒక టాక్ అయితే ఉంది. ఇది తెలిసి ప్రభుత్వం వేటు వేసిందని ప్రచారంలో ఉంది. కానీ ఒక ఐఏఎస్ అధికారిగా సిఆర్డిఏ కమిషనర్ లాంటి పెద్ద పోస్టులో ఉండడం గొప్ప విషయం. అంతకంటే ఇంకా ఏం కావాలని ఆయన జగన్మోహన్ రెడ్డి ప్రాపకం కోసం ప్రయత్నిస్తారు అనేది ఒక అనుమానమే. అది అంత మాత్రం వాస్తవం కాదన్న వారు ఎక్కువ మంది ఉన్నారుమరోవైపు అమరావతి రైతుల నుంచి ఫిర్యాదులు రావడంతోనే కన్నబాబును మార్చారన్న ప్రచారం ఉంది. అయితే ఈ విషయంలో మాత్రం వాస్తవం ఉంది. కన్నబాబు ప్రారంభంలో బాధ్యతలు తీసుకున్న సమయంలో ఇటువంటి ఫిర్యాదులు వచ్చాయి. కానీ వాటన్నింటినీ అధిగమించి కన్నబాబు బాగానే సెట్ అయ్యారు సి ఆర్ డి ఏ కమిషనర్ గా. మరోవైపు కాంట్రాక్టర్ల ఫిర్యాదు నేపథ్యంలోనే బదిలీ చేశారన్న వాదన ఉంది. ఇటీవల కన్నబాబు ఒక సాఫ్ట్వేర్ తయారు చేశారు. అమరావతి పనులకు సంబంధించిన ప్రగతి ఎప్పటికప్పుడు గుర్తించే సాఫ్ట్వేర్ అన్నమాట. ఒక డాష్ బోర్డు మాదిరిగా ఆ సాఫ్ట్వేర్ తయారు చేశారు. అయితే దీనిపై కాంట్రాక్టర్లు ఆవేదనతో ఉన్నారు. ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతోనే కన్నబాబును తొలగించారు అన్నది ఒక వాదన.అమరావతి రాజధాని అనేది ఒక వ్రతంలా చేయాలి. ఒక ఉద్యమంలా నిర్మాణం చేపట్టాలి. దేశంలోనే అతిపెద్ద ప్రాజెక్టు అది. అటువంటి ప్రాజెక్టుకు సిఆర్డిఏ కమిషనర్ కీలకం. కానీ ఇలా ఎప్పటికప్పుడు కమిషనర్లు మార్చడం ద్వారా ఆ ప్రభావం పనులపై పడుతుంది. ప్రభుత్వం ఈ విషయంలో మాత్రం సరైన నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఇప్పటికీ అమరావతి రాజధాని పనుల్లో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఇటువంటి సమయంలో రకరకాల కారణాలు చెప్పి కమిషనర్లను మార్చడం మాత్రం సహేతుకం కాదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అయితే ఇప్పుడు వస్తున్న కమిషనర్ విజయరామరాజు శాశ్వతమా? తాత్కాలికమా? అన్నది తెలియాల్సి ఉంది.

## స్టెరాయిడ్ విక్రయం.. ఇద్దరు అరెస్టు

హైదరాబాద్ , మార్చి 23,
హైదరాబాద్ పాతబస్తీ చదర్ఘాట్లో నిషేధిత స్టెరాయిడ్ ఇంజెక్షన్ల విక్రయిస్తున్న ముఠా గుట్టు ను చార్మినార్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు రట్టు చేసారు. ఓల్డ్ మలక్ పేట కి చెందిన షేక్ సమీర్, వసీం ఖాన్లను నిషేధిత స్టెరాయిడ్ మెఫెంటర్మైన్ ఇంజెక్షన్లు విక్రయిస్తున్నరు అనే సమాచారం తో వీరిని అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుండి 20 స్టెరాయిడ్ ఇంజెక్షన్లు , 3 ఫోన్లు, ఒక బైక్ లను సీజ్ చేశారు. ఢిల్లీ నుంచి కొరియర్ ద్వారా తెప్పించి అక్రమంగా అమ్ముతున్నట్లు పోలీసులు విచారం లో నిందితులు వెల్లడించారు. మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.

## ఉప్పల్, బాగయత్ లో బైక్ ను ఢీకొన్న టిప్పర్ వాహనం

### నాగోల్ కు చెందిన తుమ్మ శారద(46) అక్కడికక్కడే మృతి..

మేడ్చల్ , మార్చి 23,
ఉప్పల్ ఏసియన్ థియేటర్ నుండి నాగోల్ వైపు మహిళ బైక్ పై వెళ్తుండగా ఉప్పల్ బాగాయత్ లో బాలాజీ వైన్స్ సమీపంలో టిప్పర్ వాహనంద్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంగా వాహనం నడిపి ఆమె వాహనాన్ని వెనక నుండి ఢీకొట్టాడు. దీంతో ఆమె కింద పడిపోయి అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలు తుమ్మల శారద 946). సమాచారం అందుకున్న ఉప్పల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు.

## కొత్తూరు మండల కేంద్రంలో ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

### వాహనచోదకులకు అవగాహన కల్పించిన ఎస్ఐ కె. వెంకటేష్

శ్రీకాకుళం , మార్చి 23,
కొత్తూరు మండలం : మండల కేంద్రం కొత్తూరులో స్థానిక ఎస్ఐ కె వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక శ్రీకాకుళం రోడ్డులో ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించి విజిబుల్ పోలిసింగ్ పై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, బైక్ లు నడిపేవారికి తప్పకుండా హెల్మెట్ ఉండాలని సూచించారు. గంజాయి, మత్తు పదార్ధాలు అక్రమంగా రవాణా చేయటం నేరమని వాహనాలకు సరియైన పత్రాలు లేనివారి దగ్గర, డ్రైవింగ్ లైసెన్స్ లు లేని వారి నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. సరైన పత్రాలు లేనివారిపై కేసులు నమోదు చేశారు.అలాగే రోడ్డు భద్రత నియమాలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేసుకోవాలని ఎస్సై కె.వెంకటేష్ వారికి అవగాహన కల్పించారు.ఈ ముమ్మర తనిఖీల్లో కొత్తూరు ఏఎస్సై గోవిందరావు, హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరావుతో పాటు మిగతా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏస్ వాహనం బోల్తా?పలువురికి గాయాలు

అన్నమయ్య , మార్చి 23,
బి.కొత్తకోట (మం) పర్యాటక కేంద్రం హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులో పెనుప్రమాదం తప్పింది. హార్సిలీ హిల్స్ ఘాట్ రోడ్డులోని మూడవ మలుపు వద్ద స్టీరింగ్ రాడ్ తెగిపోవడంతో టాటా ఏస్ వాహనం బోల్తాపడింది. మదనపల్లి నుండి పదిమంది కుటుంబ సభ్యులతో కలిసి హార్సిలీ హిల్స్ సందర్శనకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘాట్ రోడ్లలో గూడ్స్ వాహనాలలో ప్రజలు నిర్లక్ష్యంగా వెళ్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడంలేదు. ...

## క్యూ నెట్ కార్యాలయాలపై దాడులు

హైదరాబాద్ , మార్చి 23,మల్టీ లెవల్ మార్కెటింగ్ పేరుతో వందల కోట్ల రూపాయల వసూళ్లకు పాల్పడిన క్యూ నెట్ సంస్థపై సీసీఎస్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. హైదరాబాద్, విజయవాడ, వైజాగ్, బెంగళూరు నగరాల్లోని ఆరు చోట్ల ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తాజాగా నమోదైన రెండు కేసుల ఆధారంగా ఈ దాడులు చేపట్టారు. సుమారు 20 మంది నిందితులను పోలీసులు గుర్తించారు. మిగిలిన వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

## సంతోష్ నగర్ లో యువకుడి హత్య

హైదరాబాద్ మార్చి 23,సంతోష్ నగర్లో.ఆదివారం రాత్రి సయ్యద్ లాయక్( 26) అతని స్నేహితులే హత్య చేశారు. నిందితులు ఆదిల్ మరియు సల్మాన్ అలియాస్ గోలీగా పోలీసులు గుర్తించారు. వీరంతా స్నేహితులు మరియు 'గంజా మాస్టర్స్'గా ప్రసిద్ధి చెందారు. ఇటీవల వీరందరూ క్రిమినల్ కేసుల్లో జైలు పాలయ్యారు. మృతుడిని హిందూ శ్మశానవాటిక వద్దకు పిలిచి కత్తులతో హత్య చేశారు.

# కొత్త జిల్లాల వారీగా జడ్పీలకు రంగం సిద్ధం

విజయవాడ, మార్చి 23,
ఆంధ్రప్రదేశ్‌లో పాలనా వికేంద్రీకరణ దిశగా మరో కీలక అడుగు పడబోతోంది. కేవలం రెవెన్యూ జిల్లాలకే పరిమితం కాకుండా, స్థానిక సంస్థల పరిధిలోనూ సమూల మార్పులకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ముఖ్యంగా జిల్లా పరిషత్తుల పునర్విభజన ప్రక్రియ ద్వారా గ్రామీణ పాలనను మరింత ప్రజలకు చేరువ చేసేందుకు రంగం సిద్ధమైంది.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 13 జిల్లాలను 26 జిల్లాలుగా మార్చినప్పుడు, అది కేవలం రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికే పరిమితమైంది. కానీ, క్షేత్రస్థాయిలో నిధుల మంజూరు, గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో కీలక పాత్ర పోషించే జిల్లా పరిషత్తులు మాత్రం పాత 13 జిల్లాల ప్రాతిపదికనే కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఆ పరిస్థితి మారబోతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం, పోలవరం జిల్లాలతో కలిపి రాష్ట్రంలోని 28 జిల్లాల్లోనూ ప్రత్యేక జిల్లా పరిషత్తులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.జిల్లా పరిషత్తుల పునర్విభజన కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదు, అది ఒక రాజ్యాంగబద్ధమైన ఆవశ్యకత. ప్రస్తుత జడ్పీ పాలకవర్గాల గడువు ఈ ఏడాది సెప్టెంబరు 24తో ముగియనుంది. చట్టప్రకారం, గడువు ముగిసేలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం, ప్రతి జిల్లాకు ఒక జిల్లా పరిషత్తు ఉండాలి. ప్రస్తుతం ఉన్న 13 జడ్పీలు 28 జిల్లాలను కవర్ చేయడం సాంకేతికంగా, పరిపాలనాపరంగా ఇబ్బందికరంగా మారింది. 15వ ఆర్థిక సంఘం నిధులు లేదా ఇతర కేంద్ర పథకాల నిధులు జిల్లా జనాభా, భౌగోళిక విస్తీర్ణం ఆధారంగా జిల్లా పరిషత్తులకు అందుతాయి. కొత్త జడ్పీలు ఏర్పడితే, వెనుకబడిన ప్రాంతాలకు నిధులు నేరుగా అందే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం ఈ ప్రక్రియ ముందున్న అతిపెద్ద సవాలు జనగణన. ఏప్రిల్ 1 నుంచి జనగణన ప్రారంభం కానున్న నేపథ్యంలో, కేంద్ర నిబంధనల ప్రకారం జిల్లాలు లేదా మండలాల సరిహద్దులను మార్చడానికి వీల్లేదు. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై కేంద్రానికి ప్రత్యేక విజ్ఞప్తి చేయాలని భావిస్తోంది. "కొత్త జిల్లాల్లో జడ్పీలు ఏర్పాటు చేయకపోతే ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదు" అనే పాయింట్‌ను ప్రభుత్వం బలంగా వినిపించనుంది. కేంద్రం మినహాయింపు ఇస్తేనే, నోటిఫికేషన్ విడుదల చేసి జడ్పీల విభజనను పూర్తి చేసే అవకాశం ఉంటుంది.ప్రస్తుతం రాష్ట్రంలో 13 మంది జడ్పీ చైర్మన్లు మాత్రమే ఉన్నారు. పునర్విభజన జరిగితే ఆ సంఖ్య 28కి పెరుగుతుంది. ఇది రాజకీయంగా ద్వితీయ శ్రేణి నాయకత్వానికి పెద్దపీట వేస్తుంది. కలెక్టర్ కార్యాలయం ఒకచోట, జడ్పీ కార్యాలయం మరోచోట ఉండటం వల్ల ప్రస్తుతం సమన్వయ లోపం ఉంది. కొత్త జడ్పీలు వస్తే, జిల్లా అభివృద్ధి ప్రణాళికలు మరింత వేగంగా అమలు అవుతాయి. కొత్త జడ్పీల ఏర్పాటులో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను మినహాయించి కేవలం గ్రామీణ ప్రాంతాలనే పరిగణనలోకి తీసుకుంటారు. దీనివల్ల గ్రామీణ సమస్యలపై ఫోకస్ పెంచే అవకాశం ఉంటుంది.

# మంత్రి పదవి కోసం స్పీడ్ తగ్గించారా

నెల్లూరు, మార్చి 23,
కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. ఏపీ పాలిటిక్స్‌లో పరిచయం అక్కరలేని పేరు. 2014, 2019లో రెండుసార్లు వైసీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కోటంరెడ్డి..గత ఎన్నికలకు ముందు ఫ్యాన్ స్విచ్చాఫ్ చేసి సైకిల్ ఎక్కారు. నెల్లూరు రూరల్‌లో మూడోసారి విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గుర్తింపు పొందారు. అలాంటి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఫైర్ బ్రాండ్ లీడర్‌గా..ఓవైపు వైసీపీని టార్గెట్ చేస్తూనే..మరోవైపు నియోజకవర్గ అభివృద్ధిపై ఫోకస్ పెడుతూ వచ్చారు. వందల కోట్ల నిధులతో నెల్లూరు రూరల్‌లో ఓ రేంజ్‌లో డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టి సీఎం చంద్రబాబుతో ప్రశంసలు పొందారు. పనితీరులో రాష్ట్రవ్యాప్తంగా 32వ స్థానం, నెల్లూరులో ఫస్ట్ ప్లేస్ సొంతం చేసుకున్న ఎమ్మెల్యే కోటంరెడ్డికి..విస్తరణలో మంత్రి పదవి పక్కా అంటూ ప్రచారం జరుగుతోంది. అందుకు తగ్గట్లే ఆయన కూడా దూకుడు పెంచుతూ వచ్చారు. కానీ కొన్ని రోజులుగా ఆయన తన రూట్‌ను మార్చినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.అయితే ఎమ్మెల్యే కోటంరెడ్డికి నెంబర్ వన్ ప్లేస్ దక్కడం..సీఎం చంద్రబాబు దగ్గర ప్రశంసలు పొందడం వెనుక ఎమ్మెల్యే కోటంరెడ్డి సోదరుడు గిరిధర్ రెడ్డి కృషి ఎంతో ఉందన్నది పబ్లిక్ టాక్. ఎమ్మెల్యే కోటంరెడ్డి నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేనప్పుడు ఆ లోటు కనిపించకుండా గిరిధర్ రెడ్డి ప్రజల్లో తిరుగుతూ అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తున్నారట. ఒక్క మాటలో చెప్పాలంటే కోటంరెడ్డి గిరిధర్ రెడ్డే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అని ప్రజలు చెప్పుకునేలా వందల కోట్లతో అభివృద్ధి పనులను దగ్గరుండి జరిపిస్తున్నారట. ఇలా కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి పనులను పరుగులు పెట్టించడం వల్లే ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి మంచి పేరు, ప్రశంసలు దక్కుతున్నాయని తెలుగు తమ్ముళ్లే చర్చించుకుంటున్నారట.అయితే ఒక పక్క మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నప్పటికీ ఎమ్మెల్యే కోటంరెడ్డి నెక్స్ట్ టార్గెట్ తన తమ్ముడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డిని ఎమ్మెల్యేను చేసుకోవడమేనట.

ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నుంచి తాను పోటీ చేయనని తన తమ్ముడే ఎమ్మెల్యేగా పోటీ చేస్తారని పలు సందర్భాల్లో చెప్పారు కోటంరెడ్డి. సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు అమాత్య ఆశలను కూడా అలా పక్కన పెట్టి..నియోజకవర్గంపైనే ఫుల్ ఫోకస్ పెట్టారట కోటంరెడ్డి.రెండేళ్లు పూర్తికాక ముందే నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో రూ.613 కోట్లతో చంద్రన్న రహదారులు, చంద్రన్న పార్కులు, చంద్రన్న వెలుగులు, బ్రిడ్జిల అభివృద్ధి పనుల జాతర చేపట్టారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఎక్కడా అవినీతికి తావు లేకుండా..ప్రతి పైసా ఖర్చు వివరాలను ప్రజలకు తెలిపేలా ఒక బుక్ లెట్ తయారు చేసి పబ్లిక్ డొమెయిన్‌లో ఉంచారట. అభివృద్ధి పనులకు సంబంధించిన బుక్లెట్‌ను సీఎం చంద్రబాబుకు కూడా చూపించారట ఎమ్మెల్యే కోటంరెడ్డి. వీటిలో కొన్ని పూర్తి కాగా..ఇంకొన్ని చివరి దశలో..మరి కొన్ని టెండర్ల దశలో ఉన్నాయని అంటున్నారు. ఇటీవల 339 పనులను ఒకేసారి స్థానిక ప్రజలతో శంకుస్థాపన చేసి 60 రోజుల్లోనే పూర్తి చేసి రికార్డు సృష్టించారు కోటంరెడ్డి. మరోసారి రూ.27 కోట్లతో ఈ నెల 22న స్థానిక ప్రజల చేత 240 చోట్ల ఒకేసారి ప్రారంభోత్సవాలు చేసేందుకు సిద్ధమవుతున్నారట.

పక్కా వ్యూహం ప్రకారమే నియోజకవర్గ డెవలప్‌మెంట్‌కు టాప్ ప్రయారిటీ ఇస్తున్నారట కోటంరెడ్డి. తనకు మంత్రి పదవి వస్తే సంతోషం. కానీ వచ్చే ఎన్నికల్లో తమ్ముడిని ఎమ్మెల్యే చేసి తీరాలని పట్టుదలతో ఉన్నారట. కోటంరెడ్డికి అమాత్య యోగం ఎప్పుడు దక్కుతుందో? సోదరుడిని ఎమ్మెల్యే చేసేందుకు ఆయన చేస్తున్న ప్రయత్నాలు ఎంతవరకు సక్సెస్ అవుతాయో చూడాలి.

# తిరుమలలో క్రెడిట్ వార్

తిరుమల, మార్చి 23,తిరుమలలో తాజాగా ప్రారంభమైన 'ఫుడ్ సేఫ్టీ ల్యాబ్' క్రెడిట్ విషయంలో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఈ ల్యాబ్ ఏర్పాటు తన చొరవతోనే జరిగిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. 'క్రెడిట్ చోరీ' చేయడంలో చంద్రబాబు కొత్త రికార్డులు సృష్టిస్తున్నారంటూ ఎద్దేవా చేసింది.జగన్ హయాంలోనే పునాది: గత జగన్ ప్రభుత్వ హయాంలోనే తిరుమల నాణ్యతా ప్రమాణాల కోసం ల్యాబ్ ఏర్పాటు చేయాలని ఈఊాంఎకి ప్రతిపాదనలు పంపినట్లు వైఎస్సార్‌సీపీ తెలిపింది.ఆగస్టు 2023లోనే ప్రకటన: దీనికి సంబంధించి



ఆగస్టు 2023లో ఈఊాంఎ సీఈఓ కమలవర్ధన్ రావు టీటీడీ అధికారులతో సమావేశమయ్యారని, ఆ రోజే ల్యాబ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారని గుర్తు చేస్తూ ఒక వీడియోను విడుదల చేసింది.ట్విట్టర్ వేదికగా విమర్శలు: గత ప్రభుత్వం చేసిన కృషిని ఇప్పుడు తన ఖాతాలో వేసుకోవడం చంద్రబాబుకు అలవాటుగా మారిందని, ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని వైసీపీ ట్వీట్ చేసింది.తిరుమల లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారం దేశవ్యాప్తంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో భక్తుల నమ్మకాన్ని కాపాడేందుకు సుమారు రూ. 20 కోట్ల వ్యయంతో, అత్యాధునిక పరికరాలతో టీటీడీ ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీనిని సీఎం చంద్రబాబు ప్రారంభించగా, ఇది

# భవిష్యత్తును నిర్ణయించే 13 జిల్లాలు...

## సిలిగురి కారిడార్ కీలకం..

కోల్ కత్తా, మార్చి 23,
రత దేశం యొక్క రాబోయే 20 నుంచి 30 ఏళ్ల భవిష్యత్తును దేశంలోని కేవలం 13 జిల్లాల జనాభా స్వరూప స్వభావాలు నిర్ణయించబోతున్నాయి. ఈ 13 జిల్లాల జనాభా 2.80 లక్షల చదరపు కిలోమీటర్ల భూభాగాన్ని, అది భారత్‌లో ఉంటుందా.. వెళ్లిపోతుందా వేరే దేశం అవుతుందా అన్నది నిర్ధారిస్తుంది. ఈ 2.80 లక్షల చదరపు కిలోమీటర్లు 7 రాష్ట్రాలతో కలిసి ఉన్నాయి. ఈ 13 జిల్లాలు అత్యంత కీలకమైన సిలిగురి కారిడార్ 100 కి.మీ పొడవు. 22 కి.మీ వెడలప్పు ఉన్న ఈ కారిడార్‌కు సమీపంలో అస్సోం, అరుణాచల్ ప్రదేశ్, నాగాలాండ్, మేఘాలయ, మిజోరాం, త్రిపుర రాష్ట్రాలకు చెందిన 13 జిల్లాలు రాబోయే పది ఇరవై ఏళ్లలో భారత దేశంపు భాగ్యాన్ని నిర్ధారించడంతోపాటు ఇండియా మ్యాప్ ఎలా ఉంటుందో డిసైడ్ చేస్తుంది.

సిలిగురి 100 కి.మీ. పొడవు, 22 కి.మీ. వెడల్పు కలిగిన చిమటాగా ఈశాన్య భారతంలోని 7 రాష్ట్రాలను దేశ మిగిలిన భాగంతో కలుపుతుంది. ఈ కారిడార్ సమీపంలో బిహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్‌లోని 13 జిల్లాలు ఉన్నాయి, ఇవి 2.8 లక్ష చ.కి.మీ. విస్తీర్ణాన్ని కలిగి ఉన్నాయి. ఈ ప్రాంతాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భవిష్యత్తును, దేశ మ్యాప్ స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తాయి.బిహార్‌లోని అరరియా, పూర్ణియా, కటిహార్, కిషన్‌గంజ్ జిల్లాలు 38?68% ముస్లిం జనాభా కలిగి ఉన్నాయి. బంగ్లాదేశ్‌కు సమీపంలో ఉన్నాయి. మొత్తం జనాభాలో బంగ్లాదేశ్ నుంచి వచ్చినవారే ఎక్కువ. ఇక పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా, ముర్షిదాబాద్, ఉత్తర దినాజ్‌పూర్ కూడా ముస్లిం జనాభా కలిగిన దేశాలే. ఉత్తర బెంగాల్‌కు కీలకం, హిందూ?ముస్లిం సమతుల్యం జార్ఖండ్‌కు చెందిన పాకూరు, గోడ్డా, సాహిబ్‌గంజ్, దుమ్కా, జమతారా, దేవఘర్ గిరిజన జిల్లాలు 44 శాతం ఉన్న వీరి జనాభా ఇప్పుడు 22 శాతానికి పడిపోయింది. ఇక ముస్లిం జనాభా 7 శాతం నుంచి 24 శాతానికిపెరిగింది. ఈ జిల్లాల్లో ముస్లిం జనాభా పెరుగుదల బంగ్లాదేశ్ చొరబాటు, సంఘటనా ప్రభావాలతో ముడిపడి ఉంది.1946 ముస్లిం లీగ్ తీర్మానం ఈ జిల్లాలను బెంగాల్‌లో కలపాలని డిమాండ్ చేసింది. శ్యామాప్రసాద్ ముఖర్జీ ప్రయత్నాలతో హిందూ బలమైన ప్రాంతాలు బెంగాల్‌లో ఉంచబడ్డాయి.

1956 వరకు ఈ ప్రాంతాల్లో విభజన ఉద్రిక్తతలు కొనసాగాయి. పాకిస్తాన్ 1940 నుంచి ఈ జిల్లాలపై కన్ను పెట్టింది.13 జిల్లాల జనాభా మార్పులు ఈశాన్య రాష్ట్రాల భద్రతను, రాజకీయ శక్తిని ప్రభావితం చేస్తాయి.

బీజేపీ బలం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ప్రతిపక్ష ఆధిపత్యం పెరిగే అవకాశం. ఇటీవల బిహార్ నేత ప్రకటనలు సిలిగుడి 'నెక్'ను లక్ష్యంగా చేసుకున్నాయి. 2050 నాటికి భారత్ 170 కోట్ల జనాభాకు చేరుకుంటుంది, ఈ ప్రాంతాలు దానిలో కీలక పాత్ర పోషిస్తాయి.

జనాభా అసమతుల్యత భారత్‌లో ఉత్తర?దక్షిణ విభేదాలను పెంచుతోంది. ఈశాన్య భద్రతా ప్రణాళికలు, జనాభా నిర్వహణ విధానాలు తప్పనిసరి. రాబోయే జనాభా లెక్కలు ఈ ట్రెండ్‌ను స్పష్టం చేస్తాయి, దేశ ఐక్యత కాపాడటానికి చర్యలు తీసుకోవాలి.

# కాంగ్రెస్‌కు వరుస షాక్

గౌహాతి, మార్చి 23,
శంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. నామినేషన్ల ప్రక్రియ కూడా మొదలైంది. పొత్తులు, సీట్ల సర్దుబాట్లు కూడా కొలిక్కి వచ్చాయి. నామినేషన్లు వేసిన అభ్యర్థులు, పార్టీలు ప్రచారం జోరు కూడా పెంచుతున్నాయి. అయితే కాంగ్రెస్‌కు ఈ ఎన్నికలు కీలకంగా మారాయి. అస్సాం, కేరళ, పుదుచ్చేరి, తమిళనాడులో కాంగ్రెస్ బలంగా కనిపిస్తోంది. అయితే ఈ సమయంలో ఆ పార్టీ నేతలు షాక్ ఇస్తున్నారు. పార్టీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు భూపేంద్ర బోరా తర్వాత మార్గరీటా ఎంపీ ప్రద్యుత్ బోర్గులై రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన కుమారుడు ప్రతీక్ కూడా పార్టీ టిక్కెట్ తిరస్కరించి పోటీకి సిద్ధం కాదని ప్రకటించడంతో పార్టీకి మరింత షాక్.ప్రద్యుత్ బోర్గులై, నాగావ్ లోక్‌సభ స్థానం నుంచి రెండుసార్లు గెలిచిన కాంగ్రెస్ ఎంపీ, అంతర్గత విభేదాల కారణంగా పార్టీకి రాజానామా చేశారు. భూపేంద్ర బోరా రాజీనామా తర్వాత ఇది మరో దెబ్బ. మార్గరీటా అసెంబ్లీ స్థానానికి ప్రతీక్ బోర్గులై ప్రకటించింది కాంగ్రెస్. అయితే తాను పోటీ చేయనని తెలిపారు. ఈ సంఘటనలు పార్టీ స్థిరత్వాన్ని దెబ్బతీశాయి.ప్రద్యుత్ రాజీనామాతో పాటు 80 మంది కీలక కార్యకర్తలు కాంగ్రెస్ వదిలేశారు.

ఎన్నికల ముందే ఈ సంఖ్యలో వలసలు పార్టీ ఓటు బ్యాంకును బలహీనప రుస్తున్నాయి. బీజేపీ ముఖ్య మంత్రి హిమంత బిశ్వ శర్మ మీడియా ద్వారా మాజీ కాంగ్రెస్ నేతలను ఆకర్షిస్తూ పార్టీ బలం పెంచుకుంటోంది.

కాంగ్రెస్‌లో అభ్యర్థి ఎంపిక, నాయకత్వ విభేదాలు ప్రధాన కారణాలు.

ఒకప్పుడు అస్సాంలో బలమైన పార్టీగా ఉన్న కాంగ్రెస్, బీజేపీ ఆధిపత్యం ముందు బలహీనపడుతోంది. రాహుల్, ప్రియాంక గాంధీ ప్రయత్నాలు విఫలమవ్రుతున్నాయి. ఈ వలసలు ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతాయి

.బీజేపీ ఈ సందర్భాన్ని ఉపయోగించుకుని కాంగ్రెస్ బలహీనతను హైలైట్ చేస్తోంది. మార్గరీటా స్థానంలో తండ్రి?కొడుకుల విభజన రాజకీయ ఆసక్తిని రేపుతోంది. కాంగ్రెస్ ఈ సంక్షోభాన్ని అధిగమించకపోతే అస్సాంలో మరింత బలహీనపడుతుంది.

# ముద్రగడకునో చెప్పిన జగన్

కాకినాడ, మార్చి 23,
రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభానిది ప్రత్యేక స్థానం. 1978లోనే చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి తో పాటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. కానీ రాజకీయంగా స్థిరత్వం ఉండదన్న విమర్శ ఆయనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ టిడిపి నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్ లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బిజెపి.. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. మొన్నటి ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. వీలుకాకపోయేసరికి వైసీపీలో చేరారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు కొత్త డిమాండ్ పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. కానీ జగన్ మాత్రం ఆలోచనలో పడినట్లు సమాచార ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం గట్టిగానే పనిచేశారు. ఏకంగా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయకపోతే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని సవాల్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అయితే ముద్రగడ పద్మనాభం పెద్దరికాన్ని గౌరవించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ అడ్వైజరీ కమిటీలో ఆయనకు స్థానం ఇచ్చారు. అయితే ఈ కమిటీ టిడిపి పొలిట్ బ్యూరో మాదిరిగా కాదు. పెద్దగా అధికారాలు కూడా ఉండవు. అందుకే తనకు పార్టీలో పెద్ద పదవి ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం ఉభయ గోదావరి జిల్లాల బాధ్యతలను తనకు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఆయనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు




చాలామంది విభేదిస్తున్నట్లు సమాచారం. ఎప్పుడో పాతకాలపు రాజకీయాలు అనుసరిస్తుంటారు ముద్రగడ పద్మనాభం. అందుకే పెద్దగా ఎవరికీ నచ్చరు. ఏ కాపు రిజర్వేషన్ ఉద్యమంతో ముందుకు వెళ్లారు అదే కాపులు ఇప్పుడు ఆయనను నమ్మేస్థితిలో లేరు. మరోవైపు గోదావరి జిల్లాలో జనసేన ప్రభావం అధికంగా ఉంది. ఇటువంటి సమయంలో ముద్రగడ పద్మనాభం కు ఉపయోగ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే జగన్ ఆ పదవి ఇచ్చేందుకు అంగీకరించరు. మరోవైపు చూస్తే ముద్రగడ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభారంతో ఇబ్బందులు ఉన్నాయి. అయితే జగన్ ఇప్పుడు పదవి ఇవ్వకపోతే ముద్రగడ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చూడాలి.

# భారం... భారం...

న్యూఢిల్లీ, మార్చి 23,
ఇరాన్?అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తోంది. హార్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం, గల్ఫ్ దేశాల్లోయిని ఆయిల్ రిఫైనరీలు, ఎల్పీజీ కంపెనీలపై ఇరాన్ చేస్తున్న దాడులతో క్రూడ్ ఆయిల్ సరఫరా, ఎల్పీజీ, ఎల్ఎన్జీ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 105 డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలో అన్ని దేశాలు ఆయిల్ ధరలు పెంచుతున్నాయి. మన దేశంలో గ్యాస్ ధర పెరిగింది. మరోవైపు వంటనూనెతోపాటు చాలా రకాల వస్తువులపై యుద్ధం ప్రభావం పడింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ఇది ప్రజల జీవన ఖర్చులను మరింత భారపడేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది.రెండు వారాల్లోనే అనేక కీలక ఉత్పత్తులు, సేవల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇది ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావాల వల్లేనా, లేక ఇతర కారణాలా అనే చర్చకు దారితీసింది.కాంగ్రెస్ పార్టీ తెలిపిన వివరాల ప్రకారం వాణిజ్య సిలిండర్ ధర రూ.100కుపైగా పెరిగింది. గృహ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. వంట నూనెల ధర రూ.10 నుంచి రూ.30 వరకు పెరిగింది. పారిశ్రామిక డీజిల్ లీటర్‌కు రూ.20కిపైగా పెరిగింది. అధిక గ్రేడ్ పెట్రోల్ లీటర్‌కు రూ.2కుపైగా పెరిగింది. ఫుడ్ డెలివరీ సర్వీస్‌లు ఆర్డర్‌కు రూ.2 పెంచాయి. విమాన చార్జీలు రూ.400 నుంచి రూ.2,000 వరకు పెరిగాయి. ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సెట్‌కు రూ.30?50 వరకు పెరిగింది. కుకింగ్ అప్లయన్స్‌లు (ఇండక్షన్) ధరలు 35?45% పెరిగాయి. ఇవి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి,

ఎందుకు పెరిగాయంటే..

అంతర్జాతీయ ఆయిల్ ధరలు, డాలర్ విలువ పెరగడం, రూపాయి విలువ పతనం. ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు. ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీలు, సబ్సిడీలు తగ్గించడం వల్ల కూడా ప్రజలపై భారం పడుతోందని కాంగ్రెస్ ఆరోపణ. మరోవైపు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యలు, ఇన్‌ఫ్లేషన్ ఒత్తిడి కూడా పాత్ర వహిస్తున్నాయి. రెండేళ్లలో ఇలాంటి ట్రెండ్ కొనసాగుతోంది.ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఇంకా అధికారికంగా స్పందించలేదు, కానీ మునుపటి సందర్భాల్లో ట్యాక్స్ కట్స్, సబ్సిడీలు ప్రకటించింది. అయితే, ఇది తాత్కాలిక పరిష్కారాలేనని విమర్శకులు అంటున్నారు. ప్రజలు ఇప్పటికే కిచెన్ బడ్జెట్‌లు దెబ్బతింటున్నాయి. ధరలు నియంత్రించడానికి ప్రభుత్వం లాంగ్?టర్మ్ విధానాలు అవసరం. లేదంటే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలపై దీని ప్రభావం పడే అవకావం ఉంటుంది.

## గచ్చిబౌలి, రాయదుర్గంలలో
# భారీగా పెరిగిన ఇళ్ల రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మార్చి23,
హైదరాబాద్ నగరంలో ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. గత ఫిబ్రవరి నెలలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు 32 శాతం మేర పెరిగాయి. అధిక విలువ కలిగిన ఇళ్లకు అధికంగా డిమాండ్ ఉన్నట్లు నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక తెలిపింది. గౌచ్చిబౌలి, రాయదుర్ఘం, నార్సింగి ప్రాంతాల్లో అధిక విలువ ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదైనట్లు పేర్కొంది. అత్యధికంగా ఒక్క ఫ్లాట్ రూ.8.90 కోట్లు పలికినట్లు తెలిపింది. మరి ఆ వివరాలు తెలుసుకుందాం.హైదరాబాద్ మహానగరం వేగంగా విస్తరిస్తున్న సంగతి తెలిసిందే. ఈ ప్రాంతంలో సొంతిల్లు కొనుగోలు చేయాలనుకుంటున్న వారి సంఖ్యా పెరుగుతోంది. దీంతో ప్రస్తుతం ఇళ్లకు మంచి డిమాండ్ ఉంది. హైదరాబాద్ ప్రాంతంలో ఇళ్ల రిజిస్ట్రేషన్లు పెరిగాయి. గత ఏడాది ఫిబ్రవరి నెలలో 5988 ట్రాన్సాక్షన్లు జరిగితే ఈ ఏడాది 2026 6179కి పెరిగాయి. ఇయర్ ఆన్ ఇయర్ ప్రాతిపాదికన చూసుకుంటే రెండు శాతం వృద్ధి నమోదైంది. ఈ ఏడాది 2026, జనవరి నెలలో 4686 యూనిట్లతో పోలిస్తే ఫిబ్రవరి నెల రిజిస్ట్రేషన్లు 32 శాతం పెరిగినట్లు ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ నైట్ ఫ్రాంక్ ఇండియా శుక్రవారం విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది.హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌లో ఇళ్ల ట్రాన్సాక్షన్లు ప్రైమరీ, సెకండరీ మార్కెట్లో జరుగుతుంటాయి. కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల్లో నేరుగా బిల్డర్ నుంచి కొనే మార్కెట్‌ను ప్రైమరీగా పరిగణిస్తారు. ఈ నివాసాలను తిరిగి అమ్మితే ఒక యజమాని నుంచి మరొక వ్యక్తి కొనుగోలు చేస్తారు. దీన్ని సెకండరీ మార్కెట్ గా గుర్తిస్తారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలతో పాటుగా సంగారెడ్డి జిల్లాలోని కొంత భాగం కూడా హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పరిధిలోకి వస్తుంది. ఫిబ్రవరి నెలలో మొత్తం 28 రోజులో అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరిగినట్లు నివేదిక పేర్కొంది.రిజిస్ట్రేషన్ ట్రాన్సాక్షన్లలో కోటి రూపాయలు అంత కంటే ఎక్కువ విలువైన ఇళ్ల వాటా 18 శాతంగా ఉన్నట్లు నివేదిక తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 6 శాతం పెరిగాయి. సగటు చదరపు అడుగు విలువ ఏడాది కాలంలో మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలో 3 శాతం, రంగారెడ్డి జిల్లాలో 6 శాతం, సంగారెడ్డి జిల్లాలో 7 శాతం మేర ధరలు పెరిగాయి. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల సగటు చదరపు అడుగు రూ.4457 గా ఉంది. ఫిబ్రవరి నెలలో రూ.4139 కోట్ల విలువైన ట్రాన్సాక్షన్లు జరిగితే వాటిలో కోటి రూపాయలపై విలువ కలిగిన ఇళ్ల విలువే 48 శాతంగా ఉందిఅధిక విలువ ఉన్న నివాస లావాదేవీలు ఐటీ కేంద్రంగానే అధికంగా జరిగాయి. అత్యధికంగా 3 వేల చదరపు అడుగుల కంటే అధిక వైశాల్యం కలిగినవి ఉన్నాయి. విలువ పరంగా మొదటి నాలుగు ట్రాన్సాన్లు గమనిస్తే నార్సింగిలో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ విలువ రూ.8.90 కోట్లు నమోదైంది. ఆ తర్వాత గచ్చిబౌలిలో రూ.7.93 కోట్లు, రాయదుర్గంలో రూ.6.54 కోట్లు, షేక్ పేట్‌లో రూ.6.34 కోట్లతో ఒక్కో ఫ్లాట్ రిజిస్ట్రేషన్ జరిగింది. నెలల వారీగా చూసుకుంటే హైదరాబాద్ నగరంలో జనవరిలో 2025లో 5464 రిజిస్ట్రేషన్లు జరగగా 2026లో 4686 ఇళ్లు అమ్ముడయ్యాయి. ఇక ఫిబ్రవరి నెలలో 2025లో 5988 యూనిట్లు రిజిస్టర్ కాగా అది ఫిబ్రవరి నెలలో 6179గా నమోదైందివిస్తీర్ణం పరంగా చూసుకుంటే 500 చదరపు అడుగు లోపు ఫ్లాట్లు రిజిస్ట్రేషన్లు 3 శాతం పెరిగాయి, 501-1000 చ.అ.లోపు ఇళ్లు 15 శాతం, 1001-2000లోపు ఇళ్లు 66 శాతం, 2001-3000 చ.అ.లోపు ఇళ్లు 13 శాతం, 3000 పైన ఇళ్లకు 3 శాతం రిజిస్ట్రేషన్లు పెరిగాయి. జిల్లాల వారీగా చూస్తే హైదరాబాద్ నెలలో 14 శాతం, మేడ్చల్-మల్కాజిగిరిలో 45 శాతం, రంగారెడ్డిలో 41 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయి.

# అడ్డంగా బుక్కైన రోహిత్...

హైదరాబాద్, మార్చి23,
తాండూరు మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో జరిగిన మాదకద్రవ్యాల పార్టీకి సంబంధించి కీలక నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణ సాగిస్తున్న క్రమంలో విస్మయకర వాస్తవాలు కళ్ళ ముందు కనిపిస్తున్నాయి. మొదట్లో ఈ వ్యవహారం వెనక దుబాయ్ ఆస్తులు.. బినామీ వ్యక్తులు ఉన్నారని ప్రచారం జరిగింది. అయితే అంతకుమించిన దారుణమైన నిజాలు ఈ వ్యవహారం వెనుక ఉన్నాయని సమాచారం.ఈ పార్టీకి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన అభిషేక్ సింగ్ ప్రస్తుతం మహేశ్వరం ఎస్ఓటి పోలీసుల అదుపులో ఉన్నారు. ఆయనను శంషాబాద్ తరలించారు. అక్కడ ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారులు విచారణ సాగిస్తున్నారు. రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ ఇచ్చిన వాంగ్మూలం ఆధారంగా అభిషేక్ సింగ్ ను పోలీసులు విచారించారు. రోహిత్ రెడ్డి, అభిషేక్ మధ్య అనేక పర్యాయాలు మాదకద్రవ్యాల కొనుగోలు జరిగినట్టు తెలుస్తోంది. వీరిద్దరి మధ్య జరిగిన ఫోన్ కాల్ సంభాషణలను కూడా పోలీసులు గుర్తించినట్టు సమాచారం. బ్యాంకు ఖాతాల ఆధారంగా రోహిత్ రెడ్డి భారీగానే నగదును అభిషేక్ కు బట్వాడా చేసినట్టు తెలుస్తోంది. మొత్తంగా ఐదు వీకెండ్ పార్టీలలో అభిషేక్ రోహిత్ రెడ్డికి మాదక ద్రవ్యాలను సరఫరా చేసిన సమాచారం. గతంలో 14 సార్లు.. వీకెండ్ పార్టీలు కలుపుకొని మొత్తం 19 సార్లు రోహిత్ రెడ్డి కి అభిషేక్ మాదకద్రవ్యాలను సరఫరా చేసినట్టు సమాచారం.వ్యవసాయ క్షేత్రంలో జరిగిన పార్టీలో రోహిత్ రెడ్డి డ్రైవర్ శరత్ కుమార్ కు అభిషేక్ నిషేధిత మత్తు పదార్థం అందించిన సమాచారం. ప్రత్యేక దర్యాప్తు బృందం అధికారుల విచారణలో ఇదే తేలింది. అభిషేక్ కు భారీగా నెట్వర్క్ ఉందని.. అందులో చాలామంది కస్టమర్లు ఉన్నారని సమాచారం.అభిషేక్ ఐటీ ఉద్యోగిగా పని చేస్తున్నాడని.. అతడు మాదకద్రవ్యాలను సరఫరా చేస్తున్నాడని.. గోవా, బెంగళూరు ప్రాంతంలో ఉన్న నైజీరియన్ వ్యక్తుల వద్ద నిషేధిత మత్తు పదార్థాలను కొనుగోలు చేసి
.. హైదరాబాద్ నగర శివారు ప్రాంతంలో ఉన్న వ్యవసాయ క్షేత్రాలు.. వీకెండ్ పార్టీలకు సరఫరా చేస్తాడని సమాచారం. ఈ



క్రమంలోనే రోహిత్ రెడ్డి.. బాబిలోన పబ్ నిర్వాకుడు అర్జున్ రెడ్డికి.. నిషేధిత మత్తు పదార్థాలను అభిషేక్ అందించినట్టు తెలుస్తోంది. అభిషేక్ కాల్ లిస్టులో ఉన్న వ్యక్తుల వివరాలను సేకరించిన ప్రత్యేక దర్యాప్తు బృందం.. అతని కస్టమర్లపై కూడా దృష్టి పెట్టినట్టు తెలుస్తోంది.

రోహిత్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన పార్టీలో పాల్గొన్న వ్యక్తుల వివరాలను కూడా సిట్ సేకరించినట్టు తెలుస్తోంది. రోహిత్ రెడ్డికి మాత్రమే కాకుండా కౌశిక్ రవితో కూడా అభిషేక్ కు సంబంధం ఉన్నట్టు తెలుస్తోంది.

.రోహిత్ రెడ్డి పార్టీ వ్యవహారంలో మరో వ్యక్తి వెలుగులోకి వచ్చాడు. రోహిత్ రెడ్డికి సంబంధించిన వ్యవసాయ క్షేత్రంలో కొంత భాగాన్ని ఏలూరు ప్రాంతానికి చెందిన మరవలేని రమేష్ గతంలో బాడుగకు తీసుకున్నాడు. ఇందులో నాటు కోళ్లను పెంచుతున్నాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా చేస్తున్నాడు. అయితే ఆరోజు జరిగిన పార్టీకి తమ ప్రాంతానికి చెందిన ఎంపీ పుట్టా మహేష్ హాజరవుతున్న నేపథ్యంలో రమేష్ అక్కడికి వచ్చాడు. పార్టీలో మద్యం తాగాడు. పోలీసులు దాడులు చేసే సమయానికి రమేష్ అక్కడే ఉండడంతో అరెస్ట్ చేశారు. అతడి మీద ఎక్సైజ్ యాక్ట్ లోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

# అసెంబ్లీలో వార్ వన్ సైడ్...

హైదరాబాద్, మార్చి23,
తెలంగాణ రాష్ట్ర రాజకీయ ముఖచిత్రం అసెంబ్లీ వేదికగా శరవేగంగా మారుతోంది. గత పదేళ్లుగా సభను శాసించిన బీఆర్ఎస్, ఇప్పుడు ప్రతిపక్ష హోదాలో అధికార పక్షం సంధిస్తున్న విమర్శలకు ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న అగ్రెసివ్ స్ట్రాటజీ, ప్రతిపక్షనేత కేసీఆర్ సభకు గైర్హాజరు కావడం.. ఈ రెండు అంశాలు సభలో చర్చను వార్ వన్ సైడ్ మారుస్తున్నాయిప్రజాస్వామ్యంలో ప్రతిపక్ష నాయకుడి పాత్ర అత్యంత కీలకం. కానీ, కీలకమైన బడ్జెట్ సమావేశాలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ దూరంగా ఉండటం అటు పార్టీ శ్రేణుల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీస్తోంది. కేటీఆర్, హరీష్ రావు వంటి హేమాహేమీలు ఉన్నప్పటికీ, సభను తన వాక్చాతుర్యంతో, చారిత్రక ఆధారాలతో అదుపులోకి తెచ్చుకునే కేసీఆర్ మార్క్ వ్యూహం ఇక్కడ కొరవడింది. ప్రజలు ఎన్నుకున్నా సభకు రావడం లేదనే అంశాన్ని రేవంత్ రెడ్డి ఒక అస్త్రంగా మార్చుకున్నారు. ప్రజాధనం జీతంగా తీసుకుంటూ సభకు రాకపోవడం బాధ్యతారాహిత్యం అనే విమర్శను కాంగ్రెస్ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టడంలో సఫలీకృతం అవుతున్నారు. గతంలో బీఆర్ఎస్ నేతలు ఉపయోగించిన సాక్ష్యాధారాల వ్యూహాన్నే ఇప్పుడు రేవంత్ తిరిగి వారిపైనే ప్రయోగిస్తున్నారు. బీఆర్ఎస్ ఏదైనా ప్రజా సమస్యను లేవనెత్తినప్పుడు, రేవంత్ రెడ్డి వెంటనే గత పదేళ్లలో జరిగిన వైఫల్యాలను, శ్వేతపత్రాలను బయటపెడుతున్నారు. దీంతో చర్చ ప్రస్తుత సమస్యల నుంచి మళ్ళీ పాత ప్రభుత్వ తప్పుల వైపు మళ్లుతోంది. కేటీఆర్ వేసే ప్రశ్నలకు రేవంత్ రెడ్డి అంతే దీటుగా, తనదైన శైలిలో తెలంగాణ యాసతో విరుచుకుపడుతున్నారు. ఇది సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలలో ఉత్సాహాన్ని నింపుతుండగా, బీఆర్ఎస్ డిఫెన్స్‌లో పడిపోతోంది.సభలో బీఆర్ఎస్ గళాన్ని కేటీఆర్, హరీష్ రావు వినిపిస్తున్నప్పటికీ, వారి మధ్య సమన్వయం కంటే డిఫెన్స్ కే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోంది. ఆరు గ్యారెంటీలపై కేటీఆర్ చేసే కొన్ని సవాళ్లు, ప్రభుత్వం వద్ద



ఉన్న పాత ఫైళ్ల వల్ల తిరిగి పార్టీకే ఇబ్బందిగా మారుతున్నాయి. హరీష్ రావు గణాంకాలతో ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టాలని చూస్తున్నా, మంత్రులందరూ ఏకతాటిపైకి వచ్చి ఆయనను అడ్డుకుంటున్నారు.బీఆర్ఎస్ మళ్ళీ సభలో పట్టు సాధించాలంటే కేసీఆర్ రాక తప్పనిసరి అని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అధినేత సభలో ఉంటే ఎమ్మెల్యేల్లో ఉండే ధైర్యం వేరు. ప్రస్తుతం సభలో అజెండాను ప్రభుత్వం సెట్ చేస్తోంది. దాన్ని ప్రతిపక్షం వైపు తిప్పుకోవాలంటే కేసీఆర్ అనుభవం, విషయ పరిజ్ఞానం అత్యవసరం. ప్రస్తుతానికి తెలంగాణ అసెంబ్లీలో రేవంత్ రెడ్డి హవా స్పష్టంగా కనిపిస్తోంది. రాజకీయ యుద్ధంలో గెలవాలంటే సైన్యం మాత్రమే సరిపోదు, సేనాని కూడా రంగంలో ఉండాలి. కేసీఆర్ సభకు వస్తే తప్ప ఈ వన్ సైడ్ వార్ రసవత్తరమైన ద్వైపాక్షిక పోరుగా మారే అవకాశం లేదు.

రేవంత్ పంచ్ లు

కేసీఆర్ కు అసెంబ్లీకి రాకున్నా ఇస్తున్న జీతం కోటి.. రాక మాత్రం అంటిముట్టనట్టు” అంటూ రేవంత్ రెడ్డి సంధిస్తున్న బాణాలు గులాబీ క్యాడర్‌కు గుచ్చుకుంటున్నాయి. “ప్రజాధనం తీసుకుంటూ.. ప్రజల గొంతుక వినిపించరా?” అంటూ రేవంత్ వేస్తున్న ప్రశ్నలకు సమాధానం చెప్పలేక గులాబీ తమ్ముళ్లు నీళ్లు నములుతున్నారు. కేసీఆర్ ఉండి ఉంటే తనదైన శైలిలో ‘ఏం తమ్మి.. ఏం మాట్లాడుతున్నావ్?’ అని కౌంటర్ ఇచ్చేవారేమో కానీ, ఇప్పుడు ఆ లోటు స్పష్టంగా కనిపిస్తోంది.కేటీఆర్ అస్త్రంగా ఆరు గ్యారెంటీలు ఏవి? నిరుద్యోగ భృతి ఏమైంది? అంటుంటే.. రేవంత్ మీ హయాంలో జరిగిన పేపర్ లీకేజీలు ఏవి? ఆ ప్రాజెక్టుల అంచనాలు ఏమయ్యాయి? అంటూ నిలదీస్తున్నారు. చర్చ ప్రజా సమస్యల మీద జరగాల్సింది పోయి, “నువ్వు ఎక్కువ తిన్నావా.. నేను ఎక్కువ తిన్నానా?” అన్న చందంగా పాత రికార్డుల దుమ్ము దులిపే కార్యక్రమంగా మారిపోయింది. కేసీఆర్ మార్క్ వ్యూహచతురత లేకపోవడంతో రేవంత్ దూకుడు ముందు కేటీఆర్ వ్యూహాలు “తేలిపోయిన అప్పడాల్లా” మారుతున్నాయని విశ్లేషకులు చెవులు కొరుక్కుంటున్నారు. అసెంబ్లీలో రేవంత్ రెడ్డి ఏకపక్షంగా సాగిస్తున్న ఈ ‘వన్ సైడ్ వార్’ ఆపాలంటే, గజ్వేల్ సింహం గర్జించాల్సిందే అని పార్టీ కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. “సార్.. మీరు రండి సార్.. లేకపోతే రేవంత్ అన్న మాకు చుక్కలు చూపిస్తున్నాడు” అని లోలోపల మదనపడుతున్నారు.మొత్తానికి కేసీఆర్ రాకపోయేసరికి అసెంబ్లీలో బీఆర్ఎస్ పరిస్థితి “కెప్టెన్ లేని టీమ్ ఇండియా”లా తయారైంది. మరి కేసీఆర్ ఎప్పుడు ఎంట్రీ ఇస్తారు? రేవంత్ స్పీడ్‌కు ఎప్పుడు బ్రేక్ వేస్తారు? అనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న!

# సమ్మర్ మూవీస్ పై ఆశలు

హైదరాబాద్, మార్చి 23,
సంవత్సరం తెలుగు సినిమా ఇండస్ట్రీల హవా కొనసాగుతుందనే చెప్పాలి. సంక్రాంతికి 'మన శంకర్ వరప్రసాద్' సినిమాతో చిరంజీవి భారీ సక్సెస్ ని సాధించాడు. 400 కోట్ల వరకు కలెక్షన్స్ ని కొల్లగొట్టాడు. సంక్రాంతి సీజన్ బాగా కలిసి రావడంతో ఆ తర్వాత కూడా సినిమా ఇండస్ట్రీకి భారీ లాభాలు వస్తాయని అంచనాలో సినిమా మేధావులైతే ఉన్నారు. ఇక ఇలాంటి క్రమంలోనే రీసెంట్ గా రిలీజ్ అయిన 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా సైతం పాజిటివ్ టాక్ ను సంపాదించుకొని ముందుకు సాగుతుంది. ఇక అడివి శేష హీరోగా చేస్తున్న 'డకాయిట్' సినిమా సైతం ఏప్రిల్ నెలలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అలాగే శర్వానంద్ బైకర్ సినిమా వస్తుంది. నిఖిల్ హీరోగా చేస్తున్న స్వయంభూ సినిమా కూడా ఈ సమ్మర్ లోనే వస్తుంది?ఇక ఈ సినిమాలతో పాటు గా ఏప్రిల్ 30 వ తేదీన రామ్ చరణ్ హీరోగా చేస్తున్న 'పెద్ది' సినిమా సైతం భారీ అంచనాలతో బరిలోకి దిగబోతుంది.ఇక మే నెలలో ఏ సినిమాలు రాబోతున్నాయి అనే విషయం మీద ఇంకా సరైన క్లారిటీ రానప్పటికి మొత్తానికైతే ఈ సినిమాలన్ని భారీ విజయాలను సాధిస్తాయనే కాన్ఫిడెన్స్ ను వ్యక్తం చేస్తున్నారు. పెద్ది సినిమా ఈ సమ్మర్ లో బిగ్గెస్ట్ బ్లాక్ బాస్టర్ హిట్ గా నిలువబోతుందనే వార్తలు కూడా వస్తున్నాయి.ఈ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది అంటూ మేకర్స్ చెబుతున్నారు. దానికి తగ్గట్టుగానే ఈ సినిమా మీద ప్రేక్షకుల్లో విశేషమైన హైప్ కూడా ఉంది. ఇక ఇలాంటి క్రమంలోనే ఇండియన్ సినిమా ఇండస్ట్రీని షేక్ చేసేలా రామ్ చరణ్ పెద్ది సినిమాతో భారీ రికార్డులను కొల్లగొడతాడా? లేదా అనేది కూడా తెలియాల్సి ఉంది. ప్రస్తుతం తెలుగు సినిమా ఇండస్ట్రీ కొంతవరకు డౌన్ లో ఉంది.దీనిని టాప్ లెవెల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత రామ్ చరణ్ మీదే ఉంది అంటూ పలువురు సినిమా మేధావులు సైతం వాళ్ళ అభిప్రాయాల్ని తెలియజేస్తుండటం విశేషం?చూడాలి మరి ఈ సినిమా ఎలాంటి సక్సెస్ ను సాధిస్తుంది. తద్వారా మరోసారి తెలుగు సినిమా స్థాయి పెరుగుతుందా లేదా అనేది?

# ఇక పారిశ్రామిక ప్రగతి పరుగులే

హైదరాబాద్, మార్చి23,
రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పారిశ్రామిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 2026-27 బడ్జెట్‌లో పరిశ్రమలు , ఐటీ శాఖలకు అత్యంత ప్రాధాన్యతనిచ్చింది. ఐటీ రంగానికి నిధులను పెంచుతూ రూ. 875 కోట్లు కేటాయించగా, పరిశ్రమల శాఖకు రూ. 3,490 కోట్లు ప్రతిపాదించింది. కేవలం హైదరాబాద్ పశ్చిమ ప్రాంతానికే పరిమితం కాకుండా, నగరం చుట్టూ ఐటీని విస్తరించేలా 'గ్రిడ్'విధానానికి ప్రభుత్వం పెద్దపీట వేసింది.
గ్లోబల్ హబ్ గా హైదరాబాద్: దేశంలోని మొత్తం గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లలో20% హైదరాబాద్‌లోనే ఉండటం విశేషం. గతేడాది కొత్తగా 70 జీసీసీలు ఇక్కడ కొలువుదీరాయి. గూగుల్ వంటి టెక్ దిగ్గజం తన 'సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్'ను ఇక్కడ నెలకొల్పడం గమనార్హం.
టీ-ఫైబర్ లక్ష్యం: ఇప్పటికే 8,888 గ్రామ పంచాయతీలు, 4,800 ప్రభుత్వ సంస్థలకు హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించిన ప్రభుత్వం, ఈ ఏడాది చివరి నాటికి ఆ సంఖ్యను 50 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.ఎగుమతుల జోరు: రాష్ట్ర ఐటీ ఎగుమతులు రూ. 3.13 లక్షల కోట్లకు చేరాయి. వీటి ద్వారా 9.39 లక్షల మందికి పైగా ఉపాధి లభిస్తోంది. డేటా సెంటర్ ఆధునీకరణకు రూ. 100 కోట్లు కేటాయించారు.
పారిశ్రామిక ప్రగతి ? కొత్త హబ్‌లు:
కొడంగల్ ఇండస్ట్రియల్ పార్క్: పశ్చిమ తెలంగాణలోని కొడంగల్‌ను ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా మార్చేందుకు 'మల్టీ పర్పస్ ఇండస్ట్రియల్ పార్క్'ను అభివృద్ధి చేయనున్నారు. రేడియల్ రోడ్-2 సమీపంలో దీనికోసం భూములను సమీకరిస్తున్నారు.
జహీరాబాద్ స్మార్ట్ సిటీ: కేంద్ర సహకారంతో 3,245 ఎకరాల్లో జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టును వేగవంతం చేస్తున్నారు.జిల్లా కారిడార్లు: హైదరాబాద్ మినహా మిగిలిన 9 ఉమ్మడి జిల్లాల్లో కొత్త పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి రూ. 146.50 కోట్లు, గ్రామీణ చిన్నతరహా పరిశ్రమలకు రూ. 241.96 కోట్లు కేటాయించారు. హైదరాబాద్‌లో నిర్మిస్తున్న 'యూనిటీ మాల్' కోసం రూ. 173.16 కోట్లు ప్రతిపాదించారు.
ఎగుమతుల్లో రికార్డు వృద్ధి:
తెలంగాణ పారిశ్రామిక ఎగుమతులు గతేడాది కంటే 39.30% అద్భుత వృద్ధి సాధించి రూ. 1,61,843 కోట్లకు చేరాయి. దేశవ్యాప్త ఎగుమతుల్లో 4.37% వాటాతో తెలంగాణ 7వ స్థానంలో నిలిచింది. మన రాష్ట్రం నుంచి ప్రధానంగా అమెరికా (23.64%), యూఏఈ (11.74%) దేశాలకు ఔషధాలు, ఏరోస్పేస్, ఎలక్ట్రికల్ పరికరాలు ఎగుమతి అవుతున్నాయి.
భవిష్యత్తు లక్ష్యాలు ? 2047 విజన్:
డిఫెన్స్, ఏరోస్పేస్ హబ్: హైదరాబాద్‌ను దేశంలోనే అగ్రగామి ఏరోస్పేస్ హబ్‌గా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం 1,500 ఎంఎస్ఎంఈలను (ఓఓఇ) ఒకే గొడుగు కిందికి తీసుకురానుంది.
లైఫ్ సైన్సెస్ పాలసీ: 2026-30 నూతన లైఫ్ సైన్సెస్ విధానాన్ని తీసుకురావడంతో పాటు, జీనోమ్ వ్యాలీని మరో 300 ఎకరాలకు విస్తరించనున్నారు.
మహిళా పారిశ్రామికవేత్తలకు చేయూత: 119 నియోజకవర్గాల్లో మహిళా పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా 'ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్'లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# వివాదాల కౌశిక్ రెడ్డి

కరీంనగర్ మార్చి23,
వివాదాలే ఆయన జోలికి వస్తున్నాయో..లేక ఆయనే ఏరి కోరి మరీ కాంటవర్సీల్లో వేలు పెడుతున్నారో తెలియదు కానీ..నిత్యం ఏదో ఒక ఇష్యూతో హడావుడి చేస్తుంటారు హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి. కాంగ్రెస్‌లో ఉన్నప్పటి నుంచి ఆయన వ్యవహారశైలి దూకుడుగా ఉంటూనే వస్తోంది. ఆ తర్వాత బీఆర్ఎస్‌లోకి వచ్చి ఎమ్మెల్యే అయ్యాక అనవసర విషయాల జోలికి వెళ్లి పార్టీని రచ్చకీడుస్తున్నారన్న చర్చ ఉంది. గతంలో అప్పటి గవర్నర్ తమిళసై పై చేసిన వాఖ్యలు దుమారాన్ని రేపడంతో..ఆ తర్వాత నాలుక కరుచుకున్నారు. ప్రభుత్వ



ఉద్యోగులను బూతులు తిట్టారనే అలిగేషన్‌తో పాటు, బీజేపీ నేత ఈటల రాజేందర్‌పై ఏవో కామెంట్స్ చేసి రచ్చకు దారితీశారు.ఆ మధ్య జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌తో వాగ్వాదం కేసులో అరెస్ట్ అయి..చివరకు బెయిల్‌పై రిలీజ్ అయ్యారు. అరికెపూడి గాంధీని పరుష పదజాలంతో విమర్శించడంతో పోటాపోటీ ఫిర్యాదులకు, దాడులకు దారితీసింది. లేటెస్ట్‌గా తన నియోజకవర్గంలో సమ్మక్క సారలమ్మ జాతరలో రాద్ధాంతం చేసి..రోడ్డుపై బైఠాయించి సీపీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు కాంట్రవర్సీ అయ్యాయి. చివరకు ఐపీఎస్‌ల సంఘం డిమాండ్‌తో సారీ చెప్పాల్సి వచ్చింది. అప్పటి నుంచి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంను టార్గెట్ చేస్తూ వస్తున్నారు కౌశిక్‌రెడ్డి. ఇదంతా ఆయన చేసిన రచ్చ, రాద్ధాంతం అయితే..ఇప్పుడు సొంత పార్టీ నేతలే కౌశిక్‌రెడ్డి తీరుపై తిరుగుబావుట ఎగురవేస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది.కౌశిక్ రెడ్డి తీరును నిరసిస్తూ హుజురాబాద్ బీఆర్ఎస్ నేతలు రహస్య సమావేశాలు ఏర్పాటు చేసుకోవడం హాట్ టాపిక్‌గా మారింది. ద్వితీయ శ్రేణి నాయకులను పట్టించుకోకపోవడం ఒక ఎత్తు అయితే, అధినేత దగ్గర తమను కనీసం పరిచయం కూడా చేయరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కౌశిక్‌రెడ్డి దూకుడుతో డ్యామేజ్ అవుతుందని..జమ్మికుంట మండలానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు సమావేశం ఏర్పాటు చేసుకోవడం చర్చనీయాంశంగా మారింది. సీనియర్ లీడర్లపై కౌశిక్ వివక్ష చూపుతున్నారంటూ అసంతృప్త నేతలు గళం ఎత్తుతున్నారు.మున్సిపల్ ఎన్నికల్లో కౌశిక్ రెడ్డి తమకు అన్యాయం చేశారనేది వారి ప్రధాన ఆరోపణ. పార్టీ నిర్ణయాన్ని ధిక్కరించి పోటీ చేసిన వారికి, తనకు సాన్నిహిత్యంగా ఉండే వారికే కౌశిక్ మద్దతు తెలిపారని ఫైర్ అవుతున్నారు. హుజురాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ ఓటమికి కౌశిక్ రెడ్డి ఏకపక్ష నిర్ణయాలే కారణమని మండి పడు తోంది క్యాడర్. ఎప్పుడో ఓసారి హుజురాబాద్‌కు వచ్చి హడావిడి చేసి..ఆ తర్వాత తమను రోడ్డు మీద వదిలేసి వెళ్లిపోతారనేది కొందరు నాయకుల వాదన.వ్యక్తిగత ఎజెండాతో పాలిటిక్స్ చేస్తూ..ఏదో ఒక వివాదంలో తల దూరుస్తూ పార్టీని రచ్చకీడుస్తున్నాని కౌశిక్ వ్యతిరేకులు విమర్శిస్తున్నారు. క్యాడర్‌ను పట్టించుకోవడం లేదంటున్నారు.
పొలిటికల్‌గా కౌశిక్ రెడ్డి దూకుడు పార్టీకి, ఆయనకు ఎంత మైలేజ్ తెచ్చి పెడుతుందో ఏమో గానీ..నెగిటివిటీనే ఎక్కువ అవుతుందన్న టాక్ ఉంది. బీఆర్ఎస్ ముఖ్యనేతలు కూడా కౌశిక్‌రెడ్డి తీరుపై గుసగుసలు పెట్టుకుంటున్నారట. ఆయన దూకుడు పార్టీకి ప్లస్ అవుతుందా? మైనస్ అవుతుందా? అనే దానిపై ఇంటర్నల్ డిస్కషన్ జరుగుతున్నట్లు టాక్. ఇప్పటికైనా కౌశిక్‌రెడ్డి తన తీరును మార్చుకుంటారో..ఎప్పటిలాగే దూకుడే ఎజెండాగా పెట్టుకుని వెళ్తారో చూడాలి.

# జీవన్ రెడ్డి పార్టీ మారుడే



కరీంనగర్, మార్చి23, (న్యూస్ పల్స్)
తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి దృష్టి జగిత్యాల పులిగా పేరుగాంచిన సీనియర్ నేత, ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిపైనే ఉంది. నలభై ఏళ్ల సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం, కాంగ్రెస్ పార్టీ పట్ల అచంచలమైన విధేయత కలిగిన ఒక ధీశాలి.. ఇప్పుడు అదే పార్టీకి 'గుడ్ బై' చెప్పే దిశగా అడుగులు వేయడం రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. అయితే జీవన్ రెడ్డిని పార్టీ వీడకుండా చేసేందుకు కాంగ్రెస్ హైకమాండ్ రంగంలోకి దిగింది. మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. జీవన్ రెడ్డి ఇంటికెళ్లి బుజ్జగింపులు చేశారు. అయితే అవి ఫలించలేదు.జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేత చేజారితే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పార్టీకి భారీ నష్టం జరుగుతుందని గ్రహించిన కాంగ్రెస్ హైకమాండ్.. మంత్రులను పంపించింది. జీవన్ రెడ్డి నివాసంలో వీళ్లు గంటల తరబడి చర్చలు జరిపారు. "మీరు పార్టీకి మూలస్తంభం, మీ గౌరవానికి భంగం కలగకుండా చూస్తాం" అని హామీ ఇచ్చినట్లు సమాచారం. అయితే, జీవన్ రెడ్డి మాత్రం మెత్తబడలేదు. తన అనుచరులపై కేసులు పెట్టడం, అభివృద్ధి పనుల్లో తనను పక్కన పెట్టడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ, "ఇక గౌరవం లేని చోట ఉండలేను" అని కుండబద్దలు కొట్టినట్లు తెలుస్తోంది. అంతకుముందు ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి రంజాన్ ప్రార్థనల్లో పాల్గొన్నారు.పార్టీ వీడేందుకు జీవన్ రెడ్డి సిద్ధమయ్యారన్న సమాచారం వినగానే ప్రత్యర్థి పార్టీలు అలర్ట్ అయ్యాయి. ఆయన్ను తమ పార్టీలోకి లాగేందుకు బీఆర్ఎస్ తీవ్రంగా ప్రయత్నాలు చేస్తోంది. జీవన్ రెడ్డి కూడా బీఆర్ఎస్ లో చేరేందుకు సుముఖంగా ఉన్నట్టు సమాచారం. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ లతో ఆయన చర్చలు కూడా జరిపినట్లు తెలుస్తోంది. జీవన్ రెడ్డికి ఉమ్మడి జిల్లా రాజకీయాల్లో సముచిత స్థానంతో పాటు, పార్టీలో కీలక బాధ్యతలు ఇస్తామని కేసీఆర్ హామీ ఇచ్చినట్లు టాక్. 25న ఆయన కాంగ్రెస్ పార్టీకి అధికారికంగా గుడ్ బై చెప్పే అవకాశం కనిపిస్తోంది. ఆ తర్వాత భారీ బహిరంగ సభ ద్వారా బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందిమరోవైపు బీజేపీ కూడా జీవన్ రెడ్డి లాంటి క్లీన్ ఇమేజ్ ఉన్న నేత కోసం గట్టి ప్రయత్నాలు చేస్తోంది. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ ఇప్పటికే రంగంలోకి దిగి జీవన్ రెడ్డిని సంప్రదించినట్లు వార్తలు వచ్చాయి. హిందుత్వ ఓటు బ్యాంక్‌కు జీవన్ రెడ్డి వ్యక్తిగత చరిష్మా తోడైతే, ఉత్తర తెలంగాణలో తిరుగుండదని బీజేపీ వ్యూహం. అయితే బీజేపీలో చేరికపై ఆయన ఆసక్తిగా లేనట్టు తెలుస్తోంది.జీవన్ రెడ్డి గనుక కాంగ్రెస్‌ను వీడితే, అది కేవలం ఒక నియోజకవర్గానికే పరిమితం కాదు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర నియోజకవర్గాల్లో కూడా కాంగ్రెస్‌పై ప్రభావం పడుతుంది. ఆయనతో పాటు వందలాది మంది ముఖ్య అనుచరులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పార్టీ వీడే అవకాశం ఉంది.
గులాబీ గూటికే
జీవన్ రెడ్డి అసహనానికి ప్రధాన కారణం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడమే. తన రాజకీయ ప్రత్యర్థిని తన అనుమతి లేకుండా, కనీసం సంప్రదించకుండా పార్టీలోకి ఎలా ఆహ్వానిస్తారని జీవన్ రెడ్డి మొదటి నుంచీ ప్రశ్నిస్తున్నారు. "దశాబ్దాలుగా పార్టీ జెండా మోసిన తనకంటే, నిన్నగాక మొన్న వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తారా?" అని ఆయన పలుమార్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే నిరసనగా తన నివాసం వద్ద ఉన్న కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించడం, పార్టీ కార్యక్రమాలకు మొహం చాటేయడం వంటి చర్యల ద్వారా తాను 'అసంతృప్తి'తో ఉన్నాననే సంకేతాలను ఇప్పటికే అధిష్టానానికి పంపారు. రంజాన్ వేడుకల్లో భాగంగా జగిత్యాలలో బీఆర్ఎస్ ముఖ్య నేతలతో కలిసి జీవన్ రెడ్డి ప్రార్థనల్లో పాల్గొనడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ప్రార్థనల అనంతరం బీఆర్ఎస్ అగ్రనేతలతో ఆయన చాలా సేపు ఏకాంతంగా ముచ్చటించడం గమనార్హం. సాధారణంగా బద్ధశత్రువులుగా ఉండే నేతలు ఇంత ఆత్మీయంగా కలవడం వెనుక బలమైన రాజకీయ వ్యూహం దాగి ఉందనే చర్చ ఊపందుకుంది. జీవన్ రెడ్డి లాంటి సీనియర్ నాయకుడు ఇలా బాహాటంగా ప్రత్యర్థి పార్టీ నేతలతో కలవడం అంటే, ఆయన కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకోవడానికి మానసికంగా సిద్ధమయ్యారని అర్థం. జీవన్ రెడ్డి ఇప్పటికే తన ముఖ్య అనుచరులు, నియోజకవర్గ కేడర్‌తో పలు దఫాలుగా సమావేశమయ్యారు. మెజారిటీ అనుచరులు కూడా ఆయనను గౌరవించని చోట ఉండటం కంటే, సముచిత స్థానం దక్కే బీఆర్ఎస్‌లోకి వెళ్లడమే ఉత్తమమని సూచించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కూడా జీవన్ రెడ్డి లాంటి మేధావి, సీనియర్ నేత పార్టీలోకి వస్తే ఉత్తర తెలంగాణలో పార్టీకి కొత్త ఊపిరి పోసినట్లవుతుందని భావిస్తున్నారు.ఒకవేళ జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరితే జగిత్యాల రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోతాయి. దశాబ్దాలుగా కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ ప్రాంతంలో 'హస్తం' బలహీనపడటం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే సంజయ్ కుమార్ చేరికతో కాంగ్రెస్‌లో రెండు గ్రూపులు ఏర్పడగా, ఇప్పుడు జీవన్ రెడ్డి నిష్క్రమణ పార్టీకి దెబ్బ అవుతుంది.తన భవిష్యత్తు కార్యాచరణపై జీవన్ రెడ్డి ఇప్పటికే స్పందించారు. సముచిత గౌరవం లేని చోట ఉండలేనని, త్వరలోనే నా నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటిస్తానని చెప్పారు. తాజా పరిణామాలు ఆయన తదుపరి అడుగు గులాబీ గూటి వైపేనని స్పష్టం చేస్తున్నాయి.

# 21 మీటర్లు దాటితే హై-రైజ్ భవనాలు

హైదరాబాద్, మార్చి23,
తెలంగాణ ప్రభుత్వం బిల్డింగ్ రూల్స్‌లో కీలక సవరణలు చేసింది. ఇకపై 21 మీటర్ల పైబడిన వాటినే హై-రైజ్ భవనాలుగా గుర్తిస్తారు. భారీ నిర్మాణాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూనే, రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి వెసులుబాటు కల్పించింది. సెట్‌బ్యాక్ నిబంధనలలో 10 శాతం సడలింపునిచ్చింది. పట్టణాల్లో వర్టికల్ గ్రోత్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించింది.తెలంగాణలో శరవేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, భవన నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగానికి నూతన జవజీవాలు పోస్తూ.. నిర్మాణ నిబంధనలలో కీలక మార్పులు చేస్తూ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీవో 95ను విడుదల చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ ఉత్తర్వులు.. ముఖ్యంగా హై-రైజ్ భవనాలు, టీడీఆర్ వినియోగం, అదనపు అంతస్తుల అనుమతులపై స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించాయి .ప్రభుత్వం తాజా సవరణల ప్రకారం.. భవనాల ఎత్తు విషయంలో స్పష్టతనిచ్చింది. ఇకపై 21 మీటర్లు లేదా అంతకంటే ఎక్కువ ఎత్తు ఉన్న నిర్మాణాలను మాత్రమే 'హై-రైజ్' భవనాలుగా పరిగణిస్తారు. అయితే, సాంకేతిక అవసరాల కోసం నిర్మించే చిమ్నీలు, కూలింగ్ టవర్లు, లిఫ్ట్ మెషిన్ రూములు, వాటర్ ట్యాంకులను ఈ ఎత్తు లెక్కలోకి తీసుకోరు. ఇది నిర్మాణదారులకు సాంకేతిక పరంగా కొంత ఉపశమనం కలిగించనుంది. బదిలీ చేయగల అభివృద్ధి హక్కుల వినియోగాన్ని ప్రభుత్వం మరింత తప్పనిసరి చేసింది. 750 నుండి 2000 చదరపు మీటర్ల లోపు విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 18 నుండి 21 మీటర్ల ఎత్తు వరకు నిర్మాణాలు చేపట్టాలంటే టీడీఆర్ వాడటం నిబంధనగా మార్చారు.10 అంతస్తులకు మించిన భవనాల్లో 10వ అంతస్తు పైబడిన విస్తీర్ణంపై 3 శాతం, అలాగే 20 అంతస్తులు దాటిన భవనాల్లో 20వ అంతస్తు పైబడిన ఏరియాపై 5 శాతం టీడీఆర్ లోడింగ్ ఉండాలి. నిర్మాణ అనుమతి సమయంలోనే 50 శాతం టీడీఆర్ సమర్పించాలి, మిగిలిన 50 శాతాన్ని ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ వచ్చే లోపు అందజేయాల్సి ఉంటుంది. నగరాల్లో స్థల లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో 'వర్టికల్ గ్రోత్'ను ప్రోత్సహించేందుకు రోడ్డు వెడల్పు ఆధారంగా అదనపు అంతస్తులకు అనుమతినిచ్చారు.2000 చ.మీ కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ప్లాట్లలో 40 అడుగుల రోడ్డు ఉంటే 3 అదనపు అంతస్తులు, 60 అడుగుల రోడ్డు ఉంటే 4 అదనపు అంతస్తులు, 80 అడుగుల రోడ్డు ఉంటే 5 అదనపు అంతస్తుల వరకు నిర్మించుకోవచ్చు. భవనాల చుట్టూ వదిలే సెట్‌బ్యాక్ నిబంధనలలో టీడీఆర్ వినియోగం ద్వారా 10 శాతం వరకు సడలింపు పొందే అవకాశం కల్పించారు. అయితే, భద్రతా కారణాల దృష్ట్యా భవనం చుట్టూ కనీసం 7 మీటర్ల సెట్‌బ్యాక్ ఉండాలనే నిబంధనను మాత్రం కచ్చితంగా పాటించాలి. మాస్టర్ ప్లాన్ రోడ్ల మార్పులు జరిగినప్పుడు కన్వర్షన్ ఛార్జీలు చెల్లించి, దానికి సమానమైన టీడీఆర్‌ను సమర్పించే వెసులుబాటు కూడా కల్పించారు.

## సూర్య కిరణాల తేజస్సులో విరాజిల్లిన శ్రీ కోదండరాముడు

తిరుపతి మార్చి23,
తిరుపతి శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 8 గంటలకు స్వామివారు సూర్యప్రభ వాహనంపై దేదీప్యమానంగా ప్రకాశించారు.ఆలయ నాలుగు మాడ వీధుల్లో వాహనసేవ వైభవంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారుసూర్యుడు తేజోనిధి. సకలరోగ నివారకుడు. ప్రకృతికి చైతన్యప్రదాత. వర్షాలు, వాటివల్ల పెరిగే సస్యాలు, చంద్రుడు, అతని వల్ల పెరిగే ఔషధాలు మొదలైనవన్నీ సూర్యతేజం వల్లనే వెలుగొందుతున్నాయి.తరువాత ఉదయం 10.30 నుండి 11.30 గంటల వరకు శ్రీ సీత లక్ష్మణ సమేత శ్రీరామచంద్రమూర్తి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు.

# గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రచార రథాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 23(భారత శక్తి) నిర్మల్ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లాలోని రైతులకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటుచేసిన ప్రచార వాహనాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, సోమవారం కలెక్టరేట్ ప్రాంగణంలో జెండా ఊపడం ద్వారా ప్రారంభించారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రైతులందరూ తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించేలా ఈ ప్రచార రథం ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని వివరించారు. జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో భాగంగా, రైతులు విధిగా తమ పశువులకు టీకాలను వేయించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, పశువైద్య అధికారి బాలిగ్ అహ్మద్, వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డిపిఆర్ఓ విష్ణువర్ధన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బాసర ట్రిపుల్ ఐటీలో తాజా పరిస్థితిపై మంత్రి జూపల్లి సమీక్ష



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, మార్చి 23(భారత శక్తి): హైదరాబాద్, బాసర ట్రిపుల్ ఐటీ (ఆర్జీయూకేటీ)లో నెలకొన్న పరిస్థితులు, విద్యార్థుల నిరసనలు, తదనంతరం సెలవులు ప్రకటించడం, తదితర అంశాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం హైదరాబాద్‌లో ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. క్యాంపస్‌లో ప్రస్తుత స్థితిగతులను, విద్యార్థుల ఆందోళనల వెనుక ఉన్న కారణాలను బాసర ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీ దర్శన్ మంత్రికి వివరించారు.
క్యాంపస్‌లో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో శాంతిభద్రతల దృష్ట్యా, ముందస్తు జాగ్రత్తగా సెలవులు ప్రకటించాల్సి వచ్చిందని వీసీ గోవర్ధన్ మంత్రికి తెలిపారు. విద్యార్థుల ప్రధాన డిమాండ్లు, సెలవుల ప్రకటనకు దారితీసిన పరిణామాలను ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.
ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులని, కేవలం ఆవేశంతో ఆందోళనలు చేస్తూ తమ ఉజ్వల భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని హితవు పలికారు. సమస్యలు ఏవైనా ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, విద్యార్థుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో మౌలిక వసతులు, విద్యా ప్రమాణాల మెరుగుదల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఆయన అధికారులకు తేల్చి చెప్పారు. త్వరలోనే క్యాంపస్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భరోసా కల్పించాలని వీసీని మంత్రి ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత ట్రిపుల్ ఐటిని సందర్శించి, విద్యార్థులతో చర్చిస్తానని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు.

# వ్యవసాయ యాంత్రీకరణతో రైతుల ఆదాయం పెంపు: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

### - ఫార్మ్ మెకనైజేషన్ డ తేనెటీగల పెంపకం పథకాలపై కలెక్టర్ సమీక్ష



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, మార్చి 23:
జిల్లాలో రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకతలో గణనీయమైన వృద్ధి సాధించేందుకు ఫార్మ్ మెకనైజేషన్, వర్షాధార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖల అధికారులతో జిల్లాలో అమలవుతున్న ఫార్మ్ మేకనైజేషన్, వర్షాదార ప్రాంతాల అభివృద్ధి, తేనెటీగల పెంపకం కార్యక్రమాల పురోగతిపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన ఫార్మ్ మెకనైజేషన్ లక్ష్యాలను వేగంగా సాధించాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు సాధించిన పురోగతిని పరిశీలించి, యుటిలైజేషన్ సర్టిఫికెట్లు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పురోగతి సాధించాలని, రైతులను యాంత్రీకరణ వైపు మరింతగా ప్రోత్సహించాలని సూచించారు.ఉద్యాన యాంత్రీకరణ పథకం ద్వారా మినీ ట్రాక్టర్లు, పవర్ వీడర్స్, పవర్ టిల్లర్స్, బ్రష్ కట్టర్స్, పవర్ స్ప్రేయర్స్ వంటి యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని, జిల్లాలో ఇప్పటివరకు 97 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు.వర్షాధార ప్రాంతాల అభివృద్ధి పథకం ద్వారా రైతుల ఆదాయం పెంపు, ఆహార భద్రత, వ్యవసాయ ఉత్పాదకత మెరుగుదల లక్ష్యంగా సమగ్ర వ్యవసాయ విధానాలను ప్రోత్సహిస్తున్నామని , ఈ పథకాల అమలులో వ్యవసాయ, ఉద్యానవన, డీఆర్‌డీఏ శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.తేనెటీగల పెంపకం కార్యక్రమాన్ని మరింత విస్తరించాలని, ఎక్కువ మంది రైతులకు బీహైవ్ యూనిట్లు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదేవిధంగా, కమర్షియల్ స్థాయిలో తేనెటీగల పెంపకం యూనిట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి ఉన్న స్వయం సహాయక సంఘాల మహిళలను ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రోత్సహించాలని డీఆర్‌డీఏ అధికారులకు సూచించారు.ఈ సమీక్ష సమావేశంలో డిఆర్డిఏ ఏపీడి సూర్యరావు, ఉద్యానవన శాఖ అధికారి సోమేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రామాచారి, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు ఎప్పటికప్పుడు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, మార్చి 23(భారత శక్తి):ఇందిరమ్మ ఇండ్లను ఎప్పటికప్పుడు పూర్తి చేస్తూ ఉండాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అనుమతులు లభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వెంట వెంటనే పూర్తి చేస్తూ ఉండాలని పేర్కొన్నారు. చివరిదశ పనులు మిగిలి ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వెంటనే పూర్తి చేసి, గృహ ప్రవేశాలు చేపట్టాలని అన్నారు. వారం వారిగా ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఇప్పటివరకు గృహ ప్రవేశాలు పూర్తి చేసిన ఇండ్ల వివరాలు, ఆయా దశల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల వివరాలు అధికారుల ద్వారా సమీక్షించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, హౌసింగ్ పిడి రాజేశ్వర్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా వ్యాప్తంగా మాడిఫైడ్ సైలెన్సర్లకు చెక్

## మాడిఫైడ్ సైలెన్సర్లపై పోలీసుల ప్రత్యేక దాడులు: జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల

నిర్మల్ జిల్లా పతినిధి, మార్చి 23(భారత శక్తి ):జిల్లా ఎస్పీ డా.జి.జానకీ షర్మిల, ఆదేశానుసారం సోమవారం సాయంత్రం అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఎస్.హెచ్.ఓ లు ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ముఖ్యంగా మోటార్ సైకిళ్ల నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన మాడిఫైడ్ సైలెన్సర్లు పై దృష్టి సారించారు.




ఈ ప్రత్యేక డ్రైవ్‌లో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తూ అధిక శబ్ద కాలుష్యం కలిగిస్తున్న మోటార్ సైకిళ్లను గుర్తించి, ఆయా వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగింది. మాడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగించడం వలన ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని, ఇది చట్టపరంగా శిక్షార్హమని పోలీసులు హెచ్చరించారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో తనిఖీలు చేపట్టి, స్టేషన్ వారీగా మోడిఫైడ్ సైలెన్సర్లు ఉన్న వాహనాలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత వాహనదారులపై కేసులు నమోదు చేసి, నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.

జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ప్రత్యేక డ్రైవ్‌లు కొనసాగుతాయని, ప్రజల భద్రత మరియు ప్రశాంత వాతావరణం కోసం నిర్మల్ పోలీసులు ఎప్పటికప్పుడు కట్టుదిట్టమైన చర్యలు చేపడతామని లిజిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల, తెలిపారు. ఈ ప్రత్యేక డ్రైవ్ లో జిల్లాలోని అన్ని స్టేషన్ల ఎస్.హెచ్.ఓ లు పాల్గొన్నారు.

# నేడు తపాలా సేవలకు సంబంధించి ఫిర్యాదులు పరిష్కారం

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, మార్చ్ 23:
విజయవాడ పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా సేవలకు సంబంధించి వినియోగదారుల యొక్క ఫిర్యాదులు మరియు సమస్యలు పరిష్కరించు నిమిత్తం నేడు ఉ: 11:00 శివరామ్ (ఐ పి ఓ ఎస్ ), పోస్ట్ మాస్టర్ జనరల్, విజయవాడ రీజియన్, విజయవాడ వారిచే తపాలా అదాలత్ నిర్వహించబడును.తపాలా సేవలకు సంబంధించిన ఫిర్యాదులు మరియు సమస్యలు ఈ అదాలత్ నందు పరిష్కరించబడును.తపాలా వినియోగదారులు తమ సమస్యలు మరియు ఫిర్యాదులు తేది: 24/03/2026 లోగా తపాలా అదాలత్ శీర్షికతో అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్), పోస్ట్ మాస్టర్ జనరల్ వారి కార్యాలయం,గాంధీనగర్, విజయవాడ 520003 అను చిరునామాకు పంపవలసినదిగా కోరడమైనది.ఫిర్యాదు దారులు వ్యక్తిగతంగా కూడా హాజరు కావొచ్చునని పోస్ట్ మాస్టర్ జనరల్ తెలిపారు.




# అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ప్రకటించాలి

## - జీతం రూ: 18 వేలకు పెంచాలి

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 23 (భారతశక్తి) : అంగన్వాడీ కేంద్రాలకు వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ టీచర్లు ధర్నా,ర్యాలీ చేశారు. జిల్లా కేంద్రంలోని 163 వ జాతీయ రహదారిపై భారీగా రాలి నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట కొద్దిసేపు ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉండటంతో చిన్నారులను అంగన్వాడీలకు పంపించేందుకు తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల హామీ మేరకు వేతనాన్ని రూ.18 వేలకు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# సమరయోధులు స్ఫూర్తితో యువత ఎదగాలి : మున్సిపల్ చైర్మన్ చంద్రకళ

ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 23 (భారతశక్తి) : స్వాతంత్ర సమరయోధులను స్ఫూర్తిగా తీసుకొని యువకులు అన్ని రంగాల్లో ఎదగాలని ములుగు మున్సిపల్ ఛైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ బిక్షపతి అన్నారు. సోమవారం భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతి సందర్భంగా ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ, సీఐటీయూ సంయుక్తంగా సోమవారం ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని చైర్ పర్సన్ మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేయడం ఛైర్ పర్సన్ వారిని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేయాలని ఆమె సూచించారు.
ఈ కార్యక్రమంలో సీఐ సురేష్, కౌన్సిలర్లు, ఆయాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో "నీటి ప్రతిజ్ఞ" కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు, ఉద్యోగులు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 23: జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు,"నీటి ప్రతిజ్ఞ" చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతిజ్ఞ తీసుకున్న ప్రతి వ్యక్తి: నేడు నీటిని సంరక్షించేందుకు, పొదుపుగా వినియోగించేందుకు తాము అంకితం చేస్తారని నీటిని వృథా చేయకుండా ఒక్క బొట్టు కూడా వృథా చేయకుండా చూసేందుకు తన కుటుంబ సభ్యులు కూడా నీటిని వృథా చేయకుండా చూసేలా చేస్తారని నీటిని అత్యంత విలువైన వనరుగా భావిస్తూ, తెలివిగా వినియోగిస్తారని ప్రాంతీయ, జాతీయ స్థాయిలో ప్రపంచ నీటి దినోత్సవంను పురస్కరించుకొని, ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు నీటిని పరిరక్షించడం ఎంత ముఖ్యమో కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ గుర్తు చేస్తూ ప్రతి ఒక్కరిని నీటి వినియోగంలో జాగ్రత్త పాటించాలని, భూమి , భవిష్యత్తు తరాల కోసం నీటిని రక్షించుకోవడం అవసరం అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసిఎల్ బి మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీఓ వీణ, భూగర్భ జల శాఖ అధికారి సతీష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వడ దెబ్బల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## గ్రామ, మున్సిపాలిటీలలో చలి వేంద్రాలను ఏర్పాటు చేయాలి వడదెబ్బ అప్రమత్తతపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి -సూర్యాపేట జిల్లా కలెక్టర్- తేజస్ నంద లాల్ పవర్.





సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 23:
వేసవి కాలం సమీపిస్తున్న కొద్దీ, ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున, ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు.
సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో రానున్న వేసవికాలంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ తో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ తేజస్ నంద్ లాల్, అదనపు కలెక్టర్ కె.సీతారామరావుతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న వేసవికాలంలో వాతావరణ మార్పులతో మనుషులలో ఆరోగ్య సమస్యలు తలెత్తి శరీరంలో నీటి శాతం తగ్గి డీహైడ్రేషన్ గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.. ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.ముఖ్యంగా గ్రామ, పట్టణ, మున్సిపాలిటీ లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా మున్సిపాలిటీ లలో, ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాలలో పాటు బస్ స్టాండ్ లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి నీటి కొరత లేకుండా చూడాలన్నారు. అదే విదంగా వడ దెబ్బతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని, అన్ని ధవాఖానాలలో అందుబాటులో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, పిహెచ్సి లలో వడ దెబ్బ బారిన పడిన వారి కోసం బెడ్లను, సెలైన్ లను సిద్ధంగా ఉంచాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. త్వరలో ధాన్యం కొనుగోలు ప్రారంభం కానున్న క్రమంలో కొనుగోలు కేంద్రాల్లో త్రాగు నీటి సదుపాయాలను కల్పించాలని, గ్రామాలలో పశువుల కోసం నీటిని అందుబాటులో ఉంచాలని, ఇందుకోసం పశువుల తొట్టిలను మరమ్మతులు చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. కలెక్టరేట్ లో పని చేసే ఉద్యోగులు, సిబ్బంది ఖచ్చితంగా వాటర్ బాటిల్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అదే విదంగా మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉండే అవకాశాలు ఉన్నందున బయటకు రాకుండా చేసుకోవాలన్నారు. ముఖ్యంగా కాటన్ దుస్తులను ధరించాలని, కూల్ డ్రింక్స్ కాకుండా ఓఆర్ఎస్ లేదా పండ్ల రసాలు తీసుకోవాలని సూచించారు.కార్యక్రమం లో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వెంకటరమణ,

# జిల్లా కోర్టుకు బాంబు బెదిరింపు

## - దుండగులపై చర్యలు తీసుకుంటాం డి.ఎస్పీ కిషోర్ కుమార్






ములుగు జిల్లా ప్రతినిధి, మార్చి 23 (భారత శక్తి) : జిల్లా కేంద్రంలోని కోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. గుర్తు తెలియని ఆగంతకుడు ఆదివారం ఉదయం మెయిల్ పంపగా సెలవు దినం కావడంతో ఎవరు పరిశీలించలేదు. సోమవారం ఉదయం ములుగు జిల్లా కోర్టులో విధులకు హాజరైన సిబ్బంధి, వచ్చిన మెయిల్ లను పరిశీలించి గా ఓ అగంతకుడు పంపిన బాంబు బెదిరింపు మెయిల్ ను చూసిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు బాంబు స్క్వాడ్, జాగిలాలను రప్పించడం తో పాటు,ముందస్తు జాగ్రత్తగా అగ్నిమాపక శకటాన్ని కూడా సిద్ధం చేశారు. అప్పటికే కోర్టులో ఉన్న జడ్జీలు, న్యాయవాదులు, ఉద్యోగులను బయటికి పంపించి గంటసేపు బాంబు స్క్వాడ్ తో డీఎస్పీ కిషోర్ కుమార్ క్షుణ్ణంగా పరిశీలించారు. బాంబు బెదిరింపు మెయిల్ గుర్తుతెలియని ఆకతాయిల పనేనని బాంబు స్క్వాడ్ జాగిలాలతో కోర్టు మొత్తం తనిఖీ చేయగా ఎక్కడ బాంబు సంబంధించిన ఆనవాళ్లు దొరకలేదని డి.ఎస్పి తెలిపారు. దీంతో అందరిని భయభ్రాంతులకు గురి చేయడమే కాక విలువైన కోర్టు సమయాన్ని వృధా చేసిన వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. అనంతరం ఫేక్ మెయిల్ గా నిర్ధారించడం తో అందరూ ఒక్కసారిగా ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా కేంద్రం ఏర్పడక ముందు నుంచే ములుగులో కోర్టు కార్యకలాపాలు కొనసాగాయి. జిల్లా ఏర్పడిన అనంతర ములుగు జిల్లా కోర్టుగా అవతరించింది. ఎన్నడూ లేని విధంగా కోర్టుకు బెదిరింపు మెయిల్ రావడంతో అధికార యంత్రాంగం తో పాటు ములుగు పోలీస్ శాఖ, స్థానికుల సైతం ఆందోళనకు గురయ్యారు. సోమవారం నిర్వహించిన బాంబు స్క్వాడ్ తనిఖీలలో సీఐ సురేష్, ఎస్సై ఉపేందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేయొద్దు సూర్యాపేట పట్టణంలో ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ చేపట్టిన- ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి)మార్చి 23:
జిల్లా ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు పట్టణంలో ప్రజల, వాహనదారుల సౌకర్యార్థం ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఆపరేషన్ రోప్ కార్యక్రమం చేపట్టడం జరిగినదని సూర్యాపేట పట్టణ ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు.దీనిలో భాగంగా ఈరోజు కూరగాయ మార్కెట్ రోడ్డు లో ఉన్న ఆక్రమణలను మున్సిపాలిటీ అధికారులతో కలిసి తొలగించారు. అలాగే రోడ్డు పై ఉన్న మట్టి కుప్పలు, చెత్తను, రాళ్ళను తొలగించి రోడ్డు



సక్రమంగా కనిపించేలా వినియోగించేలా చేశారు. ముఖ్య పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలను అధిగమించడానికి, ప్రజలకు, వాహనదారులకు ఇబ్బంది కలగకుండా, ప్రమాదాలు జరగకుండా చేయడం, ఆక్రమణలు, అనధికారిక పార్కింగ్ తొలగించడం వంటివి చేపట్టారు. వాహనాలు క్రమపద్ధతిలో వెళ్లడం అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా పట్టణాల్లో ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు సూర్యాపేట ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో చర్యలు చేపట్టారు.

## మూడు నెలల్లో 28 మంది మృతి..

కరీంనగర్: జమ్మికుంట మండలం గంద్రపల్లి గ్రామంలో గత మూడు నెలలుగా వరుసగా 28 మంది వివిధ కారణాలతో మరణించడం తీవ్ర ఆందోళన కలిగించింది. గ్రామానికి ఏదో 'కీడు' సోకిందని బలంగా నమ్మిన గ్రామస్థులు, పురోహితుడి సూచన మేరకు వింత నిర్ణయం తీసుకున్నారు. ఒక రోజంతా ఊరు ఖాళీ చేసి పొలాల్లో 'కీడు వంటలు' వండుకోవాలని నిర్ణయించుకున్నారు. దీని కోసం తెల్లవారుజామునే ఇళ్లకు తాళాలు వేసి, డప్పు చాటింపు వేయించి మరీ ఊరి బయటకు వెళ్లారు. ఇలా చేస్తేనే గ్రామానికి పట్టిన పీడ విరుగడవుతుందని వారు విశ్వసిస్తున్నారు

## ప్రజావాణిలో 96 దరఖాస్తులు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 23 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ వివిధ సమస్యలపై వచ్చిన ఆయా శాఖలకు సంబంధించిన 96 అర్జీలను అర్జీదారుల నుండి స్వీకరించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ, ప్రజావాణిలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో ఏ సి ఎల్ బి మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్డీఓ వీణ, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## పోలీసు కుటుంబానికి ఆర్థిక చేయూత.

### చెక్కు అందజేసిన జిల్లా ఎస్పీ నరసింహ

సూర్యాపేట(భారత శక్తి జిల్లా ప్రతినిధి) మార్చి 23:
జిల్లా ఆర్మడ్ పోలీస్ విభాగం నందు పని చేస్తున్న కానిస్టేబుల్ జునైద్ ఇటీవల అనారోగ్యం కరాణంగా మరణించడం జరిగినది. దివంగత పోలీసు సిబ్బంది కుటుంబాల అవసరాలు తీర్చడం లో భాగంగా పోలీసు చేయూత పథకం ద్వారా జునైద్ కుటుంబ సభ్యులకు 2 లక్షల రూపాయల పోలీసు చేయూత పథకం చెక్కును ఎస్పీ నరసింహ ఐపీఎస్ ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయంలో అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ సిబ్బంది కుటుంబాల




సంక్షేమం కోసం ఎల్లప్పుడూ పోలీసు శాఖ కృషి చేస్తుంది. కమలాకర్ కుటుంబాన్ని పోలీస్ శాఖ అన్ని విధాల ఆదుకుంటుందని తెలిపినారు. చేయూత పథకం నిర్వహణకు జిల్లా పోలీసు సిబ్బంది ప్రతి నెల జీతం నుండి విరాళం అందిస్తున్నారు అని అభినందించారు, పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తున్నారన్నారు.ఈ కార్యక్రమం నందు స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, పోలీసు సంక్షేమ సంఘం అధ్యక్షులు ఎస్ఐ రామచందర్ గౌడ్, వెల్ఫేర్ ఆర్ఎస్ఐ సాయిరాం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# అడవులను కాపాడితేనే దేశం సుస్థిరంగా ఉంటుంది : జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) మార్చి 23: అటవీ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం, పిచ్చుకల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని డిగ్రీ కళాశాలలో ప్రత్యేక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పాల్గొని కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు.
ముందుగా కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ కార్యాలయం నుండి డిగ్రీ కళాశాల వరకు అవగాహన ర్యాలీ నిర్వహించబడింది. అధికారులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై నినాదాలు చేశారు.
ఈ సందర్భంగా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, "మొక్కలు నాటడం ద్వారా పచ్చదనం పెంపొందించవచ్చని కళాశాలలో ఉన్న ప్రతి విద్యార్థి ఒక మొక్క నాటి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. ప్రతి పుట్టినరోజున ఒక మొక్క నాటడం అలవాటు చేసుకోవాలి" అని సూచించారు. "అటవీ సంరక్షణే దేశ సంరక్షణ" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన పెంపొందించాలని ఆయన పిలుపునిచ్చారు. పిచ్చుకల సంరక్షణపై కూడా దృష్టి సారించాలని, ఇంటి వద్ద నీటి గిన్నెలు ఉంచడం, చిన్న గూళ్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు.
జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, "ప్రాణవాయువు లేకుండా మానవ జీవనం సాధ్యం కాదు. అడవులు, చెట్లు మన జీవనాధారాలు. ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్ తరాలు తీవ్రమైన సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుంది" అని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి దాన్ని సంరక్షించాలని, విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో ముందుండాలని పిలుపునిచ్చారు.
అటవీ శాఖ అధికారిణి నిఖిత, ఏఎస్పీ బి. చైతన్య రెడ్డి, ప్రిన్సిపల్ తదితర అధికారులు పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు. పోలీస్, అటవీ శాఖ అధికారులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమావేశంలో సారధి కళాకారులు తమ గీతాలతో "చెట్టూ చెట్టమ్మను నేను చెట్టును నేనురా, మనిషి మనుగడకు జీవం పోసే అమ్మ" వంటి నినాదాలతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అటవీ సంరక్షణ, పరిరక్షణ పోస్టర్ ను ఆవిష్కరించారు.

# పవన్ డబుల్ ధమాకా.. ఒకవైపు పొలిటికల్ థ్రిల్లర్.. మరోవైపు కమర్షియల్ ఎంటర్‌టైనర్!

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంతో విజయాన్ని అందుకుని మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు. హరీశ్ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ మాస్ ఎంటర్‌టైనర్ బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లు సాధిస్తుండటంతో పవన్ తన తదుపరి చిత్రాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. ఈ క్రమంలోనే ఆయన 33వ సినిమాకు సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఫిల్మ్ నగర్‌లో జోరుగా చక్కర్లు కొడుతోంది. విభిన్నమైన చిత్రాల దర్శకుడు దేవా కట్టాతో పవన్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'ప్రస్థానం', 'ఆటో నగర్ సూర్య', 'రిపబ్లిక్' వంటి సీరియస్, వాస్తవిక కథాంశాలతో తనకంటూ ప్రత్యేక ముద్ర వేసుకున్న దేవా కట్టా, ఈసారి పవన్ కోసం ఒక పవర్‌ఫుల్ పొలిటికల్ థ్రిల్లర్ కథను సిద్ధం చేసినట్లు సమాచారం. పవన్ కల్యాణ్ రాజకీయ సిద్ధాంతాలు, ఆయన ఆలోచనా విధానానికి అద్దం పట్టేలా ఈ సినిమా ఉండబోతుందని ఇండస్ట్రీ వర్గాల్లో




టాక్ నడుస్తోంది. ఇప్పటికే కథ లాక్ అవ్వగా, ప్రాథమిక చర్చలు కూడా పూర్తయ్యాయని అంటున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా సినిమాలు తీయడంలో దిట్ట అయిన దేవా కట్టా దర్శకత్వంలో పవన్ నటించనున్నారనే వార్త అభిమానుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ఇదిలా ఉంటే... పవన్ కల్యాణ్ మరోవైపు స్టైలిష్ దర్శకుడు సురేందర్ రెడ్డితో ఓ భారీ ప్రాజెక్ట్‌కు ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇదొక పూర్తిస్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా, భారీ బడ్జెట్‌తో తెరకెక్కనుంది. ఈ సినిమా కూడా త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం పవన్ కల్యాణ్ ఈ రెండు ప్రాజెక్టులను సమాంతరంగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్నారట. ఒకవైపు తన రాజకీయ భావజాలాన్ని ప్రతిబింబించే సీరియస్ పొలిటికల్ డ్రామా, మరోవైపు మాస్ అభిమానులను అలరించే పక్కా కమర్షియల్ చిత్రంతో ప్రేక్షకులను మెప్పించాలని ఆయన ప్లాన్ చేస్తున్నట్లు కనిపిస్తోంది. మొత్తానికి 'ఉస్తాద్ భగత్ సింగ్' ఇచ్చిన విజయంతో పవన్ రాబోయే సినిమాలతో బాక్సాఫీస్ వద్ద మరింత సందడి చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విభిన్నమైన కాంబినేషన్స్‌పై అభిమానుల్లో అంచనాలు భారీగా నెలకొన్నాయి.

## సినిమా

# కాలమే నిర్ణయిస్తుంది



మెగా డాటర్ కొణిదెల నిహారిక వ్యక్తిగత విషయాలు నెట్టింట వైరల్ గా మారాయి. చైతన్య జొన్నలగడ్డ నుంచి విడాకులు తీసుకున్నాక, ఆమె తన పూర్తి దృష్టిని కెరీర్‌పై పెట్టింది. ఇటీవల కమిటీ కుర్రోళ్లు చిత్రంతో నిర్మాతగా మంచి విజయాన్ని అందుకున్న నిహారిక, ఇప్పుడు రాకాస అనే మరో ఆసక్తికర సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా నిహారిక తన వ్యక్తిగత విషయాలు పంచుకుంది. తన రెండో పెళ్లి గురించి వస్తున్న వార్తలపై నిహారిక ఆసక్తికరమైన కామెంట్స్ చేశారు. ప్రస్తుతానికి ఆ ఆలోచన లేదని స్పష్టం చేసింది. అయితే భవిష్యత్తులో మళ్లీ పెళ్లి చేసుకునే అవకాశం లేకపోలేదని, అన్నీ కాలమే నిర్ణయిస్తుందన్నారు. తన అన్నయ్య వరుణ్ తేజ్, వదిన లావణ్య త్రిపాఠిల ప్రేమ కథ గురించి కూడా ఆమె కొన్ని రహస్యాలను బయటపెట్టింది. వారిద్దరూ ప్రేమలో ఉన్నారన్న విషయం తనకు నాలుగేళ్ల తర్వాతే తెలిసిందని, అప్పటి వరకు వారు ఆ విషయాన్ని చాలా సీక్రెట్ గా ఉంచారని తెలిపింది. వరుణ్ తేజ్ బయటకు ఇంట్రోవర్ట్‌లా కనిపించినా, చాలా సరదాగా ఉంటాడని, తనను ఎప్పుడూ ఆటపట్టిస్తూనే ఉంటాడని నిహారిక చెప్పుకొచ్చింది.



# క్రేజీ కాంబో

కాలేజ్‌నుంచి ఫ్రెండ్స్ అయిన మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కాంబో ఇండస్ట్రీలో మరో అరుదైన ఘనతను సాధించబోతోంది. దర్శకుడు ప్రియదర్శన్ తన కెరీర్‌లో ప్రతిష్టాత్మకమైన 100వ చిత్రానికి సిద్ధమవుతున్నాడు. ఆయన తొలి చిత్రంలో నటించిన మోహన్‌లాలే ఇందులోనూ హీరోగా నటిస్తున్నాడు. ఈ సినిమా గురించి మోహన్‌లాల్ సోషల్ మీడియా వేదికగా అధికారిక ప్రకటన చేస్తూ ఒక ప్రత్యేక వీడియోను పంచుకున్నాడు. వంద సినిమాలు అనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే కాదని, అది సినిమాపై ఉన్న అంకితభావానికి, అభిరుచికి నిదర్శనమని పేర్కొన్నాడు. తన స్నేహితుడి సుదీర్ఘ ప్రయాణాన్ని దగ్గరుండి చూసే భాగ్యం తనకు దక్కిందని భావోద్వేగానికి లోనయ్యారు. ఈ చిత్రాన్ని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరుంబవూర్ నిర్మిస్తున్నారు. ప్రియదర్శన్ తన సినీ ప్రయాణాన్ని 1984లో పూచక్కోరు మూక్కుతి అనే చిత్రంతో ప్రారంభించాడు. ఆ సినిమాకు మోహన్‌లాల్‌నే కథానాయకుడు. మొదటి సినిమాతోనే ఘనవిజయాన్ని అందుకున్న ఈ ద్వయం ఆ తర్వాత వెనక్కి తిరిగి చూసుకోలేదు. వీరి కాంబోలో వచ్చిన కాలాపానీ అద్భుతమైన విజయంతో పాటు దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంది.


# అమ్మ మాటలతో కొత్త ఊపిరి

టాలీవుడ్‌లోకి మెరుపుతీగలా దూసుకొచ్చి అతి తక్కువ సమయంలోనే అగ్ర హీరోల సరసన నటించే అవకాశం దక్కించుకుని మోస్ట్ వాంటెడ్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకుంది శ్రీలీల. పెళ్లి సందడి చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన ఈ భామ.. తన డ్యాన్సింగ్ స్కిల్స్, ఎనర్జీతో కుర్రకారును ఆకట్టుకుంది. ఆ తర్వాత రవితేజతో చేసిన ధమాకా బ్లాక్‌బస్టర్ కావడంతో ఆమె దశ తిరిగింది. మహేశ్ బాబు, బాలకృష్ణ, పవన్ వంటి స్టార్ హీరోల సినిమాల్లో వరుస అవకాశాలు అందుకుంది. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను పంచుకుంది. సోషల్ మీడియాలో తనపై వచ్చిన విపరీతమైన ట్రోలింగ్ చూసి ఒక దశలో కుంగిపోయిందట. గదిలో ఒంటరిగా కూర్చుని ఏడ్చిన సందర్భాలు ఎన్నో ఉన్నాయట. ఆ బాధ భరించలేక సినిమాలు తన ఒంటికి పడవని నిర్ణయించుకుందట. ఇక తాను సినిమాలు చేయనని, మళ్లీ కాలేజీకి వెళ్లి చదువుకుంటానని చెప్పిందట. తీవ్ర నిరాశలో ఉన్న తనకు అమ్మ చెప్పిన మాటలు కొత్త ఊపిరిని పోశాయని చెప్పింది. తన గురించి ప్రజలు అంత టైమ్ వేస్ట్ చేసుకుంటున్నారంటే తాను ఎదిగినట్లు అర్థమని చెప్పిందట.



## వరుణ్ తేజ్ లవ్ స్టోరీపై
# నిహారిక ఆసక్తికర వ్యాఖ్యలు





మెగా డాటర్, నిర్మాత నిహారిక కొణిదెల తన అన్నయ్య, నటుడు వరుణ్ తేజ్ ప్రేమ వ్యవహారంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వరుణ్ తేజ్, లావణ్య త్రిపాఠిల ప్రేమ గురించి తనకు నాలుగేళ్ల తర్వాత తెలిసిందని, ఓ పార్టీలో వారిద్దరినీ చూసి అనుమానం వచ్చిందని ఆమె వెల్లడించారు. తాను నిర్మాతగా వ్యవహరించిన 'రాకాస' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలు పంచుకున్నారు. నిహారిక మాట్లాడుతూ..'అందరూ మా అన్నయ్యను ఇంట్రావర్ట్ అనుకుంటారు, కానీ కాదు. వాడు పెద్ద రౌడీ, నన్ను బాగా ఏడిపిస్తాడు. ఇండస్ట్రీలో అతనికి స్నేహితులు తక్కువ కావడంతో, లావణ్యతో ప్రేమ విషయం చాలా కాలం రహస్యంగా ఉంది. ఓసారి అన్నయ్య బర్త్‌డే సెలబ్రేషన్స్‌కు లావణ్య వచ్చింది. మా అన్నయ్య ఎవరినీ పార్టీలకు పిలవడు. అందుకే అప్పుడే వాళ్లిద్దరూ ప్రేమలో ఉన్నారని నాకు అర్థమైంది' అని నవ్వుతూ చెప్పారు. ఇదే సందర్భంగా, 'మీరు మళ్లీ పెళ్లి చేసుకుంటారా?' అన్న ప్రశ్నకు నిహారిక స్పందిస్తూ, తప్పకుండా చేసుకుంటానని, అయితే ప్రస్తుతం దానిపై ప్రత్యేకంగా దృష్టి పెట్టడం లేదని స్పష్టం చేశారు.

## ఇప్పుడు ఇండస్ట్రీ పరిస్థితి ఏంటో
# అందరికీ తెలుసు: శర్వానంద్



యువ హీరో శర్వానంద్ తెలుగు సినీ పరిశ్రమ ప్రస్తుత పరిస్థితిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇప్పుడు ఇండస్ట్రీ పరిస్థితి ఏమిటో అందరికీ తెలుసు అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. ఆదివారం జరిగిన తన కొత్త సినిమా 'బైకర్' ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మంచి సినిమాలు రావాలన్నా, నిర్మాణ వ్యయం అదుపులో ఉండాలన్నా నిర్మాతల పాత్ర చాలా కీలకమని ఆయన అభిప్రాయపడ్డారు. సినిమా నిర్మాణంలో నిర్మాత క్రియాశీలత గురించి శర్వానంద్ వివరిస్తూ, "నిర్మాతలు స్క్రిప్టు దశ నుంచి ప్రతిరోజూ సెట్‌కు వచ్చి దగ్గరుండి పనులు చూసుకుంటే ప్రొడక్షన్ ఖర్చు పెరగదు. అప్పుడే మంచి సినిమాలు తీయగలం" అని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా 'శతమానం భవతి' సినిమాకు నిర్మాత దిల్ రాజు దగ్గరుండి పాటలు రాయించుకున్న విషయాన్ని గుర్తుచేశారు. దిల్ రాజులాగే యూవీ క్రియేషన్స్ వంశీ, నిర్మాత బన్నీ వాసు కూడా తమ సినిమాల పట్ల ఎంతో డెడికేషన్‌తో పనిచేస్తారని శర్వానంద్ ప్రశంసించారు. నిర్మాతలు హీరోల వెనకుండి, మంచి కథలతో బడ్జెట్‌లో సినిమాలు తీసి డబ్బులు సంపాదిస్తే అందరూ బాగుంటారు. హీరోలకు కూడా అది చాలా సంతోషాన్నిస్తుందన్నారు. నిర్మాతలందరూ ఈ పద్ధతి పాటిస్తే పరిశ్రమకు మేలు జరుగుతుందని ఆయన సూచించారు.

## ధురంధర్2 చిత్రంపై నాగార్జున రివ్యూ

టాలీవుడ్ కింగ్ నాగార్జున... బాలీవుడ్‌లో సంచలనం సృష్టిస్తున్న 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంపై ప్రశంసల వర్షం కురిపించారు. ఇదొక స్ఫూర్తిదాయక చిత్రమని, భారత సినీ పరిశ్రమలో సరికొత్త మార్పునకు నాంది పలుకుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ట్వీట్ చేశారు. "'ధురంధర్: ది రివెంజ్' అనే ఒక అద్భుతమైన సినిమా చూశాను! వాట్ ఏ రైడ్! ఈ సినిమా నా మతి పోగొట్టింది. చూసినప్పటి నుంచి ఇప్పటికీ దాని గురించే ఆలోచిస్తున్నాను, ఆ ప్రభావం నుంచి బయటకు రాలేకపోతున్నాను.సినిమా నిర్మాణ శైలిని మార్చేసే, ఎంతో స్ఫూర్తినిచ్చే అరుదైన చిత్రాలలో ఇదీ ఒకటిగా నిలిచిపోతుంది. ఇంత స్ఫూర్తిదాయకమైన చిత్రాన్ని అందించిన దర్శకుడు ఆదిత్య ధర్‌కు నా హృదయపూర్వక అభినందనలు. ఆయనతో పాటు కెమెరా, సంగీతం, సౌండ్ డిజైన్, యాక్షన్, ఆర్ట్ విభాగాలతో సహా పనిచేసిన మొత్తం టెక్నికల్ టీమ్‌కు కూడా నా ప్రత్యేక అభినందనలు తెలియజేస్తున్నాను. ఇక నటీనటుల గురించి ఎంత చెప్పినా తక్కువే. ప్రతి ఒక్కరూ ఎంతో అద్భుతంగా నటించారు. మీరందరూ అదరగొట్టారు. ఈ గొప్ప చిత్రానికి మా అన్నపూర్ణ స్టూడియోస్ హైదరాబాద్ డాల్బీ సినిమా ప్రాసెసింగ్‌తో పాటు, సౌత్ ఇండియన్ భాషల లోకలైజేషన్ సేవలను అందించిందని చెప్పడానికి నేను చాలా గర్వపడుతున్నాను" అంటూ నాగార్జున తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆదిత్య ధర్ దర్శకత్వంలో రణ్‌వీర్ సింగ్ హీరోగా నటించిన 'ధురంధర్: ది రివెంజ్' ఇటీవలి కాలంలో భారతీయ సినిమాలో అతిపెద్ద విజయాల్లో ఒకటిగా నిలిచింది. విడుదలైన అన్నిచోట్లా భారీ ఆదరణతో పాటు డబ్బింగ్ వెర్షన్లు కూడా మంచి వసూళ్లు సాధిస్తున్నాయి. హైపర్‌స్టైలైజ్డ్ యాక్షన్, జాతీయవాదం వంటి అంశాలతో ఈ ఫ్రాంచైజీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటోంది.




# సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజ్ లో అగ్నిప్రమాదం

* 3 ఫైర్ ఇంజన్లతో మంటలు ఆర్పుతున్న సిబ్బంది
* కోల్డ్ స్టోరేజ్ లో 300 మంది రైతులకు చెందిన 55 వేల మిర్చి బస్తాలు,40 కోట్లకు పైగా ఆస్తి నష్టం

ఖమ్మం బ్యూరో, మార్చి 23 (భారత శక్తి) : ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూరు శ్రీ సాయి బాలాజీ కోల్డ్ స్టోరేజీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో మంటలు చెలరేగాయి. వైరా మండలం పాలడుగు గ్రామానికి చెందిన వనమా హరిబాబు, వాసు భాగస్వామ్యంతో సుమారు 15 సంవత్సరాల క్రితం ఆత్కూరు గ్రామంలో కోల్డ్ స్టోరేజీని నిర్మించారు. కోల్డ్ స్టోరేజీ లోని ఐదవ అంతస్తులోని బ్లాక్ నుండి పొగలు వస్తుండటంతో ఆందోళనకి గురైన కోల్డ్ స్టోరేజీ సిబ్బంది మధిర లోని అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది కోల్డ్ స్టోరేజీ వద్దకు చేరుకొని ముందుగా మంటలు చెలరేగిన బ్లాక్ లో మంటలు అదుపు తెచ్చేందుకు ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మంటలు అన్ని బ్లాకులకు విస్తరించి అన్నిబ్లాకుల్లో ఉన్న మిర్చి బస్తాలకు మంటలు అంటుకున్నాయి. కోల్డ్ స్టోరేజీలో గత సంవత్సరానికి చెందిన 28 వేల బస్తాలు నిల్వ ఉండగా, ఈ సంవత్సరం వచ్చిన మిర్చి 27 వేల బస్తాలు నిల్వ ఉన్నట్లు తెలిసింది. సుమారు 300 మంది రైతులకు చెందిన సుమారు 55 వేల బస్తాలు నిల్వ కోల్డ్ స్టోరేజ్ యజమానులు తెలిపారు. మంటలు అదుపు లోకి రాకపోవడంతో , ఇతర ప్రాంతాల నుండి మరో రెండు ఫైర్ ఇంజన్లను తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నాలు చేస్తున్నారు. సుమారుగా 5 అంతస్తుల ఎత్తు కలిగిన కోల్డ్ స్టోరేజీలో పై ఫ్లోర్లో మంటలు చెలరేగాయి. మంటలను ఆర్పేందుకు హైదరాబాదు నుండి స్కైలాబ్ ఫైర్ ఇంజన్ను అధికారులు తెప్పిస్తున్నారు. 2012 మే 19వ తేదీన మధిరలోని విజయవాడ రోడ్డులో ఉన్న శ్రీ లక్ష్మీ వల్లభ కోల్డ్ స్టోరేజ్ లో ఇదేవిధంగా అగ్ని ప్రమాదం జరిగి రైతులకు చెందిన వేలాది మిర్చి బస్తాలు తగలబడ్డాయి. ఆరుగాలం పండించిన మిర్చి బస్తాలు కోల్డ్ స్టోరేజ్లో చెలరేగిన మంటలలో తగలబడుతుండటంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ తమను ప్రభుత్వం, ఇన్సూరెన్స్ కంపెనీ ఆదుకోవాలని కోరుతున్నారు. అగ్నిప్రమాదం జరిగిన కోల్డ్ స్టోరేజ్ వద్ద మధిర టౌన్ సిఐ రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కేఎంసి ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బాధ్యతల స్వీకరణ

కడప, మార్చి 23 (భారత శక్తి) : కడప నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి బాధ్యతలను స్వీకరించారు. అన్ని మున్సిపాలిటీల పాలక మండలి గడువు ముగియడంతో ఆయా మున్సిపాలిటీలకు ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. ఆ మేరకు కడప నగర పాలక సంస్థలోని ఛాంబర్ లో ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం డా. శ్రీధర్ చెరుకూరికి నగర పాలక సంస్థ కమిషనర్ రాకేష్ చంద్రం, పలువురు మున్సిపల్ అధికారులు పూల మొక్కల కుండీలను అందజేసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా




నగర పాలక సంస్థ పరిధిలో నిర్వహణలో ఉన్న వివిధ పనుల గురించి నగర కమీషనర్.. కెఎంసి ప్రత్యేకాధికారి డా. శ్రీధర్ చెరుకూరి కి వివరించారు.

## గిరిజన సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

: ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ సభ్యులు పి వెంకటప్ప

కడప, మార్చి 23 (భారత శక్తి ప్రతినిధి): గిరిజనుల సంక్షేమం కోసం, ఆయా కాలనీల అభివృద్ధి కోసం అధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర ఎస్టి కమిషన్ సభ్యులు వెంకటప్ప స్పష్టం చేశారు చేశారు. కడప బాలాజీ నగర్ లోని యూటీఎఫ్ భవన్లో గిరిజన అభివృద్ధి సంఘం ఆత్మీయ సదస్సు సంఘం గౌరవ సలహాదారు కేంద్రీ సుధాకర్ ఆధ్వర్యంలో జరిగింది. సదస్సుకు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యులు వెంకటప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఎస్టి కమిషన్ సభ్యులు వెంకటప్ప గారు మాట్లాడుతూ గిరిజన కుటుంబాలకు పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు, ఇంటి స్థలాలు నివాస గృహాలు లేనివారికి ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. గిరిజన విద్యార్థుల కోసం గిరిజన గురుకుల పాఠశాలలు, విద్యా, వైద్యం, మౌలిక వసతుల కల్పన కోసం రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాష్ట్రంలో గిరిజనులకు ఎక్కడ అన్యాయం జరిగిన ఏపీ ఎస్టి కమిషన్ అండగా ఉంటుందన్నారు. గిరిజనలు సమాజంలో గౌరవంగా హుందాగా రాజకీయంగా ఎదగాలని కోరుతూ మైదాన ప్రాంతాలలో గిరిజనుల కోసం అటవీ హక్కు చట్టం ద్వారా ఆర్ ఓ ఆర్ పట్టాలు మరియు పందుల పెంపకం కోసం సబ్సిడీ లోన్లు ఇతరత్రా



మౌలిక వసతుల సదుపాయాల కోసం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కట్టుబడి ఉందన్నారు. కడప జిల్లాలో ఉన్న ప్రతి గిరిజనుడి సమస్యను పరిష్కరిస్తానని కోరుతూ గిరిజనుల సమస్య పట్ల వారి అభివృద్ధి పట్ల రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. ఈ రాష్ట్ర సలహాదారు కేద్రి సుధాకర్ మాట్లాడుతూ ఎస్టీలకు సంబంధించిన అసైన్డ్ భూములు కబ్జాలకు గురవుతున్నాయని జిల్లాలో అడవుల నుంచి వెదురు బొంగులు తీసుకొచ్చేటప్పుడు ఫారెస్ట్ అధికారులు చాలా ఇబ్బంది పెడుతున్నారని మరియు, పందుల పెంపకం దారులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని భూములు బోర్లు త్రాగునీరు ఇతరత్రా మౌలిక వసతుల సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లాలు ప్రధానంగా ఎస్టీ ఎరుకుల కులస్తులు చాలా వెనుకబడి ఉన్నారని వారికి విద్య వైద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని పరిశ్రమల శాఖ నుంచి సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని వారు కోరారు. కడప తారకరామ నగర్ లో రాములు గుడి అభివృద్ధి చేయాలని, అంగన్వాడి కేంద్రం కావాలని సీకే దిన్నె మండలంలోని గిరిజనులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతి పత్రాలను అందించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు శ్రావణ్ కుమార్, శ్రీనివాసులు,, హరి, తదితర నాయకులు పాల్గొన్నారు.

## బకాయిదారులపై జీహెచ్ఎంసీ 'ఉక్కుపాదం'

హైదరాబాద్, మార్చి 23 (భారతశక్తి): ఆస్తి పన్ను వసూళ్లలో అలసత్వం వహిస్తున్న భారీ బకాయిదారులపై గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) కొరడా ఝుళిపిస్తోంది. వన్ టైం సెటిల్మెంట్ (OTS) పథకం గడువు సమీపిస్తున్న నేపథ్యంలో, పన్ను చెల్లించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆర్.వి. కర్ణన్ డిప్యూటీ కమిషనర్లకు విస్పష్ట ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో రంగంలోకి దిగిన అధికారులు మంగళవారం పలువురు టాప్ డిఫాల్టర్ల ఆస్తులను జప్తు చేయడంతో పాటు సంస్థలను సీజ్ చేశారు.




**రూ. 6 కోట్లు ఎగ్గొట్టిన 'కత్రియా' జప్తు**

నగరంలోని ఖైరతాబాద్ సర్కిల్ పరిధిలో గల ప్రముఖ కత్రియా హోటల్ పై అధికారులు చర్యలు తీసుకున్నారు. 2017 నుంచి ఈ హోటల్ సుమారు రూ. 6.16 కోట్ల ఆస్తి పన్ను బకాయిలు చెల్లించకుండా మొండికేస్తోంది. దీంతో ఖైరతాబాద్ డిప్యూటీ కమిషనర్ నేతృత్వంలోని వారెంట్ బృందం హోటల్ను జప్తు చేసింది. పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించకపోవడంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు.

**స్వర్ణ ట్రాన్స్పోర్ట్, క్లాత్ మాల్ సీజ్**

గోషామహల్ సర్కిల్ పరిధిలో రూ. 36 లక్షల పన్ను బకాయి ఉన్న స్వర్ణ ట్రాన్స్పోర్ట్ను అధికారులు సీజ్ చేశారు. అలాగే జూబ్లీహిల్స్ సర్కిల్, బంజారాహిల్స్ రోడ్ నం. 10లోని షమీమ్ సుల్తానా క్లాత్ మాల్పై కూడా అధికారులు విరుచుకుపడ్డారు. రూ. 35.27 లక్షల బకాయి పడ్డ ఈ మాల్ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

* **ఓటీఎస్ వినియోగించుకోకుంటే కఠినమే..**

నగర వ్యాప్తంగా ఉన్న ఆస్తి పన్ను బకాయిదారులు ప్రభుత్వం కల్పించిన OTS పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ సూచించారు. గడువు ముగిసిన తర్వాత ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని, టాప్ డిఫాల్టర్ల జాబితా ఆధారంగా జప్తు చర్యలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు

## 9వ వార్డు సందర్శించిన ఏఐసీసీ సభ్యులు సర్వోత్తమ్ రెడ్డి

* వార్డు కౌన్సిలర్ ను అభినందించిన సర్వోత్తమ్ రెడ్డి

సూర్యాపేట, మార్చి 23 (భారత శక్తి జిల్లా ప్రతినిధి): సూర్యాపేట మున్సిపాలిటీ 9వ వార్డులో గల పార్కులను కాంగ్రెస్ పార్టీ వార్డు నాయకులు కౌన్సిలర్ బండారు మంగమ్మ భర్త వెంకన్న ఆధ్వర్యంలో సందర్శించారు.ముఖ్యంగా బుద్ధుని పార్కు పూర్తిగా కలియతిరిగి చూశారు.ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన కొంతమంది కాలనీవాసులతో ఆయన మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నవెంటనే పరిష్కరిస్తామని ఇప్పటికే సూర్యాపేట మున్సిపాలిటీలో ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని తెలిపారు.ప్రజలు ఎలాంటి ఆందోళన చెందవద్దని తమ ప్రభుత్వం హయాంలో ప్రజలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకే అన్ని ప్రాంతాలను తిరిగి అక్కడి ప్రాంతాల సమస్యలను అడిగి తెలుసుకుని నోట్ చేసుకుంటున్నామని చెప్పారు.వెనువెంటనే పరిష్కరించాల్సిన సమస్యలను సంబంధిత శాఖ



అధికారులతో ప్రాంతీయ ప్రజా ప్రతినిధులతో మాట్లాడి మున్సిపల్ చైర్ పర్సన్ కమిషనర్ లతో చర్చించి వాటి పరిష్కార మార్గం చూపిస్తున్నామని అన్నారు.తాను వార్డులో వస్తున్న ప్రాంతంలో ఉన్న సమస్యలను పరిశీలిస్తూ వచ్చానని తెలిపారు. కొత్తగా కౌన్సిలర్ గా గెలుపొంది బాధ్యతలు చేపట్టిన బండారు మంగమ్మ వెంకన్నలు సొంత ఖర్చులతో కొన్ని పనులు చేయడం అభినందనీయం అన్నారు. వార్డు అభివృద్ధి కోసం కౌన్సిలర్ కు సహకరించాలని కోరారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు చివ్వెంల మండలం అధ్యక్షుడు ధరావత్ వీరన్న నాయక్, పార్టీ నాయకులు ఉప్పల లక్ష్మాది, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి,సండ్ర విజయ్ కుమార్, గుణగంటి సతీష్,పార్టీ వార్డు నాయకులు బండారు వెంకన్న,చంద్రారెడ్డి,నలగొండ మన్నెమ్మ,తలారి రాజు, ఈదుల జానయ్య,కోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు..

గోరి కొత్తపల్లి రేగొండ, మార్చి 23 (భారత శక్తి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షులు రామచంద్ర రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ యావత్ ప్రజానీకాన్ని మోసం చేసి గద్దెనెక్కి ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా మోసానికి గురి చేస్తున్న కాంగ్రెస్ రేవంత్ సర్కార్ మెడల్వంచే దిశగా చలో అసెంబ్లీ ముట్టడికి సోమవారం పిలుపునివ్వడం జరిగింది. ఆదివారం నైట్ ముందస్తుగా గోరి కొత్తపల్లి రేగొండ పోలీసులు బిజెపి నాయకులు విష్ణు యాదవ్, బిజెపి రేగొండ మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్, బిజెపి భాగిర్తిపేట సర్పంచ్ శ్రీలత తిరుపతి గౌడ్ లను వారి ఇంటికి వచ్చిఅరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకు వెళ్ళారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ లాటీలు, తూటాలు ఉద్యమాన్ని ఆపలేవని అన్నారు. భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధికార దిశగా పోరాటం చేస్తామని ఎన్ని కేసులు అయినా, ఎన్ని అరెస్టులైన ఈ ధర్మపోరాటం కొనసాగుతూనే ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు పులుసాని తిరుపతిరావు, జిల్లా నాయకులు నారాయణరెడ్డి, మోదుకుపల్లి బుచ్చిరెడ్డి, బండారి రవి, జాలిగపు రాజయ్య , లింగారెడ్డి, ఉప సర్పంచ్లు మోహన్ నాయక్, శేఖర్, రమేష్ ,శ్రీధర్, రాజేందర్ నాయక్, రాకేష్, రఘు, కుమారస్వామి, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

## ద్వేషపూరిత ప్రసంగాలపై ఉక్కుపాదం..

# కేబినెట్‌లో CM రేవంత్ మార్క్ నిర్ణయాలు

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం పలు చారిత్రాత్మక బిల్లులకు ఆమోదం తెలిపింది. సామాజిక భద్రత, కార్మిక సంక్షేమం మరియు మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**తల్లిదండ్రుల మద్దతు బిల్లు..**

వృద్ధాప్యంలో తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారికి షాక్ ఇచ్చేలా కేబినెట్ ఈ బిల్లును ఆమోదించింది. తల్లిదండ్రులను సరిగ్గా ఆదరించని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉద్యోగుల వేతనాల్లో కోత విధించాలని నిర్ణయించారు. వారి జీతం నుండి 15 శాతం లేదా రూ.10 వేలు నేరుగా తల్లిదండ్రులకు అందేలా చట్టం తీసుకురానున్నారు.

**మెట్రో స్వాధీనం హెచ్ఎంఆర్ఎల్‌కు బాధ్యతలు:**

ఎల్అండ్‌టీ (L&T) నుంచి హైదరాబాద్ మెట్రో స్వాధీన ప్రక్రియను వేగవంతం చేయాలని కేబినెట్ నిర్ణయించింది. ప్రభుత్వ పరంగా జరగాల్సిన లావాదేవీల నిర్వహణ బాధ్యతను




హెచ్ఎంఆర్ఎల్ (HMRL)కు అప్పగించారు. రాష్ట్రంలో చేపట్టిన కులగణనపై జస్టిస్ సుదర్శన్ రెడ్డి కమిటీ సమర్పించిన నివేదికను మంత్రివర్గం ఏకగ్రీవంగా ఆమోదించింది. విద్వేషపూరిత ప్రసంగాలు (Hate Speech), నేరాల నిరోధక బిల్లుకు ఆమోదం. గిగ్ వర్కర్ల (డెలివరీ బాయ్స్, క్యాబ్ డ్రైవర్లు) సంక్షేమం కోసం ప్రత్యేక బిల్లు. న్యాయవాదుల రక్షణ కోసం 'తెలంగాణ అడ్వొకేట్ ప్రొటెక్షన్ బిల్లు'. యూనివర్సిటీల్లో వివక్షను అరికట్టేందుకు తీసుకురానున్న 'రోహిత్ వేముల చట్టం' విధివిధానాల కోసం కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేశారు. ఇందులో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, శ్రీధర్ బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి మరియు పొన్నం ప్రభాకర్ సభ్యులుగా ఉంటారు. రాష్ట్ర ప్రయోజనాలే పరమావధిగా ఈ బిల్లులను రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెట్టి చట్టరూపం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది.

# గ్యాస్ కొరతపై ధర్నా నిర్వహించిన బీఆర్ఎస్ నాయకులు

ఎల్బీనగర్, మార్చి 23 (భారత శక్తి): రాష్ట్ర ప్రభుత్వం - కేంద్ర ప్రభుత్వం ఒకరిపై ఒకరు నెపం వేసుకుంటూ ఆడుతున్న ఈ దొంగ నాటకాల వల్లే ఇప్పుడు గ్యాస్ కొరత పరిస్థితి ఏర్పడిందని ఎల్బీనగర్ నియోజకవర్గ సీనియర్ బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు.దానిలో భాగంగా సోమవారం ఎల్బీనగర్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని పలువురు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం మాత్రం "గ్యాస్ సప్లై ఎక్కడా ఆగలేదు, అన్నీ సక్రమంగా జరుగుతున్నాయి" అంటోంది. రాష్ట్ర ప్రభుత్వం అయితే "కేంద్రం నుంచి సరైన సరఫరా లేకపోవడం వల్లే సమస్యలు వస్తున్నాయి" అని చెబుతోంది.ఈ ఇద్దరి పరస్పర ఆరోపణల మధ్యలో సామాన్య ప్రజలే తీవ్రంగా నష్టపోతున్నారు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు దొరకక రోజువారీ జీవనంపై ఆధారపడే ఆటో డ్రైవర్లు, టిఫిన్ సెంటర్ యజమానులు, ఓల్డ్ ఏజ్ హోమ్స్ వంటి అనేక వర్గాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో, గ్యాస్ కొరతను సృష్టించి బ్లాక్ మార్కెట్‌లో అమ్మడం జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయి. ఇది నిజమైతే, అది పూర్తిగా అన్యాయం. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని, సరఫరా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావడం, బాధ్యత వహించడం ప్రభుత్వాల బాధ్యత. అవసరమైన చోట బాధ్యత తీసుకుని సమస్యను వెంటనే పరిష్కరించాలి.ఐదు రాష్ట్రాల (అస్సాం, తమిళనాడు, వెస్ట్ బెంగాల్, పాండిచేరి, కేరళ) ఎన్నికల నేపథ్యంలో కేవలం 50 రూపాయలు మాత్రమే పెంచడం జరిగింది. ఈ ఎన్నికల నేపథ్యంలో గ్యాస్ సిలిండర్ పైన ధరలు పెంచితే రాబోయే ఎలక్షన్లో ఇబ్బందికరమైన పరిస్థితి వస్తుందని ఎన్నికల తరువాత డోమెస్టిక్, కమర్షియల్ గ్యాస్ సిలిండర్లపైన భారీగా రేట్లు పెంచనున్న కేంద్ర ప్రభుత్వం.ఎన్నికలు అయిపోయిన వెంటనే మరో 50



రూపాయలు పెంచే యోజనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల ఈ దొంగ నాటకాలలో సామాన్య ప్రజలే నష్టపోతున్నారు.ఈ కార్యక్రమంలో గజ్జెల మధుసూదన్ రెడ్డి,అనంతుల రాజిరెడ్డి, బిచెనేపల్లి వెంకటేశ్వర్ రావు, మాజీ కార్పొరేటర్లు కొప్పుల విఠల్ రెడ్డి, చెరుకు సంగీత ప్రశాంత్ గౌడ్, జిట్టా రాజశేఖర్ రెడ్డి,పద్మ శ్రీనివాస్ నాయక్, సామ తిరుమల రెడ్డి, భవాని ప్రవీణ్ కుమార్,జిన్నారం విఠల్ రెడ్డి, సొంటి చంద్రశేఖర్ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రంగేశ్వరి నాయుడు, డివిజన్ల అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, సత్యం చారి,వరప్రసాద్ రెడ్డి,లింగాల రాహుల్ గౌడ్, చింతల రవికుమార్, శ్రీధర్ గౌడ్, రాజిరెడ్డి, జక్కిడి మల్లారెడ్డి, చిరంజీవి, శ్రీశైలం యాదవ్, రోజారెడ్డి పలువురు ఉద్యమకారులు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# జర్నలిస్టుల ధిక్కార స్వరం.. రేపు 'ఛలో హైదరాబాద్'

* **బడ్జెట్‌లో మొండిచేయి.. హామీలు గాలికే!**
* **అక్రెడిటేషన్లు, హెల్త్ కార్డులపై ప్రభుత్వం నిర్లక్ష్యం**
* **ఐ అండ్ పీఆర్ కార్యాలయం ముట్టడికి టీడబ్ల్యూజేఎఫ్ పిలుపు**

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని, వివక్ష ధోరణిని నిరసిస్తూ ఈ నెల 25న రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు "ఛలో హైదరాబాద్ ఐ అండ్ పీఆర్ కార్యాలయ ముట్టడి" కార్యక్రమం చేపట్టనున్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు, రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య ఈ మేరకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన గత రెండేళ్లలో పాత్రికేయుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని ఆయన ఆరోపించారు.

**బడ్జెట్‌లో ప్రాధాన్యం శూన్యం:**

ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జర్నలిస్టుల సంక్షేమం ప్రస్తావనే లేకపోవడం దారుణమని సోమయ్య విమర్శించారు. కనీసం ఒక్క మాట కూడా చెప్పకపోవడం ప్రభుత్వం చూపుతున్న వివక్షకు నిదర్శనమని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, జర్నలిస్టుల పట్ల తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని ధ్వజమెత్తారు.

**అపరిష్కృతంగానే ప్రధాన సమస్యలు:**

* ప్రభుత్వ వైఫల్యాల వల్ల పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఏకరువు పెట్టారు:
* అక్రెడిటేషన్లు: ప్రభుత్వం కొలువుదీరి రెండేళ్లు గడిచినా కొత్త అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయలేదు.
* వైద్య సేవలు: జర్నలిస్టులకు అత్యవసరమైన హెల్త్ కార్డుల పంపిణీలోనూ జాప్యం జరుగుతోంది.
* ఇళ్ల స్థలాలు: సుప్రీంకోర్టు తీర్పును సాకుగా చూపిస్తూ ఇళ్ల స్థలాల కేటాయింపు ప్రక్రియ నుంచి ప్రభుత్వం తప్పుకుంటోంది.
* పదవీ విరమణ లబ్ధి: పొరుగు రాష్ట్రాల్లో పాత్రికేయులకు పెన్షన్లు ఇస్తుండగా, మన రాష్ట్రంలో ఆ దిశగా అడుగులు పడటం లేదు.
* మీడియా అకాడమీ: అకాడమీకి గవర్నింగ్ కౌన్సిల్ నియమించకపోవడంతో కార్యకలాపాలు కుంటుపడుతున్నాయి.

**చిన్న పత్రికలపై ఉక్కుపాదం**

ఆర్ఎన్ఐ (RNI), పీఆర్జీఐ (PRGI) గుర్తింపు పొందిన చిన్న, మధ్య తరహా పత్రికలు, పీరియాడికల్స్‌ను ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అణిచివేస్తోందని సోమయ్య ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా అడ్వర్టైజ్‌మెంట్ బిల్లులు చెల్లించకపోవడంతో ఆయా సంస్థలు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. ఎంపానల్మెంట్ ప్రక్రియ నిలిపివేయడం, అక్రెడిటేషన్లు ఇవ్వకపోవడం వంటి చర్యలతో చిన్న పత్రికల ఉనికిని దెబ్బతీస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా చేపట్టే "ఛలో హైదరాబాద్" ఆందోళనలో రాష్ట్రవ్యాప్త జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# కాముని చెరువుకు పునర్జీవం..!

* **క్షేత్రస్థాయిలో హైడ్రా కమిషనర్ పర్యవేక్షణ.. పనులు వేగవంతం చేయాలని ఆదేశం**

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : మూసాపేటలోని కాముని చెరువు పునరుద్ధరణ పనులపై హైడ్రా (HYDRAA) దృష్టిసారించింది. సోమవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి చెరువు ప్రస్తుత పరిస్థితిని, జరుగుతున్న పనులను సమీక్షించారు. రెండో విడతలో భాగంగా పునరుద్ధరణకు ఎంపిక చేసిన 14 చెరువుల జాబితాలో కాముని చెరువు కూడా ఉంది.

**స్థానికుల ఇబ్బందులు - వినతులు**

పర్యటన సందర్భంగా స్థానిక నివాసితులు కమిషనర్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. కూకట్‌పల్లి నల్ల చెరువు తరహాలోనే దీనిని కూడా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని వారు కోరారు.

* దోమల మోత: చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క కారణంగా దోమల ఉధృతి విపరీతంగా పెరిగిందని, కనీసం తలుపులు తీసే పరిస్థితి కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

దుర్వాసన: మురుగు నీరు చేరడంతో వస్తున్న దుర్గంధం వల్ల పరిసర ప్రాంతాల్లో జీవించడం నరకప్రాయంగా మారిందని వివరించారు.





**సాంకేతిక అనుమతుల నిరీక్షణ**

చెరువు పనుల జాప్యంపై కమిషనర్ అధికారులను ఆరా తీశారు. దీనిపై స్పందించిన పర్యవేక్షక అధికారులు.. హెచ్ఎండీఏ (HMDA) నుంచి రావాల్సిన సాంకేతిక అనుమతులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అనుమతులు వచ్చిన వెంటనే పనులు వేగవంతం చేస్తామని వివరించారు.

**అధికారులకు కీలక ఆదేశాలు**

* పరిస్థితిని గమనించిన కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు:
* తక్షణ చర్యలు: అనుమతులతో సంబంధం లేకుండా, తక్షణమే గుర్రపుడెక్కను తొలగించి, నిల్వ ఉన్న మురుగు నీటిని బయటకు పంపేలా చర్యలు చేపట్టాలి.
* కాలువ పనుల పరిశీలన: కాముని చెరువు నుంచి మూసాయి కుంటకు వెళ్లే వరద కాలువ నిర్మాణాన్ని పరిశీలించి, అక్కడ ఉన్న సాంకేతిక లోపాలను నిర్మాణ దశలోనే సరిదిద్దాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.
* వార్షిక లక్ష్యం: ఈ వర్షాకాలం ప్రారంభమయ్యే నాటికి పునరుద్ధరణ పనులు పూర్తి చేసి, చెరువులోకి స్వచ్ఛమైన నీరు చేరేలా చూడాలని స్పష్టం చేశారు.
* వరద ప్రవాహానికి ఎలాంటి ఆటంకం కలగకుండా కాలువ నిర్మాణ పనులు పూర్తి చేయాలని సంబంధిత నిర్మాణ సంస్థ ప్రతినిధులకు కమిషనర్ దిశానిర్దేశం చేశారు.

# అసెంబ్లీ ముట్టడికి యత్నం: బీజేపీ నేతల ముందస్తు అరెస్టు

* **హయత్‌నగర్‌లో మాజీ కార్పొరేటర్ సహా పలువురు పోలీసుల అదుపులోకి**

హయత్‌నగర్, మార్చి 23 (భారత శక్తి) : రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ బీజేపీ రాష్ట్రశాఖ పిలుపునిచ్చిన 'అసెంబ్లీ ముట్టడి' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. శాంతిభద్రతల దృష్ట్యా పోలీసులు సోమవారం తెల్లవారుజామున బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేశారు.

**పోలీస్ స్టేషన్‌కు తరలింపు:**

హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి భాస్కర్‌ను పోలీసులు వారి నివాసాల వద్ద అదుపులోకి తీసుకున్నారు. వీరితో పాటు బీజేపీ డివిజన్ అధ్యక్షుడు గంగాని శ్రీనివాస్, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, నాయకుడు భరత్ తదితరులను ముందస్తుగా




అరెస్టు చేసి హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

**ప్రజాస్వామ్య హక్కుల హరణే: బీజేపీ**

ఈ సందర్భంగా అరెస్టు అయిన నాయకులు మాట్లాడుతూ.. ప్రజా సమస్యలపై నిరసన తెలిపే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. శాంతియుతంగా చేపట్టతలపెట్టిన అసెంబ్లీ ముట్టడిని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని మండిపడ్డారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజా పక్షాన తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. ముందస్తు అరెస్టుల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా పోలీసులు గట్టి నిఘా ఏర్పాటు చేశారు.



# అనాథ గృహానికి రూ. 60 వేల రూపాయల పుస్తకాలు, రేషన్ విరాళం

ఎల్బీనగర్, మార్చి 23 (భారత శక్తి): జర్మనీలో ఉంటున్న నాయుడు బుద్ధ, అమెరికాలో ఉంటున్న దుర్గ మిత్రులు కలిసి సోమవారం ఎల్బీనగర్ లోని అనాథ విద్యార్థి గృహ విద్యార్థులకు రూ. 60 వేల విలువల గల రేషన్,నోట్ బుక్స్ పోటీ పరీక్షల బుక్స్ ను గృహ అధ్యక్షులు మార్గం రాజేష్ సమక్షంలో విరాళంగా అందచేశారు .ఈ సందర్భంగా నాయుడు బుద్ధ మాట్లాడుతూ, అనాథ విద్యార్థి గృహం ఒక అద్భుతమైన వసతి గృహమని ,కమిటీ వారు అనాథ పిల్లలను చేర దీసి వారికి భోజన, వసతి, విద్యా, వైద్య, సకల సౌకర్యాలు కల్పించి, వారి భవిష్యత్తుకు నిరంతరంగా కృషి చేస్తున్నారని తెలిసి వ్యక్తిగతంగా సందర్శించినప్పుడు, వారి కోరిక మేరకు విద్యార్థులకు రేషన్, బుక్స్ ను అందచేశామని తెలిపారు.అమెరికాలో ఉంటున్న నా మిత్రురాలు దుర్గకు విద్యార్థుల అవసరాలు తెలియచేయగానే ,ఆమె కూడా ఈ విరాళంలో భాగస్వామ్య అయ్యారని తెలిపారు.అనంతరం నాయుడు బుద్ధ, గీత దంపతుల కుమారుడు ప్రణయ్ 18 వ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ప్రత్యేకమైన విందు భోజనం ఏర్పాటు చేశారు.

# హిందూ సమాజం సంఘటితమైతేనే దేశాభివృద్ధి

* **హయత్ నగర్ సమ్మేళనంలో కళ్లెం నవజీవన్ రెడ్డి**

హయత్ నగర్, మార్చి 23 (భారత శక్తి): హిందూ సమాజం ఐకమత్యంగా ఉండి, ధర్మబద్ధంగా వ్యవహరించినప్పుడే దేశం శక్తివంతంగా మారుతుందని హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని సూర్య నగర్ కాలనీలో నిర్వహించిన 'హిందూ సమ్మేళనం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హిందూ సమాజంలో ఏకాత్మతను చాటడం, స్వధర్మం పట్ల అవగాహన కల్పించడం లక్ష్యంగా జరిగిన ఈ సభలో ఆయన కీలక ప్రసంగం చేశారు.

* **సంస్కృతి పరిరక్షణలో యువత పాత్ర కీలకం**

ప్రతి ఒక్కరూ తమ మూలాలను, సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవాలని నవజీవన్ రెడ్డి సూచించారు. దేశభక్తి, సేవాగుణం కలిగిన సమాజాన్ని నిర్మించడంలో యువత క్రియాశీలక



పాత్ర పోషించాలన్నారు. యువతలో ధర్మబద్ధత పెంపొందించడం నేటి కాలంలో అత్యంత ఆవశ్యకమని ఆయన అభిప్రాయపడ్డారు.

* **లవ్ జిహాద్‌పై అప్రమత్తత అవసరం**

సమాజంలో చోటుచేసుకుంటున్న కొన్ని పోకడల పట్ల హిందూ సమాజం అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

* మోసపూరిత ప్రేమ: లవ్ జిహాద్ వంటి అంశాలపై యువత జాగ్రత్తగా ఉండాలని, ప్రేమ పేరుతో జరిగే మోసాలకు గురికావద్దని హెచ్చరించారు.



* నైతిక విలువలు: ఏ సంబంధమైనా పరస్పర గౌరవం, నిజాయితీపై ఆధారపడాలే తప్ప బలవంతం లేదా మోసం ఉండకూడదని స్పష్టం చేశారు.

* **తల్లిదండ్రుల బాధ్యత.. సమాజ చైతన్యం**

పిల్లల పెంపకం విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని నవజీవన్ రెడ్డి కోరారు. "పిల్లలతో తగిన సమయం గడుపుతూ వారికి సరైన మార్గదర్శనం చేయాలి. ఇంట్లోనే ధర్మం పట్ల అవగాహన కల్పించాలి. సమాజంలో చైతన్యం పెరిగినప్పుడే అరాచకాలను అడ్డుకోగలం" అని ఆయన వ్యాఖ్యానించారు. సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం పెరిగినప్పుడు ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కోవడం సాధ్యమవుతుందని, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

# ట్రంప్‌తో మేం చర్చలు జరపలేదు... చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు

అమెరికా, మార్చి 23 : అమెరికా, ఇరాన్ మధ్య మరోసారి మాటల యుద్ధం మొదలైంది. ఇరాన్‌పై సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించగా, ఆ ప్రకటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ట్రంప్‌తో తాము ఎలాంటి చర్చలూ జరపలేదని, తమ హెచ్చరికలతోనే ఆయన వెనక్కి తగ్గారని స్పష్టం చేసింది. చమురు ధరల తగ్గింపు కోసమే ఈ నాటకాలు అని విమర్శించింది. యుద్ధ నివారణ కోసం గల్ఫ్ దేశాలు చొరవ తీసుకున్నాయని, అయితే తాము చర్చల ప్రతిపాదను తిరస్కరించామని ఇరాన్ స్పష్టం చేసింది. అసలు చొరవ తీసుకోవాల్సింది, యుద్ధ విరమణ ప్రతిపాదన చేయాల్సింది యుద్ధం ప్రారంభించిన దేశం (ఇజ్రాయెల్) అని ఇరాన్ ఉద్ఘాటించింది. ఇవాళ ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో ఒక ప్రకటన చేశారు. "గత రెండు రోజులుగా ఇరాన్‌తో జరిపిన చర్చలు ఫలప్రదంగా సాగాయి. అందుకే ఇరాన్‌లోని విద్యుత్ కేంద్రాలు, ఇతర మౌలిక సదుపాయాలపై దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని రక్షణ శాఖను ఆదేశించాను. ఈ చర్చల ఫలితాన్ని బట్టి తదుపరి చర్యలు ఉంటాయి" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ట్రంప్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ఇరాన్ దీనిపై ఘాటుగా స్పందించింది. అమెరికాతో ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంప్రదింపులు జరగలేదని ఇరాన్ అధికారిక మీడియా వర్గాలు తేల్చిచెప్పాయి. ఇరాన్‌కు చెందిన ఫార్స్ న్యూస్ ఏజెన్సీ కథనం ప్రకారం.. తమ హెచ్చరికల కారణంగానే ట్రంప్ వెనక్కి తగ్గారని, తన ఓటమిని కప్పిపుచ్చుకోవడానికే చర్చల నాటకం ఆడుతున్నారని ఇరాన్ వర్గాలు ఆరోపించాయి. గతంలో విధించిన 48 గంటల గడువు ముగుస్తుండటంతో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఒకవైపు చర్చలు జరుగుతున్నాయని ట్రంప్ చెబుతుండగా, మరోవైపు ఇరాన్ ఖండిస్తుండటంతో గందరగోళం నెలకొంది. మరోవైపు, ట్రంప్ ప్రకటన ప్రభావంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పడిపోయాయి.

## హైదరాబాద్ సహా తెలంగాణలో పలుచోట్ల పెట్రోల్ బంకులు మూత!

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి):ఇరాన్, ఇజ్రాయెల్ అమెరికా యుద్ధం నేపథ్యంలో మన దేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ తదితరాలపై భారీ ప్రభావం పడుతోంది. హైదరాబాద్‌లో ఇంధన కొరత కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో ఉన్న పెట్రోల్ బంకులు తాత్కాలికంగా మూతబడ్డాయి. ముఖ్యంగా ప్రధాన కూడళ్లలోని బంకులు వరుసగా మూతబడుతున్నాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. సోమాజిగూడ, ఎస్సార్ నగర్ తదితర ప్రాంతాల్లోని పెట్రోలు బంకుల్లో 'నో స్టాక్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోనూ పలు పెట్రోల్ బంకులు తాత్కాలికంగా తెరుచుకోవడం లేదు. తెరిచి ఉన్న బంకుల్లో వాహనదారులు బారులు తీరుతున్నారు. యుద్ధానికి ముందు చమురు రంగ కంపెనీలు క్రెడిట్ ఇచ్చేవని, కానీ ఇటీవల ఇవ్వడం లేదని పెట్రోల్ బంకుల యజమానులు చెబుతున్నారు. కొత్తగా పెట్రోల్, డీజిల్ స్టాక్ కావాలంటే అడ్వాన్స్ కడితేనే వస్తుందని చెబుతున్నారు. కాగా, ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇరాన్ కూడా ట్రంప్ ప్రకటనకు సానుకూలంగా ఉండే అవకాశం ఉంది.

## పశ్చిమాసియా సంక్షోభంతో భారత్‌కు ఊహించని సవాళ్లు ఎదురయ్యాయి

ఢిల్లీ, మార్చి 23 (భారత శక్తి): పశ్చిమాసియాలో కొనసాగుతున్న సంక్షోభం కారణంగా భారత్ ఊహించని సవాళ్లను ఎదుర్కొంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారం లోక్‌సభలో వెల్లడించారు. ఈ యుద్ధం గల్ఫ్ దేశాల్లోని భారతీయులపై, దేశ వాణిజ్యంపై, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు వారాలుగా కొనసాగుతున్న ఈ సంక్షోభంపై విదేశాంగ మంత్రి జైశంకర్, కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి ఇప్పటికే సభకు వివరించారని గుర్తుచేశారు. ఈ సంక్షోభానికి త్వరగా పరిష్కారం కనుగొనాలని ప్రపంచ దేశాలన్నీ కోరుకుంటున్నాయని తెలిపారు.

*** ఇంధన సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు**

భారత్‌కు అవసరమైన ముడిచమురు, గ్యాస్, ఎరువులు వంటివి పెద్ద మొత్తంలో హర్మూజ్ జలసంధి నుంచే వస్తాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. యుద్ధం కారణంగా ఈ మార్గంలో నౌకల రాకపోకలు సవాలుగా మారాయని అన్నారు. "అయినప్పటికీ, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాపై తీవ్ర ప్రభావం పడకుండా మా ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది" అని ఆయన వివరించారు. దేశం తన ఎల్పీజీ అవసరాల్లో 60 శాతం దిగుమతి చేసుకుంటున్నందున, సరఫరాలో అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని దేశీయ వినియోగదారులకే తొలి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. అదే సమయంలో దేశీయంగా ఎల్పీజీ ఉత్పత్తిని కూడా పెంచుతున్నట్లు చెప్పారు.

*** వ్యూహాత్మక చర్యలతో పెరిగిన ఇంధన భద్రత**

గత 11 ఏళ్లలో ఇంధన భద్రత కోసం తమ ప్రభుత్వం తీసుకున్న వ్యూహాత్మక చర్యలను ప్రధాని మోదీ వివరించారు. గతంలో కేవలం 27 దేశాల నుంచి ముడి చమురు, ఎల్ఎన్‌జీ, ఎల్పీజీ వంటివి దిగుమతి చేసుకోగా, నేడు 41 దేశాల నుంచి దిగుమతి చేసుకునే స్థాయికి చేరామని తెలిపారు. సంక్షోభ సమయాల కోసం ముడి చమురు నిల్వలకు ప్రాధాన్యత ఇచ్చామని, ప్రస్తుతం దేశంలో 53 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా వ్యూహాత్మక పెట్రోలియం నిల్వలు ఉన్నాయని వెల్లడించారు. దీనిని 64 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా పెంచేందుకు పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇవి కాకుండా ఆయిల్ కంపెనీల వద్ద ఉండే నిల్వలు అదనమని అన్నారు.

## ఇరాన్‌తో యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నాం

మార్చి 23 (భారత శక్తి):పశ్చిమాసియాలో యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్‌పై యుద్ధాన్ని తాత్కాలికంగా ఆపేస్తున్నామని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. 5 రోజుల పాటు యుద్ధాన్ని నిలిపివేస్తున్నామని వెల్లడించారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులు ఆపేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా ఇరాన్‌తో జరిగిన చర్చలు సానుకూలంగా సాగాయని పేర్కొన్నారు. "గత రెండు రోజులుగా అమెరికా, ఇరాన్ మధ్య చర్చలు సానుకూలంగా జరిగాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. ఇరుదేశాల మధ్య జరిగిన చర్చల నేపథ్యంలో ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, ఇంధన మౌలిక సదుపాయాలపై అన్ని రకాల సైనిక దాడులను ఐదు రోజుల పాటు వాయిదా వేయాలని ఆదేశించాను" అని ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రకటన చేశారు. పశ్చిమాసియాలో తాము శాంతికోసం కృషి చేస్తామని ట్రంప్ తెలిపారు. మరోవారం రోజుల పాటు చర్చలు జరిగే అవకాశం ఉందని అన్నారు. చర్చల ఫలితంపై ఆధారపడి భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని స్పష్టం చేశారు.

## 20 నెలల్లోనే ఆర్సెలర్ మిట్టల్ ను తీసుకొచ్చాం... ఇదీ మా స్పీడు

అమరావతి, మార్చి 23 (భారత శక్తి): ఉత్తరాంధ్ర అభివృద్ధిలో మరో చారిత్రక అధ్యాయానికి శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో ప్రపంచ ప్రఖ్యాత ఆర్సెలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇండియా (AM/NS India) ఏర్పాటు చేయనున్న భారీ ఉక్కు కర్మాగారానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన ప్రకటించారు. కేవలం 20 నెలల వ్యవధిలోనే 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానంలో ఈ భారీ ప్రాజెక్టును సాకారం చేసి చూపించామని చంద్రబాబు అన్నారు. ఇది కేవలం స్టీల్ ప్లాంట్ కాదని, భవిష్యత్తులో ఓ స్టీల్ సిటీకి పునాది అని ఆయన అభివర్ణించారు.

**స్టీల్ ప్లాంట్ కాదు.. స్టీల్ సిటీ**

రెండు దశల్లో నిర్మితమయ్యే ఈ ఉక్కు పరిశ్రమ ద్వారా ఏటా 17.8 మిలియన్ టన్నుల ఉక్కు ఉత్పత్తి అవుతుందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా రూ.11,198 కోట్ల వ్యయంతో క్యాప్టివ్ పోర్టు కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. పరిశ్రమకు అవసరమైన ముడి ఇనుము సరఫరా కోసం ప్రత్యేక పైప్‌లైన్, జాతీయ రహదారిని అనుసంధానిస్తూ నాలుగు లైన్ల రహదారి నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. 2028 నాటికి ప్లాంట్‌లో మొదటి దశ ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, 2030 జూన్ నాటికి మొదటి బ్లాస్ట్ ఫర్నేస్, అదే ఏడాది డిసెంబరు నాటికి రెండో బ్లాస్ట్ ఫర్నేస్ నిర్మాణం పూర్తి చేస్తారని కార్యాచరణను వివరించారు. ఈ ప్రాజెక్టుతో ఉక్కు ఉత్పత్తి మాత్రమే కాకుండా విద్య, వైద్యం, ఉద్యోగాలతో ఈ ప్రాంత రూపురేఖలే మారిపోతాయని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు.

**20 నెలల్లోనే సాధించాం**

దేశంలోనే అత్యంత వేగంగా భూసేకరణ, అనుమతులు ఇచ్చి ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించిన ఘనత ఆంధ్రప్రదేశ్‌కే దక్కుతుందని చంద్రబాబు అన్నారు. పారిశ్రామిక అనుకూల ప్రభుత్వం, నైపుణ్యం కలిగిన మానవ వనరులు ఏపీ సొంతమని చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల్లోనే రాష్ట్రానికి రూ.20.35 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించగలిగామని తెలిపారు. ఈ ప్రాజెక్టు సాకారంలో కీలక పాత్ర పోషించిన ఆదిత్య మిట్టల్, మంత్రి నారా లోకేష్‌ను ఆయన అభినందించారు. పరిశ్రమ ఏర్పాటుకు భూములను త్యాగం చేసిన రైతులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**విశాఖ కేంద్రంగా ఆర్థిక ప్రగతి**

ఈ ప్రాజెక్టుతో విశాఖ ఎకనామిక్ రీజియన్.. నాలెడ్జ్ ఎకానమీ, పోర్టులు, స్టీల్, డేటా సెంటర్లు, ఐటీకి కీలక కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే విశాఖలో గూగుల్ డేటా సెంటర్ రాబోతోందని, దీని ద్వారా 15 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి రావడం దేశంలో ఇదే తొలిసారని గుర్తుచేశారు. టీసీఎస్, కాగ్నిజెంట్, రిలయన్స్, బీపీసీఎల్ వంటి దిగ్గజ సంస్థలు రాష్ట్రంలో పెట్టుబడులు పెడుతున్నాయని తెలిపారు. ఉత్తరాంధ్ర రేర్ ఎర్త్ మినరల్ హబ్‌గా మారుతుందని, పరిశ్రమలకు అవసరమైన నీటిని పోలవరం ద్వారా అందిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా మూలపేట పోర్టు, జూలైలో ప్రారంభం కానున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి ఉత్తరాంధ్ర అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాయని అన్నారు.

**స్థానిక యువతకే తొలి ప్రాధాన్యం**

ఆర్సెలర్ మిట్టల్ పరిశ్రమను ప్రభుత్వ ప్రాజెక్టుగా భావించి, నిర్మాణ పనులు వేగంగా పూర్తయ్యేందుకు పూర్తి సహకారం అందిస్తామని చంద్రబాబు స్పష్టం చేశారు. భూములు త్యాగం చేసిన రైతులకు అండగా నిలవాలని కంపెనీ యాజమాన్యాన్ని కోరారు. ముఖ్యంగా, ఈ పరిశ్రమలో తొలి ప్రాధాన్యంగా అనకాపల్లి జిల్లా యువతకు ఉద్యోగాలు కల్పించాలని ఆయన సూచించారు. స్థానిక యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేస్తున్నందుకు కంపెనీకి ధన్యవాదాలు తెలిపారు. 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్' నినాదాన్ని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ద్వారా విజయవంతం చేస్తామని పునరుద్ఘాటించారు.

## ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా ఇస్తున్నారు

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి):ఏవైనా ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రైతుభరోసా, పంటల బోనస్ ఇస్తున్నారని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు ఆరోపించారు. బడ్జెట్‌పై చర్చ సందర్భంగా ఆయన శాసనసభలో మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క సీజన్ కూడా ఎగ్గొట్టకుండా రైతుబంధు ఇచ్చిందని అన్నారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామని ఈ ప్రభుత్వం ఎన్నికల అజెండాలో, తొలి బడ్జెట్‌లో ప్రకటించి, తర్వాత దానిని రూ.12 వేలకు తగ్గించారని విమర్శించారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూడో పంటకు రైతుబంధు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇప్పుడు ఒక్క సీజన్‌కే ఇస్తున్నారని ఆరోపించారు. ఒక సీజన్ రైతు భరోసా ఎగ్గొట్టి రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని అన్నారు. మొదటి బడ్జెట్‌లో పెట్టినట్లు ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో పెట్టినవి కూడా అమలు చేయకపోవడం సిగ్గుచేటు అన్నారు. గత రెండు బడ్జెట్‌లలో పెట్టిన పంటల బీమా ఈ బడ్జెట్‌లో మాయమైందని అన్నారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని, రెండు బడ్జెట్‌లలో పెట్టారని గుర్తు చేశారు. కానీ ఒక్కసారి కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. జాబ్ క్యాలెండర్‌ను త్వరలో ప్రారంభిస్తామని చెప్పి గత బడ్జెట్‌లో చెప్పి ఈసారి ఆ ప్రస్తావన కూడా తేలేదని విమర్శించారు.

## సౌదీలోని అమెరికా స్థావరాలపై ఇరాన్ దాడులు

మార్చి 23 (భారత శక్తి):సౌదీ అరేబియా, బహ్రెయిన్‌లలోని అమెరికా సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసినట్లు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (ఐఆర్ జీసీ) సోమవారం ఉదయం ప్రకటించింది. ఈ పరిణామంతో గల్ఫ్ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ ఎయిర్ బేస్, బహ్రెయిన్‌లోని అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ ప్రధాన కార్యాలయం లక్ష్యంగా ఈ దాడులు జరిపినట్లు ఐఆర్ జీసీ ప్రతినిధి తెలిపారు. అమెరికా నిఘా విమానాలు ఈ స్థావరాల నుంచే కార్యకలాపాలు సాగిస్తున్నందున వాటిని లక్ష్యంగా చేసుకున్నామని చెప్పారు. ఈ దాడుల్లో అమెరికాకు చెందిన ఐదు కేసీ135 స్ట్రాటోట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. మరోవైపు, సౌదీ అరేబియా తమ దేశంపైకి వస్తున్న ఇరాన్ ఆయుధాలను అడ్డుకుంది. రియాద్, తూర్పు ప్రాంతం లక్ష్యంగా వచ్చిన రెండు డ్రోన్లు, ఒక బాలిస్టిక్ క్షిపణిని తమ వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేసినట్లు సౌదీ రక్షణ శాఖ ప్రకటించింది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ వైమానిక దళం ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని మౌలిక సదుపాయాలపై కొత్తగా బాంబు దాడులు మొదలుపెట్టింది. తమ లక్ష్యాలను సాధించే దిశగా యుద్ధం సరైన మార్గంలోనే సాగుతోందని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు వ్యాఖ్యానించారు. మరోపక్క, ఈ పరిణామాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను తీవ్ర సంక్షోభంలోకి నెట్టే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుత సంక్షోభం 1970ల నాటి చమురు సంక్షోభం కంటే భయంకరంగా మారవచ్చని అంతర్జాతీయ ఇంధన సంస్థ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ యుద్ధ ప్రభావం భారత్‌పైనా స్పష్టంగా కనిపిస్తోంది. చమురు, ఎల్‌పీజీ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతుండటంపై భారత పార్లమెంటులో ఆందోళన వ్యక్తమైంది.

## హైదరాబాద్ ను మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నాం

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి):పెరుగుతున్న జనాభా, వాహనాల రద్దీకి అనుగుణంగా హైదరాబాద్ నగరాన్ని అద్భుత నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. శాసనమండలిలో అభివృద్ధిపై జరిగిన చర్చలో పాల్గొన్న ఆయన, భవిష్యత్ అవసరాల దృష్ట్యా నగరాన్ని మూడు ప్రత్యేక జోన్లుగా విభజిస్తున్నట్లు వెల్లడించారు. క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ఈ ప్రణాళిక సాగనుంది. నగరంలోని కాలుష్యాన్ని తగ్గించేందుకు ఓఆర్ఆర్ లోపల ఉన్న పరిశ్రమలన్నింటినీ వెలుపలికి తరలిస్తామని ఆయన స్పష్టం చేశారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే లక్ష్యంగా అండర్‌పాస్‌లు, సర్ఫేస్ రోడ్లు మరియు భారీ ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టబోతున్నట్లు సీఎం తెలిపారు. ముఖ్యంగా శామీర్‌పేట, మేడ్చల్ వైపు వెళ్లే ప్రయాణికుల కోసం ప్రత్యేక కారిడార్లు నిర్మిస్తామని, దీని కోసం కేంద్ర ప్రభుత్వ సంస్థలతో మాట్లాడి భూసేకరణ చేస్తున్నామని పేర్కొన్నారు. మెట్రో రైలు విస్తరణకు ఎల్ అండ్ టీ సంస్థ ముందుకు రాకపోవడంతో కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వమే రూ.15 వేల కోట్లు కేటాయించి మెట్రోను స్వాధీనం చేసుకుందని, త్వరలోనే మరో 76 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తామని భరోసా ఇచ్చారు. నగర సుందరీకరణలో భాగంగా మూసీ నది పునరుజ్జీవనంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, డ్రైనేజీ వ్యవస్థను ఆధునికీకరిస్తే మూసీ సుందరీకరణ వేగంగా పూర్తవుతుందని రేవంత్ రెడ్డి వివరించారు. అలాగే 30 వేల ఎకరాల్లో అత్యాధునిక 'ఫ్యూచర్ సిటీ'ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని, గతంలో గుజరాత్ అభివృద్ధి కోసం అన్ని పార్టీలు ఎలాగైతే కలిశాయో, హైదరాబాద్ అభివృద్ధి కోసం కూడా ప్రతిపక్షాలు కలిసి రావాలని ఆయన పిలుపునిచ్చారు.

### 'రీల్' లైఫ్‌లోనైనా సీఎం అవుతా..

## రేవంత్ రెడ్డిని నేనే ముఖ్యమంత్రిని చేశా: మల్లారెడ్డి



హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి):మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఎక్కడ ఉంటే అక్కడ సందడి ఖాయం. తాజాగా తెలంగాణ అసెంబ్లీ లాబీల్లో మీడియా ప్రతినిధులతో ముచ్చటించిన మల్లన్న, తన మనసులోని అసలు కోరికను బయటపెట్టారు. రాజకీయంలో సీఎం ఎలాగూ కాలేను, కనీసం వెండితెరపై అయినా ముఖ్యమంత్రి పాత్ర పోషించాలని తనకు బలంగా ఉందని ఆయన వ్యాఖ్యానించారు. సినిమాల్లో సీఎం రోల్ వస్తే చేయడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అలా అయినా తన కోరికను తీర్చుకుంటానని నవ్వుతూ చెప్పారు. "రెడ్డి సామాజిక వర్గంలో రేవంత్ రెడ్డి తప్ప మరో పవర్‌ఫుల్ లీడర్ లేరని గతంలోనే చెప్పాను. ఒక రకంగా ఆయన్ను సీఎం చేసింది నేనే" అంటూ తనదైన శైలిలో చమత్కరించారు. రాజకీయాలు ఎలా ఉన్నా, తాను రేవంత్ రెడ్డి అన్నదమ్ములమేనని ఆయన స్పష్టం చేశారు. సినిమాలపై తనకున్న మక్కువను వివరిస్తూ.. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంలో తనకు విలన్ పాత్ర ఆఫర్ వచ్చిందని మల్లారెడ్డి వెల్లడించారు. దర్శకుడు హరీశ్ శంకర్ స్వయంగా అడిగినప్పటికీ, విలన్ వేషం వేయడం ఇష్టం లేక తాను సున్నితంగా తిరస్కరించానని చెప్పారు. విలన్ కంటే తనకు సీఎం లాంటి పవర్‌ఫుల్ పాత్రల పైనే ఆసక్తి ఉందని ఆయన హింట్ ఇచ్చారు.

# నీటి యుద్ధాలు రాకముందే మేల్కొందాం: హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : ప్రస్తుతం చమురు కోసం జరుగుతున్న యుద్ధాలు, భవిష్యత్తులో నీటి కోసం వచ్చే ప్రమాదం ఉందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు. జలవనరుల పరిరక్షణలో అలసత్వం వహిస్తే మనుగడ ప్రశ్నార్థకమవుతుందని, నీటి యుద్ధాలకు తావులేకుండా ఇప్పటి నుంచే పటిష్ట చర్యలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సోమవారం జేఎన్‌టీయూలో ఇండియన్ సొసైటీ ఆఫ్ జియోమేటిక్స్ హైదరాబాద్ చాప్టర్, ఓపెన్ జియోస్పేషియల్ కన్సార్టియం సంయుక్తంగా నిర్వహించిన 'వరల్డ్ వాటర్ డే' వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.





*** అంచనాలకు మించి జనాభా.. పెరుగుతున్న సవాళ్లు**

నగర జనాభా పెరుగుదలపై కమిషనర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 1.60 కోట్లుగా ఉన్న హైదరాబాద్ జనాభా 2050 నాటికి 3 కోట్లకు చేరుతుందని అంచనా వేశారు. ఈ నేపథ్యంలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచాల్సి ఉందన్నారు. ముఖ్యంగా గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ ద్వారా వరద ముప్పును అరికట్టడంతో పాటు భూగర్భ జల మట్టాలను పెంచవచ్చని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు హైడ్రా ఇప్పటికే ఆ దిశగా కార్యాచరణ మొదలుపెట్టిందని తెలిపారు.

పునరుద్ధరణ దశలు: మొదటి దశలో ఆరు చెరువులను ఎంపిక చేయగా, మూడు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. మిగతా మూడు సిద్ధంగా ఉన్నాయి. రెండో దశలో మరో 18 చెరువులను అభివృద్ధి చేయనున్నారు.

**కనుమరుగైన 61 శాతం చెరువులు**

నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (NRSC) గణాంకాలను ప్రస్తావిస్తూ, 1975 నుంచి 2023 మధ్య కాలంలో నగరంలో 61 శాతం చెరువులు మాయమయ్యాయని రంగనాథ్ వెల్లడించారు. నగరంలోని 1300 చెరువుల్లో దాదాపు 700 కనుమరుగయ్యాయని, మిగిలిన వాటిలో 60 శాతం ఆక్రమణల పాలయ్యాయని పేర్కొన్నారు. గతంలో ఆక్రమణల తొలగింపు కేవలం కాగితాలకే పరిమితమైందని, ఇప్పుడు హైడ్రా ఆ విమర్శలకు చరమగీతం పాడుతూ క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటోందని స్పష్టం చేశారు. "మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు 14 ఎకరాలకు కుంచించుకుపోయింది. హైడ్రా చొరవతో ఆక్రమణలు తొలగించి దానిని 29 ఎకరాలకు విస్తరించాం. తొలినాళ్లలో విమర్శించిన వారే, ఇప్పుడు అక్కడ పిక్నిక్ స్పాట్‌లా మారిన వాతావరణాన్ని చూసి అభినందిస్తున్నారు." అని కమిషనర్ వివరించారు.

*** రియల్ ఎస్టేట్‌లో మార్పు.. పర్యావరణమే లక్ష్యం**

హైడ్రా చర్యల వల్ల ప్రజల్లో, రియల్టర్లలో స్పష్టమైన మార్పు వచ్చిందని కమిషనర్ తెలిపారు. ఎఫ్‌టీఎల్ (FTL), బఫర్ జోన్ల పరిధిలో ఇళ్లు నిర్మించడానికి రియల్టర్లు భయపడుతున్నారని, ప్రజలు కూడా కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదని చెప్పారు. ఇది పర్యావరణ పరిరక్షణకు శుభపరిణామమని పేర్కొన్నారు.

**సాధించిన ఫలితాలు:**

బడా బాబుల ఆక్రమణల నుంచి 1350 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నారు. ప్యాట్నీ నాలా ఆక్రమణల తొలగింపుతో 27 కాలనీలకు వరద ముప్పు తప్పింది. అమీర్‌పేట వంటి లోతట్టు ప్రాంతాల్లో నాలాల పూడికతీత వల్ల నీరు నిలిచే సమస్య పరిష్కారమైంది. ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ వైస్ ఛాన్సలర్ ప్రొ. కిషన్ కుమార్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రొ. నరసింహారెడ్డి, డైరెక్టర్ డా. మృత్యుంజయ రెడ్డి తదితరులు పాల్గొని, జలవనరుల పరిరక్షణలో హైడ్రా చేస్తున్న కృషిని అభినందించారు.



# శ్రీరామనవమి శోభాయాత్రకు భాగ్యనగరం రెడీ!

*** 3 వేల మందితో భారీ బందోబస్తు.. డ్రోన్లతో నిఘా..**

*** డీజేలు వద్దు.. నార్మల్ సౌండ్ సిస్టమ్ వాడాలి.**

*** మధ్యాహ్నం 1 గంటకే యాత్ర ప్రారంభించాలి: సీపీ సజ్జనర్**

*** జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్‌తో కలిసి రూట్ మ్యాప్ పరిశీలన**

హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి): నగరంలో శ్రీరామనవమి శోభాయాత్రను వైభవంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్కారు యంత్రాంగం కసరత్తు పూర్తి చేసింది. సోమవారం సీతారాంబాగ్ లోని ద్రౌపది గార్డెన్స్‌లో పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. యాత్ర ఏర్పాట్లు, భద్రతపై అధికారులకు సీపీ దిశానిర్దేశం చేశారు.

**అడుగడుగునా నిఘా.. షీ టీమ్స్ పహారా**

సీతారాంబాగ్ నుంచి హనుమాన్ వ్యాయామశాల వరకు సాగే ఈ యాత్రకు దాదాపు 3 వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీపీ ప్రకటించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా చైన్ స్నాచింగ్ లు జరగకుండా క్రైమ్ టీమ్స్, మహిళల రక్షణ కోసం షీ టీమ్స్ రంగంలో ఉంటాయన్నారు. గతేడాది వాహనాల బ్రేక్‌డౌన్ వల్ల యాత్ర ఆలస్యమైందని, ఈసారి అలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**డీజేలు బంద్.. రూల్స్ ఇవే!**




- * శోభాయాత్ర నిర్వహణపై సీపీ కీలక సూచనలు చేశారు.
- * యాత్రను మధ్యాహ్నం 1 గంటకే మొదలుపెట్టాలి.
- * పెద్ద వాహనాలతో ఇబ్బంది కలగకుండా ముందస్తుగా ట్రయల్ రన్ చేయాలి.
- * హెల్త్ ప్రాబ్లమ్స్ రాకుండా డీజేలకు బదులు సాధారణ సౌండ్ సిస్టమ్ వాడాలి.
- * ఇతర వర్గాల మనోభావాలు దెబ్బతినేలా పాటలు, స్పీచ్ లు ఉండకూడదు.
- * ప్రైవేట్ వ్యక్తులు డ్రోన్లు వాడాలంటే పోలీసుల పర్మిషన్ తప్పనిసరి.

రోడ్ల మరమ్మతులు పూర్తి: జీహెచ్ఎంసీ కమిషనర్ భక్తులకు ఇబ్బంది కలగకుండా రోడ్ల రిపేర్లు, వీధి దీపాల ఏర్పాటు పూర్తి చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. యాత్రలో పాల్గొనే వాహనాల ఎత్తు విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనంతరం అధికారులు శోభాయాత్ర సాగే రూట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ మీటింగ్‌లో అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీలు జోయల్ డేవిస్, శ్వేత, జోనల్ కమిషనర్ ముకుంద రెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు భగవంతరావు, గోవింద్ రాఠి, ఆనంద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# దొంగ దొరికినా.. చర్యలు ఎక్కడ?

- * మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ లో అక్రమ అసెస్‌మెంట్ పర్వం.. చూసీచూడనట్లు వదిలేస్తున్న ఉన్నతాధికారులు!
- * ఒక సర్కిల్ ఫైలు మరో సర్కిల్‌లో క్లియరెన్స్.. జోనల్ కమిషనర్ మౌనం వెనుక మర్మమేంటి?
- * సరూర్నగర్ సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ అవినీతి తేటతెల్లమైనా, తప్పుడు నివేదికలతో జోనల్ కమిషనర్ను బురిడీ కొట్టిస్తున్న వైనం..!










హైదరాబాద్, మార్చి 23 (భారత శక్తి) : అక్రమాలను అరికట్టాల్సిన అధికారులే అక్రమార్కులకు కొమ్ముకాస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ సర్కారు ఖజానాకు గండి కొడుతున్నారు. ఆధారాలతో సహా తప్పులు బయటపడి నెలలు గడుస్తున్నా.. బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో ఉన్నతాధికారులు మీనమేషాలు లెక్కించడం పలు అనుమానాలకు తావిస్తోంది. ముఖ్యంగా ఎల్బీనగర్ జోన్ పరిధిలోని అక్రమ అసెస్‌మెంట్ల వ్యవహారం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

**హద్దులు దాటి.. అసెస్‌మెంట్లు చేసి!**

హయాత్ నగర్ సర్కిల్ పరిధిలోకి వచ్చే ప్రాపర్టీలకు సరూర్ నగర్ (సర్కిల్ 12) అధికారులు అసెస్‌మెంట్ చేయడం వెనుక పెద్ద నెట్‌వర్కే నడిచినట్లు తెలుస్తోంది. కోర్టు వివాదంలో ఉన్న ఇంటికి (నెంబర్: 38439/1, మన్సూరాబాద్ డివిజన్) నిబంధనలకు విరుద్ధంగా పిటిఎన్ నెంబర్ (1050315474) కేటాయించి క్లీన్ చిట్ ఇవ్వడం వెనుక లక్షల రూపాయల చేతులు మారినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

**శ్రీనివాస్ 'లాగిన్' మాయాజాలం..**

సరూర్ నగర్ డిప్యూటీ కమిషనర్ భోనగిరి శ్రీనివాస్, ఏఎంసి శ్రీనివాసరావుల లాగిన్ల ద్వారానే ఈ అక్రమ ప్రక్రియ పూర్తయినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయి. గతేడాది జరిగిన ఈ తతంగంపై ప్రశ్నిస్తే.. 'పొరపాటు జరిగింది', 'కింది స్థాయి అధికారులు ఫైలు పంపారు కాబట్టి సంతకం చేశాం' అంటూ నీళ్లు నములుతున్నారు. తప్పు జరిగిందని స్వయంగా అధికారులే ఒప్పుకున్నా, సదరు ఫైళ్లను బ్లాక్ చేసి చేతులు దులుపుకుంటున్నారే తప్ప, ఈ అక్రమానికి అసలు సూత్రధారులు ఎవరనేది మాత్రం బయటపెట్టడం లేదు.

*** జోనల్ కమిషనర్ ఎందుకు స్పందించట్లేదు?**

జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ దృష్టికి ఈ అక్రమ అసెస్‌మెంట్ల వ్యవహారం వెళ్లినా, ఇప్పటి వరకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఆధారాలతో సహా ఫిర్యాదులు అందుతున్నా విచారణ పేరుతో కాలయాపన చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 'ఇంటి దొంగల'ను కాపాడటంలో ఉన్నతాధికారులపై ఏదైనా రాజకీయ ఒత్తిడి ఉందా? లేక శాఖాపరమైన లోపాలే కారణమా? అన్నది చర్చనీయాంశంగా మారింది.

*** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ లోను ఇదే పరిస్థితి!**


కేవలం ఎల్బీనగర్ జోన్ మాత్రమే కాదు.. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ ఇలాంటి అక్రమాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి హయాంలో జరుగుతున్న కార్యకలాపాలపై కూడా ప్రజల నుంచి అసహనం వ్యక్తమవుతోంది. అక్రమ నిర్మాణాలకు పర్మిషన్లు ఇవ్వడం, రెవెన్యూ విభాగంలో అవకతవకలు జరుగుతున్నా కఠినంగా వ్యవహరించకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

*** ఖజానాకు భారీ గండి**

గడ్డిఅన్నారం, దిల్ సుఖ్ నగర్ వంటి భారీ కమర్షియల్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ, కమర్షియల్ టాక్స్‌ను తక్కువ చేసి చూపిస్తూ జీహెచ్ఎంసీ ఆదాయానికి కోట్లాది రూపాయల గండి కొడుతున్నారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఈ అక్రమ నెట్‌వర్క్ మరింత విస్తరించే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# హుండీలో భక్తి పేరుతో... పేపర్ నోట్ల కలకలం!

ఎల్బీనగర్, మార్చి 23 (భారత శక్తి) : కర్మన్ ఘాట్ హనుమాన్ ఆలయం హుండీ లెక్కింపులో ఆశ్చర్యకర ఘటన వెలుగులోకి వచ్చింది. భక్తులు సమర్పించిన నగదు మధ్య డూప్లికేట్ పేపర్ కరెన్సీ నోట్లు బయటపడటం కలకలం రేపింది. ఇందులో 100, 200, 500 రూపాయల "చిల్డ్రన్స్ బ్యాంక్" పేరుతో ఉన్న పేపర్ నోట్లు అసలు కరెన్సీతో కలిపి హుండీలో వేయబడినట్లు గుర్తించారు. ఈ ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, పవిత్ర ఆలయ స్థలాల్లో కూడా ఇలాంటి చర్యలు జరగడం బాధాకరమని అంటున్నారు. దీనిపై ఆలయ అధికారులు స్పందించి, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు.



# జీహెచ్ఎంసీ 'ప్రజావాణి'కి 56 దరఖాస్తులు..

హైదరాబాద్, మార్చి 23 (భారతశక్తి): నగరవాసుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి 56 విన్నపాలు వచ్చాయి. ప్రజల నుంచి అందిన ఈ ఫిర్యాదుల్లో అత్యధికంగా టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, ఆస్తి పన్ను విభాగాలకు చెందినవే ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

**క్షేత్రస్థాయిలో పరిష్కారం చూపాలి**

కార్యక్రమంలో పాల్గొన్న అదనపు కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రజావాణిలో అందిన ప్రతి అర్జీని సంబంధిత విభాగాల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. బాధితులకు సకాలంలో న్యాయం జరిగేలా చూడాలని, పరిష్కారంలో జాప్యం వహించరాదని స్పష్టం చేశారు.




**ముఖ్య అంశాలు:**

- * మొత్తం విన్నపాలు: 56
- * పాల్గొన్న అధికారులు: అదనపు కమిషనర్ సత్యనారాయణ, అదనపు ఎస్పీ నరసింహ రెడ్డి, సీసీపీ శ్రీనివాస్ మరియు ఇతర విభాగాల ఉన్నతాధికారులు.
- * ప్రధాన ఫిర్యాదులు: డ్రైనేజీ సమస్యలు, అక్రమ కట్టడాలు, వీధి దీపాల నిర్వహణపై నగరవాసులు అధికారులకు మొరపెట్టుకున్నారు.
- * అనంతరం వివిధ విభాగాల పురోగతిని అధికారులు సమీక్షించారు. నిర్ణీత కాలపరిమితిలోగా సమస్యలను పరిష్కరించి, ఆ వివరాలను ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అధికారులను కోరారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.